

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 7-12-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 232 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం, తిథి: తదియ రా.6:25 తదపరి చవితి, నక్షత్రం: పునర్వసు తె.4:12 తదుపరి పుష్యమి, వర్జ్యం: సా.5:12-6:40, దుర్ముహూర్తం: సా.4:08-4:52, అమృత ఘడియలు: రా.2:00-3:28, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 6:36, సూర్యాస్తమయం: 5:36 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సెంటిమెంట్‌పై సెటిల్‌మెంట్లా?

భక్తులు ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్లు ఏమిటి? టీటీడీ పరకామణిలో రూ.72వేలు కొట్టేయడం అనేది చిన్న దొంగతనమని జగన్ అంటున్నారు. అలాంటి వాటిని సమర్థించడం, సెటిల్‌మెంట్లు చేయాలని చూడటం మహాపాపం కాదా? చుక్క పాలు లేకుండానే నెయ్యి తయారు చేసి, దేవుడి ప్రసాదం తయారీకి సరఫరా చేసిన ఘనులు వైసీపీ నేతలు.

– సీఎం చంద్రబాబు

శ్రీవారి కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో రాజీ ఏమిటి?



లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- ఇంతకంటే మహా పాపం ఉంటుందా?
- బాబాయ్ హత్యనే సెటిల్ చేద్దామని చూశారు
- వారే ఇప్పుడు పరకామణిపైనా మాట్లాడుతున్నారు
- దేవుడి హుండీ సొమ్ము చోరీ చేయడం చిన్న తప్పా?
- భక్తుల మనసు గాయపడేలా జగన్ వ్యాఖ్యలు
- దేవుడన్నా, భక్తుల మనోభావాలన్నా ఆయనకు లెక్కలేదు
- రాజధానిపై కొందరికి కడుపు మండుతోంది
- కోకాపేటకు మించిన అభివృద్ధిని అమరావతిలో చూస్తారు
- మీడియా ప్రతినిధులతో భేటీలో చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): "బాబాయ్ హత్యనే సెటిల్ చేసుకుందామని చూసిన వ్యక్తి పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల పరకామణి చోరీ వ్యవహారాన్ని కూడా సెటిల్ చేయాలని చూశారు. ఇంతకంటే ఘోరమైన విషయం ఉంటుందా? భక్తుల సెంటిమెంట్ విషయంలో సెటిల్‌మెంట్లు ఏమిటి?" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశ్నించారు. శ్రీవారి పరకామణి చోరీ వ్యవహారం చిన్న దొంగతనం అంటూ జగన్ చేసిన వ్యాఖ్యలు భక్తుల మనసులను గాయపరిచాయన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మీడియాతో జరిపిన ఇష్టాగోష్ఠిలో మాజీ సీఎం జగన్‌పై చంద్రబాబు విరుచుకుపడ్డారు. జగన్‌కు దేవుడన్నా లెక్కలేదని, ఏడుకొండలస్వామి భక్తుల మనోభావాలన్నా లెక్కలేదని, ఆలయాల పవిత్రత అన్నా లెక్కలేదని

మిగతా 13వ పేజీలో...

తప్పుడు కేసులు కోర్టుల్లో నిలబడవు

- ముఖ్యమంత్రిగా ఉన్నంత మాత్రానే కొట్టేయరు
- జిల్లా కమిటీల జాప్యంపై చంద్రబాబు సీరియస్
- 13 లోగా పూర్తిచేయాలని పార్టీ నేతలకు ఆదేశం

13



క్లిక్ దూరంలో రైతుబజార్లు

11

- ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే నిమిషాల్లోనే ఇంటికి కూరగాయలు
- రైతుబజార్ ధరలకే డోర్ డెలివరీ
- విశాఖలో పైలట్ ప్రాజెక్టు
- ప్రస్తుతం డిజిరైతుబజార్‌ఏపీ.కామ్ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్
- త్వరలో అందుబాటులోకి యాప్



ఇండిగో విమాన సర్వీసుల రద్దుతో బెంగళూరు విమానాశ్రయంలో కిక్కిరిసిన ప్రయాణికులు, వారి లగేజీ

ఆగని ఇండిగోల

- శనివారం మరో 800 సర్వీసులు రద్దు
- కొనసాగుతున్న ప్రయాణికుల ఇబ్బందులు
- రీఫండ్ ఇవ్వాలని ఇండిగోకు కేంద్రం ఆదేశం
- సీఈవోను తొలగించాలని కోరనున్న కేంద్రం!

న్యూఢిల్లీ/హైదరాబాద్/బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇండిగో 'సంక్షోభం' కొనసాగుతోంది. శనివారం వందలకొద్దీ సర్వీసులు నిలిచిపోయాయి. ఈ సంక్షోభాన్ని ఇతర ఎయిర్‌లైన్స్ 'సొమ్ము' చేసుకుంటుండటంపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. దూరాన్ని బట్టి గరిష్ఠ చార్జీలపై నియంత్రణ విధించింది. భారీస్థాయిలో విమానాల రద్దు, ఒక్కసారిగా పెరిగిన చార్జీలతో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారని పేర్కొంది. ఈ క్రమంలో ప్రజా ప్రయోజనం కోసం చార్జీలపై నియంత్రణ నిర్ణయం తీసుకున్నట్టు

మిగతా 14వ పేజీలో...

బాధ్యులెవరో తేలుస్తాం

- కఠిన చర్యలు చేపడతాం
- ఇప్పటికే డీజీసీఏ దర్యాప్తు
- వారంలో నివేదిక
- రెండు సంస్థల ఆధిపత్యం కుదరదు
- 'ఆంధ్రజ్యోతి'తో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

దైవసన్నిధిలో నేరాలకు జగన్ వత్తాసు



ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను బొక్కలో వేయాలని జగన్ రెడ్డి కోరుతున్నారు. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా అధికారం అనుభవించిన జగన్ రెడ్డి కూడా అమలు చేయలేకపోయిన ఎన్నికల హామీలు ఎన్నో ఉన్నాయి.

అవినీతి ఆరోపణలపై కొంత కాలం జైలు జీవితం గడిపిన జగన్ రెడ్డి తనవలే మిగతా నాయకులు కూడా జైలు జీవితం గడపాలని కోరుకుంటున్నట్టు ఉంది. అందుకే కాబోలు, తాను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో జైల్లో పెట్టించారు.

జగన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మద్యం సరఫరాలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన విషయం అందరికీ తెలిసిందే! అయినా... 'మద్యం విషయంలో కేసు పెట్టడానికి ఏముంది? ఏమీ జరగని చోట కేసు కట్టి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్ కసిరెడ్డి వంటి వారిని జైల్లో పెట్టడం ఏమిటి?' అని అమాయకంగా ప్రశ్నించే ప్రయత్నం చేయడమే జగన్ రెడ్డిలోని గడుసుతనానికి నిదర్శనం.

భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన తిరుమల లడ్డూ తయారీకి నాసిరకం నెయ్యి వాడిన విషయమై జగన్ రెడ్డి చేస్తున్న వాదన రోతగా ఉంది. తిరుమల లడ్డూ కోసం గతంలో చిత్తూరు డెయిరీతోపాటు ఒకటి రెండు సహకార డెయిరీల నుంచి మాత్రమే నెయ్యిని సేకరించే వారు. ఈ నిబంధనలను జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన పాలక మండలి సవరించింది.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో



విశాఖలో పట్టేశారు

- 2-1తో సిరీస్ భారత్ సొంతం
- యశస్వీ జైస్వాల్ శతకం
- అదరగొట్టిన రోహిత్, కోహ్లీ
- ఆఖరి వన్డేలో దక్షిణాఫ్రికా చిత్తు
- ప్లేయర్ ఆఫ్ ది సిరీస్.. విరాట్

10



అమెరికాలో అగ్నిప్రమాదం.. తెలంగాణ విద్యార్థిని మృతి



- అపార్టుమెంటులో మంటలు వ్యాపించి మరణించిన ఉడుముల సహజారెడ్డి
- ఎంఎస్ చదివేందుకు 4 ఏళ్ల క్రితం అమెరికాకు..

2

సైన్యానికి త్రీడీ బంకర్లు!

14

హైదరాబాద్ ఐఐటీ స్టార్టప్ ఆవిష్కరణ.. రోబోటిక్ హస్తంతో త్రీడీ ప్రింటింగ్



డల్లా‌స్‌లో లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

డల్లాస్ చేరుకున్న లోకేశ్

- ఘన స్వాగతం పలికిన ప్రవాసాంధ్రులు
- నేడు 'తెలుగు డయాస్పోరా'తో ప్రసంగం

13

కాకాణి 'ఫైల్స్' మిస్సింగ్!

- 2014 నాటి కల్తీ మద్యం పంపిణీ కేసులో నెల్లూరు కోర్టులో కీలక ఫైళ్లు అదృశ్యం
- 2018 చివర్లోనే గుర్తించిన బెజవాడ ప్రత్యేక కోర్టు
- 2019లో వైసీపీ గెలవడంతో కేసు మూలకు
- తాజాగా ఫైళ్ల గల్లంతు విషయం వెలుగులోకి
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి కేసులో కూడా..

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

అదేం వింతో కానీ మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పలు నేరారోపణలతో కోర్టు కెక్కిన కేసులకు సంబంధించిన ఫైళ్లు వరుసగా అదృశ్యం అవుతున్నాయి. సురక్షితమైన న్యాయస్థానం(నెల్లూరు) నుంచి కాకాణి కేసులకు సంబంధించిన ఫైళ్లు మాయం కావడం పట్ల విస్తుపోతున్నారు. 2023లో కాకాణిపై మాజీ మంత్రి, ప్రస్తుత సర్వేపల్లి

మిగతా 12వ పేజీలో...



బందరు కోటలో ఉన్న ఆయుధాగారం

2

వెలుగుల ఆనవాళ్లు

డచ్ సామ్రాజ్యానికి చిరునామా బందరు కోట

- నాలుగు శతాబ్దాల క్రితం వర్తక కేంద్రంగా మచిలీపట్నం
- స్థానిక పరిశ్రమల నుంచి భారీగా ఎగుమతులు
- నేటికీ దర్శనమిస్తున్న ఆయుధాగారం, స్విమ్మింగ్ పూల్
- వలందపాలెంలో నాటి సమాధులు
- పర్యాటక కేంద్రంగా మారిస్తే ఎంతో అభివృద్ధి

అమెరికాలో అగ్నిప్రమాదం..
తెలంగాణ విద్యార్థిని మృతి

- స్వస్థలం జనగామ జిల్లాలోని గుంటూరుపల్లి
- ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్న కుటుంబం
- ఎంఎస్ చదివేందుకు నాలుగేళ్ల క్రితం అమెరికాకు



ఉడుముల సహజారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో అగ్నిప్రమాదం సంభవించి తెలంగాణకు చెందిన ఉడుముల సహజారెడ్డి(24) అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా చౌదరిగూడలోని శ్రీనివాసనగర్‌లో నివాసముండే ఉడుముల జయాకర్‌రెడ్డి, మరియా శైలజ దంపతుల కుమార్తె అయిన సహజారెడ్డి.. ఎంఎస్ అభ్యసించేందుకు నాలుగేళ్ల క్రితం అలబామా ప్రాంతంలోని బర్మింగ్‌హామ్‌కు వెళ్లారు. అక్కడ పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంటున్నారు. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. కాగా, భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి సహజారెడ్డి నిద్రలో ఉన్న సమయంలో వీరి అపార్టుమెంట్ పక్కనున్న భవనంలో మంటలు చెలరేగాయి. ఆపై మంటలు వీరి అపార్టుమెంట్‌కూ వ్యాపించాయి. అపార్టుమెంట్‌లో మొత్తం 13 మంది ఉండగా.. మంటలను గమనించిన 10 మంది తప్పించుకున్నారు. నిద్రలో ఉన్న సహజ సహా ముగ్గురు మంటలను గుర్తించకపోవడంతో అందులో చిక్కుకున్నారు. మంటలకు తోడు పొగ వ్యాపించడంతో తప్పించుకునే పరిస్థితి లేకుండాపోయింది. అదే సమయంలో కాలుతున్న చెక్కలు సహజపై పడడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి.. సహజను బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, అధికారుల ద్వారా కూతురి మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు హతాశులయ్యారు. చదువు పూర్తి చేసుకొని త్వరలో ఇంటికి వస్తుందని ఎదురు చూస్తూ.. ప్రతి రోజూ వీడియో కాల్‌లో మాట్లాడే తమ కూతురు ఇక తిరిగి రాదన్న విషయం తెలిసి గుండెలవిసేలా రోదిస్తున్నారు. సహజ తండ్రి ఉడుముల జయాకర్‌రెడ్డి స్వస్థలం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని గుంటూరుపల్లి కాగా, ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శైలజ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో టీచర్‌గా పనిచేసి.. ఇటీవల డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లారు. సహజ మరణవార్త విని ఇటు చౌదరిగూడ, అటు గుంటూరుపల్లిలో విషాదం అలముకుంది. సహజ మృతిపై అమెరికాలోని భారత ఎంబసీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సహజ మృతదేహం ఈ నెల 11న గుంటూరుపల్లికి చేరుకుంటుందని, అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెండింగ్ పెన్షన్ సమస్యలను పరిష్కరించాలి

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం డిమాండ్

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పింఛన్లు, గ్రాట్యుటీ, కమ్యుటేషన్ బిల్లులు వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీ కమిషన్ వేసి ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్‌కే రియాజ్, అధ్యక్షులు టీఎంబీ బుచ్చిరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం విజయవాడలోని పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల అసోసియేషన్ భవనంలో వారు మీడియాతో మాట్లాడారు. 11వ పీఆర్‌సీలో అమలైన అదనపు పెన్షన్ విధానాన్ని పదో పీఆర్‌సీ తరహాలో కొనసాగించాలన్నారు. కమ్యూటేషన్ కాలపరిమితి 15 నుంచి 11 సంవత్సరాలకు తగ్గించిన జీవోను తక్షణమే అమలు చేయాలని, భార్యా/భర్తలకు కుటుంబ పెన్షన్ వర్తించేలా మార్పులు చేయాలని అన్నారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లులు, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, పీఆర్‌సీ, డీఆర్ బకాయిలు, ఈహెచ్‌ఎస్ క్లెయిమ్స్ ఆలస్యం లేకుండా చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ కింద మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను పూర్తిగా క్యాష్‌లెస్ విధానంలో చెల్లించాలన్నారు. రూ.5 లక్షలకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు మంజూరు చేయాలని, పెన్షన్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక డైరెక్టరేట్ వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వెలుగుల డచ్ సామ్రాజ్యానికి చిరునామా బందరు కోట

ఆనవాళ్లు..



ఆయుధాగారానికి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

నాలుగు శతాబ్దాల క్రితం వర్తక కేంద్రంగా మచిలీపట్నం..
స్థానిక పరిశ్రమల నుంచి భారీగా ఎగుమతులు
నేటికీ దర్శనం ఇస్తున్న ఆయుధాగారం, స్విమ్మింగ్ పూల్
వలందపాలెంలో నాటి సమాధులు.. పర్యాటక కేంద్రంగా మారిస్తే ఎంతో అభివృద్ధి

(మచిలీపట్నం టౌన్- ఆంధ్రజ్యోతి)

విదేశీ వ్యాపారంతో ఆ ప్రాంతం నాలుగు శతాబ్దాల క్రితం ఓ వెలుగువెలిగింది. ఆ తర్వాత ఆధిపత్య పోరాటాలతో ఆ వెలుగులు మసకబారాయి. నాటి వైభోగానికి నిలువుటద్దంలా ప్రస్తుతం కృష్ణాజిల్లా మచిలీపట్నంలో డచ్‌వారి కోటలోని పురాతన కట్టడాలు దర్శనమిస్తున్నాయి. ఆనాటి చారిత్రక విశేషాలను అవి మనకు కథలుగా చెబుతున్నాయి. 1602 నుంచి 1697 వరకు డచ్ వారు బందరుకోట కేంద్రంగా ఈ ప్రాంతాన్ని ఏలారు. వీరికంటే ముందు పోర్చుగీసువారు, స్పెయిన్ దేశీయులకు మచిలీపట్నంపై ఆధిపత్యం ఉండేది. ఆ సమయంలో సుగంధ ద్రవ్యాలు అమ్ముకునేందుకు డచ్ (నెదర్లాండ్స్) దేశం వారు మచిలీపట్నం వచ్చారు. ఇక్కడి చేనేత దుస్తుల వ్యాపారంపై వారి కన్నుపడింది. 1588లో స్పెయిన్ నౌకాదళం మీద డచ్ ఆధిక్యత సంపాదించింది. 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ ఏర్పాటు తరువాత గిడ్డంగులు నిర్మించారు. సైనికులకు స్థావరాలు ఏర్పాటు చేశారు. అదే ఏడాది డచ్ అడ్మిరల్ లాండర్ హాగర్ ఇక్కడకు వచ్చారు. మచిలీపట్నంను వర్తక స్థావరంగా మార్చారు. ఫ్యాక్టరీలు స్థాపించిన తరువాత ఎగుమతులు, దిగుమతులు పెరిగాయి. అప్పట్లో బందరు ఓడరేవు ఒక వెలుగు వెలిగింది. 900 టన్నుల బరువు మోసే భారీ ఓడలు ఇక్కడకు వచ్చేవి.

సుందరనగరం.. మచిలీపట్నం

మచిలీపట్నం వలందపాలెంలో డచ్ వారు నివసించేవారు. వారి సమాధులు మనకు ఇప్పటికీ కనబడతాయి. ఇక్కడే వారి బోట్ క్లబ్‌లు కూడా ఉండేవి. 1672లో డచ్‌కు చెందిన మతాధిపతి ఫెర్నాండెజ్ నావరిట్ మచిలీపట్నంను సుందరమైన పట్టణంగా వర్ణించారు. ఇక్కడి చేనేత, కలంకారీ వస్త్రాలను డచ్ మహిళలు ఎంతో ఇష్టపడేవారు. అప్పట్లో బందరులో వజ్రాలు, వైఢూర్యాల వ్యాపారాలు జరిగేవి. వెండి, రాగితో ఇక్కడ తయారు చేసిన ఆభరణాలు, వస్తువులకు డచ్‌లో ఎక్కువ గిరాకీ ఉండేది. డచ్ కోటకు దగ్గరలో ఎవరైనా తప్పు చేస్తే ఉరితీసే గది ఉండేది. మనకు ఇప్పటికీ బందరు కోటలో డచ్ వారి జైలు, స్విమ్మింగ్ పూల్ కనబడుతూనే ఉన్నాయి. ఇక్కడి తుపాకీ మందు తయారీ పరిశ్రమ, ఆయుధాగారంలో తయారు చేసినవి వారు ఇతర ప్రాంతాలకు విక్రయించే వారు. ఇప్పటికీ తుపాకీ పరిశ్రమ మనకు బందరుకోట వద్ద కనబడుతుంది. ఔరంగజేబు యుద్ధాన్ని ప్రకటించిన తరువాత బందరు పట్టణాన్ని డచ్ వారు విడిచి వెళ్లిపోయారు.



బందరుకోట వద్ద డచ్ వారి సమాధులు



బ్రిటీషు వారి స్థావరాల వద్ద బ్రిటన్ అధికారులు ఏర్పాటు చేసిన శిలాఫలకం





1864లో ఉప్పెనకు 30వేల మంది మృతి చెందినప్పుడు ఏర్పాటు చేసిన స్మారక స్థూపం

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే..

చరిత్రకు సాక్ష్యంగా ఉన్న బందరుకోట పురాతత్వ శాఖ ఆధీనంలో ఉంది. దీనిని పర్యాటక కేంద్రంగా రూపొందిస్తే ఆనాటి విశేషాలు నేటి తరానికి తెలుస్తాయి. ఇది కూడా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెంది స్థానికులు ఉపాధి లభిస్తుంది. విదేశాల్లో ఉన్న నాటి డచ్ వంశీయులు ఇక్కడ తమ వారి సమాధులను చూసేందుకు అప్పుడప్పుడు వస్తూనే ఉన్నారు. ఈ సమాధులు పురావస్తు శాఖ ఆధీనంలోనే ఉన్నాయి. కానీ పలు శ్మశానాలు ఆక్రమణలకు గురయ్యాయి.

పెరిగిన చలి

అల్లూరి జిల్లాలో 8.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

విశాఖపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం మీదుగా తూర్పుగాలులు వీయకపోవడంతో రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు బలహీనంగా మారాయి. దీంతో అన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంది. అదే సమయంలో ఉత్తర, మధ్యభారతం మీదుగా రాష్ట్రంపైకి తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ఒడిశా, తెలంగాణకు ఆనుకుని ఉన్న కోస్తాలోని అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా దళపతిగూడలో 8.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, గత నవంబరు రెండోవారం నుంచి ఉధృతంగా చలిగాలులు వీచాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న గాలుల తీవ్రతతో చలి పెరుగుతోందని వాతావరణ శాఖ తెలిపింది.



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో శనివారం ఉదయం 9 గంటలకు దట్టంగా అలుముకున్న పొగమంచు

అధిక వృద్ధి.. అల్ప ద్రవ్యోల్బణం
ఇదే భారత ప్రగతి నమూనా

- నాడు 'హిందూ వృద్ధి రేటు' అని ఎగతాళి
- నేడు అనిశ్చిత ప్రపంచంలో విజయగాథలు
- ప్రజలపై విశ్వాసమే ప్రభుత్వ బలం: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, డిసెంబరు 6: అధిక వృద్ధి, అల్ప ద్రవ్యోల్బణమే భారత దేశం అమలు చేస్తున్న అభివృద్ధి నమూనా అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ కారణంగా దేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రగతికి దోహదకారిగా మారిందని చెప్పారు. రెండో త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి రేటు 8.2శాతం నమోదు చేయడాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాఖ్య చేశారు. ఇది సామాన్య విజయమేమీ కాదని అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన 23వ హిందూస్థాన్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన ప్రసంగిస్తూ దేశం సాధించిన పురోగతిని వివరించారు. గతంలో దేశ ఆర్థిక ప్రగతిని హిందూ మతంతో ముడిపెట్టి వ్యాఖ్యలు చేసేవారంటూ విమర్శించారు. దశాబ్దాల క్రితం దేశ ఆర్థిక ప్రగతి చాలా మందకొడిగా ఉండడంతో దాన్ని 'హిందూ వృద్ధి రేటు' అంటూ అభివర్ణించి, హిందూ జీవన విధానాన్నే ఎగతాళి చేసేవారని చెప్పారు. "21వ శతాబ్దంలో నాలుగో వంతు ఇప్పటికే గడిచిపోయింది. ప్రపంచం ఎన్నో ఎత్తుపల్లాలను ఎదురు చూసింది. ఆర్థిక సంక్షోభం, ప్రపంచవ్యాప్త మహమ్మారి ఇతర సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యలు ఏదో ఒక రీతిలో ప్రపంచానికి సవాళ్లు విసిరాయి. ప్రపంచం పూర్తిగా అనిశ్చితి పరిస్థితిలో నిండిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో పయనిస్తోంది. ఆర్థిక మాంద్యం గురించి ప్రపంచం మాట్లాడుకుంటుంటే భారత్ విజయగాథలను లిఖిస్తోంది. ప్రపంచం విశ్వాస సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో భారత్ నమ్మకానికి స్తంభంగా నిలిచింది" అని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం వివిధ అంశాల ఆధారంగా విడిపోయిందని, ఇలాంటి సమయంలో భారత్ వారధిగా మారిందని చెప్పారు.

గత ప్రభుత్వంపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాల వ్యవస్థలకు సొంత ప్రజలపై నమ్మకం ఉండేది కాదని అన్నారు. "ఈ విధానాన్ని మా ప్రభుత్వం రద్దు చేసింది. పత్రాల ఆమోదానికి పౌరుల స్వీయ ధ్రువీకరణే సరిపోతుందన్న విధానాన్ని ప్రవేశపెట్టాము"ని తెలిపారు. ప్రజలు చూపించే విశ్వాసమే ప్రభుత్వానికి పెద్ద విజయమని చెప్పారు. చిన్నచిన్న విషయాలు కూడా ప్రజలకు భారంగా పరిణమించకుండా ఉండడానికి స్వీయ ధ్రువీకరణకు అవకాశం కల్పించినట్టు వివరించారు. జనవిశ్వాస్ బిల్లులో వీటిని పొందుపరిచినట్టు చెప్పారు. పాత విధానాలను వదిలించుకుంటున్నట్టు తెలిపారు. "వలసవాదుల పాలన నాటి భావజాలం దేశంలోని ప్రతి మూల నుంచి తొలగిపోయేలా కృషి చేస్తున్నాం. రానున్న పదేళ్లలో సాధించాల్సిన విజన్‌తో ప్రజలను ముందుకు తీసుకెళ్తున్నాము"ని తెలిపారు. దేశ ప్రజలు 2035 నాటికి మెకాలే బానిస మనస్తత్వం విడనాడాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్టు వివరించారు.

ఎలాంటి హామీలు లేకుండా రుణాలు మంజూరు చేస్తుండడం సత్ఫలితాలు ఇస్తోందని ప్రధాని అన్నారు. ఇప్పటికే రూ.37లక్షల కోట్ల రుణాలను చిరువ్యాపారులు, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇచ్చినట్టు చెప్పారు. రూ.1,000 రుణం కావాల్సిన వారు కూడా ఎలాంటి హామీలు లేకుండానే బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారని తెలిపారు. "ఈ ప్రభుత్వం తన ప్రజలను విశ్వసిస్తుంది" అని వ్యాఖ్యానించారు. సమ్మిళిత ఆర్థికరంగం పై దృష్టి పెట్టామని వివరించారు. ఎవరూ అడగకపోవడంతో బ్యాంకుల్లో మురిగిపోతున్న కోట్లాది రూపాయల నిధుల గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. బ్యాంకుల్లో రూ.78వేల కోట్లు, బీమా కంపెనీల్లో రూ.14వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్లలో రూ.3,000 కోట్లు, డివిడెండ్ల రూపంలో రూ.9వేల కోట్లు వృథాగా పడి ఉన్నాయని వివరించారు. అర్హులు వీటిని పొందేలా జిల్లా స్థాయిలో శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలను పంపిణీ చేసినట్టు చెప్పారు. "కష్టార్జితాన్ని పొందాల్సిన ప్రజల కోసం ఈ మోదీ వెతుకులాడుతున్నారు" అని తెలిపారు.

చేతులెత్తి నమస్కారం పెడుతూ "దేశ ప్రజల సహకారం లేకుండా నేను వీటిని చేయలేను. ఇతరుల అడుగుజాడల్లో మనం నడవాల్సిన పనిలేదు. మన మార్గాన్ని మనం విశాలం చేసుకోవాలి. ఆటంకాలు ఎదురయినా ముందుకు సాగిపోవాలి" అని పిలుపునిచ్చారు.



కర్నూలు జిల్లా రాతన గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నందమూరి మోహన కృష్ణ, మోహన రూప

ఎన్టీఆర్ ప్రజల మనిషి

- ఆయన జీవితమంతా ప్రజా శ్రేయస్సు కోసమే: నందమూరి మోహన కృష్ణ
- రాతనలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

తుగ్గలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెత్తందారుల వ్యవస్థ, రాచరికం ఏలుతున్న కాలంలో బడుగు, బలహీన వర్గాలు, పేదల కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఆయన తనయుడు నందమూరి మోహన కృష్ణ అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పాలన సాగించిన ఎన్టీఆర్ ప్రజల మనిషిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. తుగ్గలి మండలం రాతన గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోహనకృష్ణ, ఆయన కుమార్తె మోహన రూప హాజరయ్యారు. వీరితో పాటు ప్రముఖ నిర్మాత, దర్శకులు వైవీఎస్ చౌదరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ, ఎమ్మిగనూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మోహనకృష్ణ గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులతో కలసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1982కు ముందు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారని తెలిపారు. ఆ సమయంలో పేదల కష్టాలను చూసి తమ తండ్రి నందమూరి తారక రామారావు తనకు ఎంతో ఇష్టమైన కళను కూడా పక్కనపెట్టి తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. రూ.2కే కిలో బియ్యం, పేదలకు ఇళ్ల స్థలాలు, మహిళలకు మహిళా చట్టాలు, హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని స్పష్టంచేశారు. శ్యాంబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్, కేఈ కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు.

21 లక్షల బీసీల గృహాలకు

రూఫ్‌టాప్ సోలార్

- ఎస్సీ, ఎస్టీ గృహాలు 7.48లక్షలు, 1.36లక్షల వ్యవసాయ పంపుసెట్లకూ..
- అనంతలో అధికారులతో సీఎస్ విజయానంద్ సమీక్ష



అనంతపురం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న సీఎస్ విజయానంద్, చిత్రంలో ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ శివశంకర్ లోతేటి, కలెక్టర్ ఆనంద్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీసీలకు చెందిన 21లక్షల గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. అనంతపురం జిల్లాలో రెండురోజుల పర్యటన నిమిత్తం ఆయన శనివారం వచ్చారు. అనంతపురం కలెక్టరేట్‌లో.. పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకం సహా అన్ని ఎన్ఆర్ఈడీసీపీ ప్రాజెక్టులు, వివిధ పథకాలపై ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, ఎండీ శివశంకర్ లోతేటి, కలెక్టర్ ఆనంద్, ఇతర జిల్లా అధికారులతో కలిసి సమీక్షించారు. 'పీఎం ఈ డ్రైవ్' పథకం కింద వెహికల్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులను వేగంగా చేపట్టాలి. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 7.48 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు వచ్చే ఏడాది మార్చిలోగా ఫీజిబిలిటీ ఉన్న గృహాలపై రెండు కిలోవాట్ల చొప్పున మొత్తం 415 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ పనులను పూర్తి చేయాలి. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పీఎం కుసుమ్ పథకం కింద 610 మెగావాట్ల సామర్థ్యంతో 1.36 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ పనులను పూర్తి చేయాలి. పీఎం సూర్యఘర్ కింద అనంతపురం జిల్లాలో 35.7 మెగావాట్ల సామర్థ్యంతో 17,870 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేయాలి. ఈ పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలి' అని అధికారులను ఆదేశించారు.

అరటిపై బాదుడు

ఎగుమతిదారులపై రైల్వే అదనపు భారం

- ఖాళీ కంటైనర్లకు కూడా అంతే చార్జీలు వసూలు
- దూరాభారం వల్ల ఏపీకి రాని ఉత్తరాది వ్యాపారులు
- సీమ అరటికి ధర తగ్గడానికి ప్రధాన కారణం ఇదే
- హాల్టేజ్ చార్జీలు రద్దు చేయాలన్న డిమాండ్
- లేదా 50% రాయితీ ఇవ్వాలని కేంద్రానికి ఉద్యానశాఖ లేఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఓ వైపు అరటికి ధర లేక రైతులు అల్లాడుతుంటే.. మరోవైపు అరటి ఎగుమతిదారులపై రైల్వేశాఖ అదనపు చార్జీలు బాదుతోంది. దీంతో పరోక్షంగా ఈ భారమంతా రైతులపైనే పడుతోంది. అరటి సహా అన్ని రకాల పండ్ల రవాణాకు రైళ్లలో రీఫర్ కంటైనర్ (శీతలీకరణ) పేరుతో రైల్వే శాఖ భారీగా చార్జీలు విధిస్తోంది. సరుకు తీసుకెళ్లడానికి వచ్చే ఖాళీ కంటైనర్లపైనా చార్జీలు వసూలు చేస్తోంది. ఒక్కో రైలుకు 40 ఏసీ కంటైనర్లు (బోగీలు) ఉంటే.. ఢిల్లీ, ముంబైకి రూ.1.20 లక్షల రైల్వేశాఖ చార్జీ వేస్తోంది. సాధారణంగా లోడ్ తీసుకెళ్లేటప్పుడు చార్జీలు వసూలు చేయడం సహజం. కానీ రైల్వే శాఖ సరుకు తీసుకెళ్లడానికి ఖాళీగా వచ్చిన కంటైనర్లకు కూడా హాల్టేజ్ చార్జీలు వసూలు చేస్తోంది. దీంతో పండ్ల ఉత్పత్తులు కొనుగోలు చేసి, రవాణా చేసే ఎగుమతిదారులు ఈ అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. ఈ కారణంగా ట్రేడర్లు రైతులకు ధర పెంచలేకపోతున్నారన్న వాదన ఉంది. ఎగుమతిదారులకు రైల్వే చార్జీల భారం తగ్గితే.. ఆ మేరకు రైతులకు మంచి ధర ఇవ్వడానికి అవకాశం ఉంటుందని చెప్తున్నారు.

భారంగా మారిన రైలు రవాణా..

వాస్తవంగా లారీల ద్వారా అనంతపురం, కడప జిల్లాల నుంచి ఢిల్లీ, ముంబై మార్కెట్లకు పండ్ల రవాణాకు రూ.90 వేలు ఖర్చవుతుంటే.. రైల్వే కంటైనర్లలో రూ.1.10 లక్షలు అవుతోంది. పైగా ఖాళీగా వచ్చే రైలుకు కూడా సరుకు చార్జీలు వసూలు చేస్తుండటంతో ట్రేడర్లకు ఖర్చులు రెట్టింపవుతున్నాయి. ఈ కారణంగా గతేడాది 70 శాతం పండ్ల ఉత్పత్తులు రోడ్డు మార్గానే ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అయ్యాయి. ఈ ఏడాది దాదాపు లక్షన్నర టన్నుల అరటి, ఇతర పండ్ల ఉత్పత్తులు మరో 50 వేల టన్నులు ఎగుమతి చేయాలని ఉద్యానశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ రైల్వే చార్జీల భారంతో ట్రేడర్లు ఏపీకి రాకపోవడంతో రాయలసీమలో అరటి ధర తగ్గిపోయింది. ఈ ఏడాది మహారాష్ట్రలో అరటి సాగు, ఉత్పత్తి పెరగడంతో ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు ఏపీకి రాకుండా అక్కడి నుంచే కొనుగోలు చేశారు. దీంతో నెల రోజులుగా రాయలసీమలో అరటి కొనుగోళ్లు సాగక.. ధర పడిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైల్వే అదనపు చార్జీలు ఎగుమతిదారులే భరించాల్సి వస్తుండటంతో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ కన్నా చాలా దూరంలో ఉన్న ఏపీకి ట్రేడర్లు రాలేకపోతున్నారు. పంట ఉత్పత్తుల రవాణాకే ప్రత్యేకించి కేంద్రం ఏర్పాటు చేసిన కిసాన్ రైళ్లు ప్రారంభించిన 2020 ఆగస్టు నుంచే ఈ అదనపు చార్జీల భారం ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం దీనిపై కేంద్రంతో చర్చించలేదని సమాచారం. కిసాన్ రైల్ పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు 116 సర్వీసుల ద్వారా 34 వేల టన్నుల పండ్ల ఉత్పత్తులను ఏపీ నుంచి రవాణా చేశారని అధికారులు చెప్తున్నారు. కానీ.. రాయలసీమ నుంచి రైళ్లలో పండ్ల రవాణా భారం కావడంతో ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు ఏపీకి రావడం లేదు. ఈ నేపథ్యంలో రాయలసీమ నుంచి అరటి, ఇతర పండ్ల ఉత్పత్తులను రవాణా చేసే రైళ్లలో అదనపు చార్జీలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఉద్యానశాఖ ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఖాళీ కంటైనర్ల హాల్టేజ్ చార్జీలను మాఫీ చేయాలని కోరింది. తాజాగా గుజరాత్ నుంచి గ్రానైట్ రవాణా చేసే విషయంలో ఖాళీ కంటైనర్లకు 50 శాతం చార్జీలు తగ్గించిన రైల్వే శాఖ.. రైతులు ఎంతో కష్టపడి పండించే పండ్ల ఉత్పత్తుల రవాణా విషయంలో అదనపు చార్జీలు వసూలు చేయడం సరికాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

80 శాతం ఉత్తరాది రాష్ట్రాలకే..

కాగా.. ఏపీలో అరటి 1.30 లక్షల హెక్టార్లలో పండిస్తున్నారు. 87.10 లక్షల టన్నుల పంట ఉత్పత్తి అవుతోంది. దేశంలోనే అరటి ఎగుమతిదారుల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. రాయలసీమలో పండే అరటిలో 80 శాతం ఉత్తరాది రాష్ట్రాలకు, 18 శాతం లోకల్ మార్కెట్‌లో అమ్ముడవుతోంది. ఒక్కో ఏసీ కంటైనర్‌లో 20 టన్నుల సరుకు నింపుతారు. ఇలా ఒక్కో రైలు ద్వారా 800 టన్నులు రవాణా జరుగుతుంది. గతేడాది ఏపీ నుంచి 7 రైళ్లలో పండ్ల ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.

ధాన్యం అమ్మడానికి ఎన్ని తిప్పలో!

- రైతులందరికీ అందని గోనె సంచులు
- అందుబాటులో లేని రవాణా వాహనాలు
- ఓ వైపు వాతావరణ సమస్యలు
- మరోవైపు తేమతో ఇబ్బందులు
- సతమతమవుతున్న అన్నదాతలు

(అమరావతి- ఆంధ్రజ్యోతి)



ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలకు మధ్య పొంతన ఉండటం లేదు. ధాన్యం సేకరించే పౌరసరఫరాల సంస్థ అధికారుల మాత్రం తేమశాతం సాకుతో రైతులను బెదర గొడుతున్నారు. సకాలంలో తగినన్ని గోనె సంచులు అందించకుండా, ధాన్యం రవాణా వాహనాలు అందుబాటులో ఉంచకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. గత వారం రోజులుగా దిత్వా తుఫాన్ హెచ్చరికలతో నూర్చి, ఆరబోసిన ధాన్యం తడవకుండా కొందరు రైతులు టార్పాలిన్లు కప్పి, నానా తిప్పలు పడ్డారు. తుఫాన్ బలహీనపడిందనే సమాచారంతో మరికొందరు వరి కోతలకు ఉపక్రమించారు. అయితే, తడిగా ఉంటే కొనలేమని, కోతలకు మరికొన్ని ఆగాలని, బాగా ఆరిన ధాన్యాన్నే తేవాలని క్షేత్రస్థాయి సిబ్బంది వారికి తేల్చి చెబుతున్నారు. అదేమంటే తుఫాన్ పోయినా వాతావరణం మారి, వానజల్లులు పడుతున్నాయని, ధాన్యంలో తేమశాతం తగ్గకపోతే కొనుగోలు చేయలేమని తేల్చి చెబుతున్నారు. దీనివల్ల రెండో పంట వేయడానికి ఆలస్యమవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణంలోనే తేమ అధికంగా ఉండటంతో ధాన్యం ఆరబోసినా అది పూర్తిగా పోవడం లేదు. మరోవైపు ధాన్యం కాటాలు వేసి 2-3 రోజులైనా.. లోడు ఎత్తడానికి లారీలు లేవని రైతుసేవా కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం ధాన్యం రవాణాకు వాహనాలు ఏర్పాటు చేస్తోంది కదా అని అడిగితే.. రోజూ రేపొస్తాయి.. మాపొస్తాయంటూ, లారీలొచ్చే దాకా ఆగలేకపోతే.. మీరే బండ్లు తెచ్చుకోండి.. అంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. బండ్లు తెచ్చుకుంటే కిరాయి తామే సొంతంగా కట్టుకోవాల్సి వస్తుందంటున్నారు. ఈ-క్రాప్ నియమాలు, తేమశాతం నిబంధనలను అధిగమించి పౌర సరఫరాల సంస్థకు ధాన్యం అమ్మడానికి నానా ఇబ్బందులు పడే కన్నా.. నేరుగా మిల్లర్లకు అమ్మితే.. బ్రోకర్ల ద్వారా త్వరగా పని అయిపోతుందనిపిస్తోందని కొందరు రైతులు చెబుతున్నారు. వాస్తవంగా ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ అవుతుండటంతో అన్నదాతలు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని భావిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయి సమస్యలు ఇబ్బందికరంగా ఉంటున్నాయని అంటున్నారు. నాణ్యమైన ధాన్యానికే మద్దతు ఇస్తామని మిల్లర్లు తేల్చిచెబుతున్నారు. తేమ, తాలు, ఇతర వ్యర్థాలు ఉంటే.. ధర తగ్గించి వారు అడుగుతుండటంతో ముందు నుయ్యి.. వెనుక గొయ్యిలా ధాన్యం రైతుల పరిస్థితి తయారైంది. వాతావరణం అనుకూలంగా లేకపోవడం ఓ కారణం. అంతకంటే కూడా సకాలంలో గోనె సంచులు, అందుబాటులో రవాణా వాహనాలు ఉంచకపోగా, క్షేత్రస్థాయి సిబ్బంది రైతులతో సున్నితంగా వ్యవహరించకపోవడం, ఉన్నతాధికారులు సకాలంలో స్పందించకపోవడమే ప్రధానంగా సమస్య అయినట్టు తెలుస్తోంది. ధాన్యం కొనుగోలుపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరిపి, క్షేత్రస్థాయి సమస్యలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు మంగళగిరిలో మార్కెట్ కమిటీ చైర్మన్ల రాష్ట్ర సదస్సు

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ల రాష్ట్ర సదస్సు ఆదివారం మంగళగిరిలోని ఆర్ఆర్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్టు ఏఎంసీ చైర్మన్ల కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకానున్నారు. ఏఎంసీల ప్రాధాన్యాన్ని మరింత విస్తరించేందుకు తీసుకోవాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సదస్సులో చర్చించనున్నారు. కాగా.. మార్కెటింగ్ యార్డుల వ్యవస్థపై ఏఎంసీ చైర్మన్లకు అవగాహన కార్యక్రమాన్ని ప్రాంతీయ స్థాయిలో నిర్వహించాలని మార్కెటింగ్ నిర్ణయించింది. సోమవారం గుంటూరులోని ప్రధాన కార్యాలయంలో విజయవాడ ప్రాంతీయ ఏఎంసీ చైర్మన్ల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆర్‌జేడీఎం కె.శ్రీనివాసరావు తెలిపారు.

చుక్కలు చూపిస్తున్న ఇండిగో!

- టికెట్లు రద్దు చేసుకుంటున్న ప్రయాణికులు
- ముంబై విమానం రద్దు
- హైదరాబాద్ ఫ్లైట్ 4 గంటలు ఆలస్యం
- అదేబాటలో మరికొన్ని.. ఆకాశంలో టికెట్ల ధరలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభం కొనసాగుతోంది. ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు వాటిని రద్దు చేసుకుంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయం ద్వారా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన సుమారు 400 మంది శుక్ర, శనివారాల్లో తమ టికెట్లను రద్దు చేసుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు రావాల్సిన ముంబై విమానం రద్దయింది. హైదరాబాద్ నుంచి రావాల్సిన విమానం శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చింది. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై విమానాల రాకపోకల్లోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది.

తిరుపతిలో ప్రయాణికుల ఆందోళన

తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం ఉదయం 11.45 గంటలకు హైదరాబాద్ నుంచి తిరుపతికి వచ్చి, అనంతరం విశాఖకు వెళ్లాల్సిన ఇండిగో విమానం అర్ధరాత్రి దాటినా రాకపోవడంతో శనివారం తెల్లవారుజామున 2 గంటలకు ప్రయాణికులు ఆందోళనకు దిగారు. దీంతో వారందరికీ ప్రత్యేక బస ఏర్పాటు చేసి శనివారం ఉదయం వచ్చిన ఇండిగో విమానంలో విశాఖపట్నానికి తరలించారు. అలాగే హైదరాబాద్, బెంగళూరు నుంచి రావాల్సిన ఇండిగో విమానాలు 40 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నాయి. హైదరాబాద్ నుంచి రావాల్సిన ఎయిర్ అలయన్స్, శివమొగ్గ నుంచి రావాల్సిన స్టార్ ఎయిర్ విమానాలు కూడా 30 నిమిషాలు ఆలస్యంగా వచ్చాయి.

ఢిల్లీ-విశాఖ టికెట్ ధర రూ.లక్ష

ఇండిగో విమానయాన సంస్థలో ఏర్పడిన సంక్షోభంతో దేశవ్యాప్తంగా వందలాది సర్వీసులు రద్దయిపోతున్నాయి. విశాఖపట్నం విమానాశ్రయంలో శనివారం తొమ్మిది ఇండిగో సర్వీసులు ఆగిపోయాయి. అందుబాటులో ఉన్న ఇతర విమానాల్లో గమ్య స్థానాలకు చేరడానికి ప్రయాణికులు ప్రయత్నిస్తుండటంతో ఆయా సంస్థలు టికెట్ల ధరలు భారీగా పెంచేశాయి. భారత్, దక్షిణాఫ్రికా చివరి వన్డే క్రికెట్ మ్యాచ్ విశాఖలో నిర్వహించడంతోనూ ధరలకు రెక్కలు వచ్చాయి. ఢిల్లీ నుంచి విశాఖపట్నానికి టికెట్ ధర గరిష్ఠంగా రూ1,00,602కు చేరింది. చెన్నై నుంచి విశాఖకు రూ.49,033, హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.33,769 వరకు వసూలు చేశారు. ఆదివారం కూడా టికెట్ల ధరలు అధికంగానే ఉన్నాయి.

అప్పన్నను దర్శించుకున్న జస్టిస్ రవినాథ్ తిల్హారి



సింహాచలం (విశాఖపట్నం జిల్లా), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి దంపతులు శనివారం దర్శించుకున్నారు. వారికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎన్.సుజాత ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు జస్టిస్ రవినాథ్ తిల్హారికి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. కప్పస్తంభం ఆలింగనం, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజల తరువాత పండితులు చతుర్వేదాశీర్వచనాలివ్వగా, ఈఓ ప్రసాదాలను అందజేశారు.

అభయాంజనేయస్వామి సేవలో జస్టిస్ జ్యోతిర్మయి



పెదపాడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు ఏలూరు జిల్లా పెదపాడు మండలం అప్పనవీడులో కొలువైన అభయాంజనేయ స్వామిని శనివారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ అర్చకులు శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

పాట్నాలో టీటీడీ ఆలయం

- 10.11 ఎకరాలు కేటాయించిన బిహార్ ప్రభుత్వం

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాజధాని పాట్నాలో శ్రీవారి ఆలయం నిర్మించేందుకు 10.11 ఎకరాల స్థలాన్ని టీటీడీకి ఆ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మోకామా ఖాస్ ప్రాంతంలో ఈ స్థలాన్ని కేటాయించినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు బిహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్ లేఖ రాశారు. 99 సంవత్సరాల పాటు రూ.1 టోకెన్ లీజ్ రెంట్‌తో ఈ స్థలాన్ని కేటాయించారు. దీనిపై టీటీడీతో ఎంవోయూ చేసుకునేందుకు బిహార్ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. స్థల కేటాయింపుపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా అభినందించినట్టు బీఆర్ నాయుడు తెలిపారు.

నిద్రిస్తుండగా.. కాటేసిన మృత్యువు

- తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న అయ్యప్ప భక్తుల కారును ఢీకొన్న మరో కారు
- నలుగురు విజయనగరం జిల్లా వాసులు మృతి
- శబరిమల వెళ్లి వస్తుండగా రామేశ్వరం సమీపంలో ఘటన



నుజ్జునుజ్జయిన అయ్యప్ప భక్తుల కారు



రామకృష్ణ



రాము



రామచంద్రరావు



అప్పలనాయుడు

గజపతినగరం/చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు సహా ఐదుగురు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు విజయనగరం జిల్లా గజపతినగరం, దత్తిరాజేరు మండలాలకు చెందిన నలుగురు అయ్యప్ప భక్తులు మృతి చెందారు. దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస గ్రామానికి చెందిన వంగర రామకృష్ణ(51), మార్పిన అప్పలనాయుడు(33), మరడ రాము(50), గజపతినగరం మండలం మరుపల్లి గ్రామానికి చెందిన బండారు చంద్రరావు(35)తో పాటు రామభద్రపురం మండలం కొండ కెంగువ గ్రామానికి చెందిన బెవర శ్రీరాములు ఈ నెల 1వ తేదీన కారులో శబరిమల వెళ్లారు. అయ్యప్ప దర్శనం తర్వాత తిరుగు ప్రయాణంలో శుక్రవారం రాత్రి రామేశ్వరం ఆలయాన్ని దర్శించుకున్నారు. మార్గమధ్యలో అర్ధరాత్రి కుంబిడుమదురై ప్రాంతంలో కారు రోడ్డు పక్కన నిలిపి అందరూ అందులోనే నిద్రిస్తున్నారు. అదే సమయంలో ఏర్వాడి నుంచి రామనాథపురం జిల్లా కీళకరైకు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న అయ్యప్ప భక్తుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామకృష్ణ, అప్పలనాయుడు, చంద్రరావు మరో కారు డ్రైవర్ ముస్తాక్ అహ్మద్ (30) అక్కడికక్కడే మరణించారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వాహనాల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడిన వారిని బయటకు తీసి రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాము మృతి చెందాడు. మిగిలిన క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ సందీష్, కీళకరై ఇన్‌స్పెక్టర్ పద్మనాభన్ తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముస్తాక్ అహ్మద్ అధికార డీఎంకే అనుబంధ డ్రైవర్ల సంఘం నిర్వాహకుడని తెలిసింది. ఈ ఘటనపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవదర్శనం కోసం బయల్దేరిన భక్తులు ఈ ప్రమాదంలో మృతి చెందడం తనను కలచివేసిందని తెలిపారు. క్షతగాత్రుడికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని అక్కడి జిల్లా కలెక్టర్‌ను ఫోన్‌లో కోరారు. మృతదేహాలను స్వగ్రామాలకు త్వరగా చేరుకునే చర్యలు తీసుకుంటామని, మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

దైవసన్నిధిలో నేరాలకు జగన్ వత్తాసు

తిరుమల లడ్డూ పవిత్రత, విశిష్టతను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారినెవరినీ క్షమించకూడదు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నది సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ అన్న వాస్తవాన్ని విస్మరించి జగన్‌రెడ్డి... సిట్ సభ్యుడైన గోపీనాథ్ జెట్టిని 'వాడూ వీడూ' అని చులకన చేసి మాట్లాడారు. గోపీనాథ్ జెట్టిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయలేదు. సుప్రీంకోర్టు సూచన మేరకు సీబీఐ ఎంపిక చేసుకుంది. అప్పట్లో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్ ఆధారంగానే సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేసిన చిన్న అప్పన్న గురించి జగన్‌రెడ్డి చెప్పిన కథ వింతగా ఉంది. అప్పన్న ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి వద్ద పనిచేసేవారని ఆయన చెప్పుకొచ్చారు. నాసి రకం నెయ్యి సరఫరా జరిగిన సమయంలో ప్రభాకరరెడ్డి వైసీపీ ఎంపీగా ఉన్నారు. అప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలోనే లేరు. సదరు అప్పన్నను ఢిల్లీ ఏపీ భవన్‌లోనూ, ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా నియమించడం కూడా జగన్‌రెడ్డి హయాంలోనే జరిగాయి. వాస్తవం ఇది కాగా, ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీగా ఉన్న ప్రభాకర రెడ్డి వద్ద అప్పన్న పనిచేశారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా జగన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం విలేఖరుల సమావేశంలో చెప్పిన మాటలు, చేసిన ఆరోపణలను బట్టి... రాష్ట్ర ప్రజలు పుట్టెడు కష్టాలలో ఉన్నారని ఎవరైనా నమ్మాల్సిందే! అంతే కాదు, గత ఎన్నికలలో కూటమి నాయకుల మాటలు నమ్మి ప్రజలు ఆయనకు 11 సీట్లే ఇచ్చి అన్యాయం చేశారన్న భావన కూడా కలుగుతుంది. 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలన్న తన కలలను కూటమి నాయకులు కల్లబొల్లి కబుర్లతో కల్లలు చేశారన్న ఉక్రోషం కూడా ఆయన మాటల్లో కనిపించింది. సుదీర్ఘంగా 2 గంటలా 43 నిమిషాల పాటు సాగిన విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ నిజమా? అన్న అనుమానం కించిత్ కూడా రాకుండా ఆయన తనలోని నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. గతంలో కేసీఆర్ ఒక్కరే ఇలా గంటలకొద్దీ విలేఖరుల సమావేశాలు నిర్వహించేవారు. అయితే, ఆయన మధ్య మధ్యలో పిట్ట కథలు చెబుతూ విలేఖరులకు బోర్ కొట్టకుండా ఉత్తేజపరిచేవారు. ఈ చాతుర్యం జగన్‌లో లేనందున సదరు సమావేశానికి హాజరైన విలేఖరులకు కచ్చితంగా బోర్ కొట్టి ఉంటుంది. అయినా ఆయన తాను చెప్పాలనుకున్న వాటిని చిత్ర విచిత్ర హావభావాలతో చెప్పుకొన్నారు. ఒక నార్సిసిస్టిక్ పర్సనాలిటీ నోటి వెంట వెలువడిన అసత్యాలను, అర్ధసత్యాలను పట్టించుకోవడం ఎందుకులే అనుకోకుండా కూటమి ప్రభుత్వంలోని పలువురు మంత్రులు ఆ వెంటనే స్పందించి జగన్‌రెడ్డికి బదులిచ్చారు. ఇంతవరకు జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. అయితే, జగన్‌రెడ్డి తనలోని అక్కసును దాచుకోకుండా మధ్య మధ్యలో వెళ్లగక్కారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యను, ఆయన బంధువు గోపీనాథ్ జెట్టి అనే ఐజీ స్థాయి అధికారిని 'వాడూ వీడూ' అని సంబోధించడం ద్వారా తనలోని కక్షను ఆయన ప్రదర్శించారు. ఇదే పని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చేసి ఉంటే బీసీ వర్గానికి చెందిన, అది కూడా యాదవ కులానికి చెందిన అధికారులను అవమానించారని నీలి మీడియా, కూలి మీడియా గగ్గోలు పెట్టి ఉండేది. గత ప్రభుత్వంలో హద్దులు మీరి ప్రవర్తించడమే కాకుండా అవినీతికి పాల్పడిన ఆరోపణలపై ఒకరిద్దరు అధికారులు విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో... 'దళిత అధికారులపై కక్ష ఏమిటి?' అని ఇదే నీలి, కూలి మీడియా వాపోవడం చూశాం. జగన్మోహన్‌రెడ్డి తనలోని నటనా కౌశలాన్ని ఎంతలా బయటకు తీసినా మధ్య మధ్యలో తన నిజ స్వరూపాన్ని దాచుకోలేక పోతున్నారు. ఫలితంగా అవతలి వారిని ఏక వచనంతో 'వాడూ వీడూ' అనీ సంబోధిస్తుంటారు. విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలను ఎంత మంది నమ్మారో తెలియదుగానీ... విలేఖరులు మాత్రం బాధితులయ్యారు. జగన్మోహన్‌రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంత తొందరగా వదిలిపెడతారా? అని ఎదురుచూస్తానని ఆయన పార్టీకే చెందిన మాజీ మంత్రి పేర్ని నాని ఎక్కడో చెప్పినట్టు గుర్తు! సొంత పార్టీ వారే భరించలేని ఆయన ఉపన్యాసాలను విలేఖరులు నిర్బంధంగా భరించాల్సి రావడం విషాదమే!

బొక్కలో వేయాల్సింది ఎవరిని?

జగన్ నోటి వెంట వెలువడిన కొన్ని ఆణిముత్యాల గురించి ఇప్పుడు చర్చించుకుందాం! ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుతున్నారు. నిజంగా అలా చేయవలసి వస్తే ఈ దేశంలో ఒక్క రాజకీయ నాయకుడు కూడా బయట తిరగలేరు. అందరూ జైల్లోనే ఉండాలి. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా అధికారం అనుభవించిన జగన్‌రెడ్డి కూడా అమలు చేయలేకపోయిన ఎన్నికల హామీలు ఎన్నో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మద్య నిషేధం! ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రావడంకోసం ప్రజలు కోరుకున్నా కోరుకోకపోయినా నోటికొచ్చిన వాగ్దానాలు చేయడం మన దేశంలోని నాయకులకు పరిపాటి అయింది. అధికారం అప్పగిస్తే స్వర్గాన్ని దివి నుంచి భువికి తీసుకువస్తామని చెబుతారు. అందరికీ అన్నీ ఉచితంగా ఇస్తామని చెబుతారు. నిజానికి ప్రజలు అవేవీ నమ్మరు. అప్పటి పరిస్థితులను బట్టి తాము ఎవరికి ఓటు వేయాలో వారికే వేస్తారు. అధికారంలో ఉన్న పార్టీపై కోపం ఉంటే ప్రతిపక్షంలో ఉన్న పార్టీని ఎంచుకుంటారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇదే చేశారు. జగన్‌రెడ్డి పాలనలో దిమ్మ తిరిగి బొమ్మ కనపడటంతో 164 సీట్లలో కూటమిని గెలిపించి, జగన్‌రెడ్డికి 11 సీట్లే ఇచ్చారు. ప్రజల తీర్పు ఈ విధంగా ఉండబోతోందని చంద్రబాబుగానీ, జగన్‌రెడ్డిగానీ ఊహించలేదు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆరాటంతో ప్రజలు కోరుకోకపోయినా చంద్రబాబు అనవసర వాగ్దానాలు చేశారు. అయితే ప్రజలు వాటిని నమ్మి ఆయన పార్టీకి ఓట్లు వేయలేదు. 2019 ఎన్నికల్లో నమ్మి అధికారం కట్టబెడితే జగన్‌రెడ్డి అరాచకంగా పాలించారన్న కోపంతోనే ప్రజలు కూటమికి కనీవినీ ఎరుగని మెజారిటీ ఇచ్చారు. ఈ వాస్తవాన్ని విస్మరించి, హామీలు అమలుచేయనందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుకోవడం విడ్డూరంగా ఉంది. అవినీతి ఆరోపణలపై కొంత కాలం జైలు జీవితం గడిపిన జగన్‌రెడ్డి తనవలే మిగతా నాయకులు కూడా జైలు జీవితం గడపాలని కోరుకుంటున్నట్టు ఉంది. అందుకే కాబోలు, తాను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో జైల్లో పెట్టించారు. హామీలు అమలు చేయని వారిని బొక్కలో వేయాలన్న జగన్‌రెడ్డి ఫిలాసఫీ ప్రకారమైతే ఓటర్లను కూడా జైల్లో పెట్టాలి. ఎన్నికల సందర్భంగా చాలామంది అన్ని పార్టీల నుంచీ డబ్బు తీసుకుంటున్నారు. చివరికి ఏదో ఒక పార్టీకే ఓటేస్తున్నారు కదా? డబ్బు తీసుకొని ఓటు వేయకపోవడం నేరమే కదా? తమకు ఇష్టం లేని పార్టీ నుంచి డబ్బు తీసుకోకూడదు కదా? యథా రాజా తథా ప్రజా అన్నట్టుగా ఇప్పుడు అందరూ తప్పు చేస్తున్నారు. అధికారంలోకి రావాలన్న తపనతో నాయకులు అలవికాని హామీలు ఇస్తుండగా, మా ఓటు మీకే అని నమ్మబలికి అన్ని పార్టీల నుంచి ప్రజలు డబ్బు తీసుకుంటున్నారు. ఎవరు ఎవరిని మోసం చేశారంటే ఏం చెప్పగలం? ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ను బొక్కలో వేయాలన్న జగన్ డిమాండ్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు.

మద్యం పాపం... మీది కాదా?

రాజకీయ నాయకుల మాటలు తాము చేసేది సంసారం, ఇతరులు చేసేది వ్యభిచారం అన్నట్టుగా ఉంటాయి. ఈ విషయంలో జగన్‌రెడ్డి మాత్రం పీహెచ్‌డీ చేశారు. రాజకీయ నాయకుడిగా ఆయనకు ఉన్న అనుభవం తక్కువే. అయినప్పటికీ సుదీర్ఘ అనుభవం ఉన్నవారు కూడా ఆయన ముందు దిగదుడుపే. అధికారంలో ఉన్నప్పుడు అయినదానికీ కానిదానికీ కేసులు కట్టించి గిట్టనివారిని జైళ్లలో కుక్కిన ఆయన... ఇప్పుడు తన వాళ్లను వెనకేసుకురావడానికి విఫల యత్నం చేస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మద్యం సరఫరాలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన విషయం అందరికీ తెలిసిందే! అయినా... 'మద్యం విషయంలో కేసు పెట్టడానికి ఏముంది? ఏమీ జరగని చోట కేసు కట్టి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్ కసిరెడ్డి వంటి వారిని జైల్లో పెట్టడం ఏమిటి?' అని అమాయకంగా ప్రశ్నించే ప్రయత్నం చేయడమే జగన్‌రెడ్డిలోని గడుసుదనానికి నిదర్శనం. ఈ కేసులో తీగ లాగుతున్న కొద్దీ డొంకలు కదులుతున్నాయి. మద్యం కుంభకోణం మూలాలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నాయని ప్రస్తుతానికి ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ కేసు లోతుల్లోకి వెళుతున్న కొద్దీ దర్యాప్తు అధికారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పేద ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి వారి ఆరోగ్యంతో ఆటలాడుకున్న పాలకుల వికృత మనస్తత్వానికి ఈ కేసు ఒక మచ్చు తునక. దేశ చరిత్రలో ఈ స్థాయిలో మద్యం కుంభకోణం జరగలేదని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడిన ఈ వికృత క్రీడలో ఎందరినో పావులుగా చేశారు. వేల కోట్లను దోచుకున్నారు. ఈ క్రమంలో కొంత మంది ముఖ్య నాయకుడిని కూడా మోసం చేశారు. ఈ జాబితాలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఉన్నారని అధికారులు చెబుతున్నారు. జగన్‌రెడ్డికి తెలియకుండా చెవిరెడ్డి కొన్ని వందల కోట్లు నొక్కేశారన్నది అధికారుల సమాచారం. ఈ కారణంగానే ప్రస్తుతం జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డిని బెయిలుపై బయటకు తీసుకురావడానికి జగన్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదట! జగన్‌రెడ్డి కోసం తాము ఈ పాపం చేస్తే ఆయనే పట్టించుకోవడం లేదని చెవిరెడ్డి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఈ కేసులో మరికొంత మంది ఇతర నిందితులు కూడా జగన్‌రెడ్డి తమను పట్టించుకోవడం లేదని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. ఈ కేసులో ఇంకెన్ని లోతులు ఉన్నాయో దర్యాప్తు అధికారులకే అంతుపట్టడం లేదు. ఇంతటి భారీ కుంభకోణంలో కూడా అసలు కేసు ఎక్కడుంది? అని జగన్‌రెడ్డి ప్రశ్నించడం అంటే అది గడుసుదనం కాక మరేమిటి? మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులను కూడా జగన్ వెనకేసుకు వచ్చే ప్రయత్నం చేశారు. ముందస్తు బెయిలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు సైతం నిరాకరించినప్పటికీ పిన్నెల్లి సోదరులను అన్యాయంగా ఇరికించారని జగన్‌రెడ్డి చెబుతున్నారుగానీ... అధికారంలో ఉన్నప్పుడు వారు సాగించిన అరాచకాలను ప్రజలందరూ చూశారు. అధికారం శాశ్వతం అని నమ్మడం వల్లనే అధికారం పోయాక కేసులు తలకు చుట్టుకుంటున్నాయి. జగన్‌రెడ్డి 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయనతో పాటు ఆయన చుట్టూ ఉన్నవారు కూడా నమ్మారు. అందుకే హద్దు మీరి ప్రవర్తించి ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. ఇప్పుడు కూటమికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలూ అదే బాటలో పయనిస్తున్నారు. అది వారి ఖర్మ. ఎప్పుడో ఒకప్పుడు పాపం పండుతుంది.

> పాలకమండలిగానీ, టీటీడీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులుగానీ... 'దేవుడ్ని వాడుకుంటున్నామా? ఆ దేవదేవుడి కోసం పనిచేస్తున్నామా?' అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బు మాత్రమే సంపాదించాలని అనుకుంటే అందుకు ఎన్నో మార్గాలు ఉంటాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలలో అనైతిక చర్యలకు పాల్పడటమేమిటి?

'కల్తీ' మాటలు...

విలేకరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన రెండు అంశాలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయంలో కూడా ఆయన అబద్ధాలను అలవోకగా చెప్పారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి కూడా అపచారం తలపెట్టిన వారిని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం మహా పాపం. భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన తిరుమల లడ్డూ తయారీకి నాసిరకం నెయ్యి వాడిన విషయమై జగన్‌రెడ్డి చేస్తున్న వాదన రోతగా ఉంది. నాసిరకం నెయ్యి కొనుగోలులో ఎవరి పాత్ర ఏమిటి? ఎంత? అనేది సుప్రీంకోర్టు నియమించిన సిట్ నిర్ధారిస్తుంది. ఇప్పటి వరకు సిట్ జరిపిన దర్యాప్తు ప్రకారం భోలే బాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరించడంలో అవకతవకలు జరిగాయని నిర్ధారణ అయింది. అందుకు ఎవరు బాధ్యులు అన్నది తేలాల్సి ఉంది. తిరుమల లడ్డూ కోసం గతంలో చిత్తూరు డెయిరీతోపాటు ఒకటి రెండు సహకార డెయిరీల నుంచి మాత్రమే నెయ్యిని సేకరించేవారు. ఈ నిబంధనలను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన పాలకమండలి సవరించింది. ఈ కారణంగానే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న డెయిరీలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం లభించింది. ఇక్కడే అవినీతికి బీజం పడింది. భోలే బాబా డెయిరీ రంగప్రవేశం చేయగలిగింది. ఈ నిబంధనల సవరణ కూడా విచిత్రంగా జరిగింది. పాలకమండలి ముందుకు ఈ సవరణలకు సంబంధించిన తీర్మానం రాలేదు. తక్కువ ధరకు నెయ్యి సరఫరా చేయడానికి దాఖలైన టెండర్లను ఆమోదించే తీర్మానం మాత్రమే నాటి పాలకమండలి సమావేశంలో చర్చకు వచ్చింది. తీర్మానం ప్రతులను సభ్యులందరికీ ఇవ్వరు. చైర్మన్, కార్య నిర్వహణాధికారి వద్ద మాత్రమే అవి ఉంటాయి. ఆ రోజు టెండరు ఖరారు చేయాల్సిన తీర్మానాన్ని పక్కన పెట్టి... నెయ్యి సేకరణ విధానంలో మార్పులు చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు. ఇందుకోసం ఏర్పాటైన కమిటీలో ప్రస్తుతం బోర్డు సభ్యులుగా ఉన్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కృష్ణమూర్తి ఉన్నారు. పోటీతత్వం పెరగడానికి వీలుగా నిబంధనలను సడలించాలన్నదే తమ ఉద్దేశమని అప్పటి అధికారులు చెబుతున్నారు. అయితే... బోర్డు ముందుకు వచ్చిన తీర్మానం ఒకటి కాగా, ఆమోదం పొందిన తీర్మానం మరొకటి కావడమే అనుమానాలకు తావిచ్చేలా ఉంది. ప్రస్తుతం కార్యనిర్వహణాధికారిగా ఉన్న అనిల్ సింఘాల్ అప్పుడు కూడా కార్యనిర్వహణాధికారిగానే ఉన్నారు. జరిగిన దానికి ఆయన కూడా సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. భోలే బాబా డెయిరీకి అర్హత లేకపోయినా... అర్హత కల్పించిన అధికారులు ఎవరు? వారి వెనుక ఎవరున్నారు? అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. తిరుమల లడ్డూ పవిత్రత, విశిష్టతను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారినెవరినీ క్షమించకూడదు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నది సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ అన్న వాస్తవాన్ని విస్మరించి జగన్‌రెడ్డి... సిట్ సభ్యుడైన గోపీనాథ్ జెట్టిని 'వాడూ వీడూ' అని చులకన చేసి మాట్లాడారు. గోపీనాథ్ జెట్టిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయలేదు. సుప్రీంకోర్టు సూచన మేరకు సీబీఐ ఎంపిక చేసుకుంది. అప్పట్లో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్ ఆధారంగానే సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేసిన చిన్న అప్పన్న గురించి జగన్‌రెడ్డి చెప్పిన కథ కూడా వింతగా ఉంది. అప్పన్న ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వద్ద పనిచేసేవారని ఆయన చెప్పుకొచ్చారు. నాసిరకం నెయ్యి సరఫరా జరిగిన సమయంలో ప్రభాకరరెడ్డి వైసీపీ ఎంపీగా ఉన్నారు. అప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలోనే లేరు. సదరు అప్పన్నను ఢిల్లీ ఏపీ భవన్‌లోనూ, ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా నియమించడం కూడా జగన్‌రెడ్డి హయాంలోనే జరిగాయి. వాస్తవం ఇది కాగా, ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీగా ఉన్న ప్రభాకరరెడ్డి వద్ద అప్పన్న పనిచేశారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా జగన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు. నాసి రకం నెయ్యి సరఫరాలో జగన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి హస్తం ఉందని ఇప్పటివరకూ ఎవరూ ఆరోపించలేదు. నాసిరకం నెయ్యి సరఫరా చేయడం మాత్రం నిజం అని ప్రస్తుతానికి రుజువైంది. ఆ పాపానికి ఎవరు కారకులు అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించి తాజాగా ఒకరిని అరెస్టు చేశారు. అప్పన్ననూ అరెస్టు చేశారు. మరికొందరినీ అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఈ పాపానికి ఒడిగట్టిన వాళ్లను ఆ దేవదేవుడు క్షమించడు కూడా! పాపులు ఎవరో త్వరలో తేలుతుంది. ఇందులో ఏమీ జరగలేదని జగన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు చూస్తూ ఊరుకోడు కదా? లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం ద్వారా పాపపు కూడు తినడానికి అలవాటుపడిన వారిని వెనుకేసుకు రావడానికి ఎవరు ప్రయత్నించినా... వారు కూడా ఈ పాపంలో పాలుపంచుకున్నవారే అవుతారు.



> తిరుమల లడ్డూ కోసం గతంలో చిత్తూరు డెయిరీతోపాటు ఒకటి రెండు సహకార డెయిరీల నుంచి మాత్రమే నెయ్యిని సేకరించేవారు. ఈ నిబంధనలను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన పాలకమండలి సవరించింది. ఈ కారణంగానే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న డెయిరీలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం లభించింది. ఇక్కడే అవినీతికి బీజం పడింది. భోలే బాబా డెయిరీ రంగప్రవేశం చేయగలిగింది. ఈ నిబంధనల సవరణ విచిత్రంగా జరిగింది. పాలక మండలి ముందుకు ఈ సవరణలకు సంబంధించిన తీర్మానం రాలేదు. ఆ రోజు టెండరు ఖరారు చేయాల్సిన తీర్మానాన్ని పక్కన పెట్టి... నెయ్యి సేకరణ విధానంలో మార్పులు చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు. పోటీతత్వం పెరగడానికి వీలుగా నిబంధనలను సడలించాలన్నదే తమ ఉద్దేశమని అప్పటి అధికారులు చెబుతున్నారు. అయితే... బోర్డు ముందుకు వచ్చిన తీర్మానం ఒకటి కాగా, ఆమోదం పొందిన తీర్మానం మరొకటి కావడమే అనుమానాలకు తావిచ్చేలా ఉంది.

చోరీపైనా 'చిన్న' మాటలు..

పరకామణి చోరీ వ్యవహారంలో కూడా జగన్‌రెడ్డి అడ్డగోలు వాదనకు తెర లేపారు. పరకామణి లెక్కింపు సందర్భంగా రవి కుమార్ అనే ఉద్యోగి 9 డాలర్లు దొంగిలించగా... ఆయన పద్నాలుగు కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి దఖలుపరచడం ఏమిటి? అన్నట్టుగా జగన్‌రెడ్డి వాదన సాగింది. నిజానికి రవి అనే అతను దొంగిలించింది 900 డాలర్లు. అలా అతను పరకామణి సొమ్ము దొంగిలించడం అదే మొదటిసారి కాదు. పాపం పండి ఆ రోజు దొరికిపోయాడు. దొంగిలించింది 9 డాలర్లా? 900 డాలర్లా? అన్నది ముఖ్యం కాదు. దేవుడి సొమ్ము దొంగిలించడం మహా పాపం! ఆ పాతకానికి ఒడిగట్టిన దొంగను శిక్షించకుండా రాజీ కుదుర్చుకోవడం ఏమిటి? ఆ అవసరం ఎవరికి, ఎందుకు వచ్చింది? దొంగతనానికి పాల్పడిన రవిని బెదిరించి సొమ్ము చేసుకున్న వారిలో కిషోర్, జగన్మోహన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి అనే పోలీసు అధికారులు ఉన్నట్టుగా అభియోగాలు ఉన్నాయి. వీరితో పాటు తెర వెనుక ఇంకెవరెవరు ఉన్నారో తేలాల్సి ఉంది. హైకోర్టు ఆగ్రహంతో సీఐడీ అధికారులు ఈ కేసు దర్యాప్తును సీరియస్‌గా తీసుకున్నారు. ఈ చోరీ కేసులో లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవలసిన అవసరం ఏమిటి? ఇదంతా ఎందుకు జరిగింది? ఎవరి ప్రోద్బలంతో అలా జరిగిందో కూడా తేలాల్సి ఉంది. నేరస్తుడు పరకామణిలో చోరీ చేయడం అదే మొదటిసారి కూడా కాదు. కోటానుకోట్ల మంది ఆరాధించే ఆ దేవదేవుడి సన్నిధిలో ఇలాంటి ఘోరాలు జరగడం ఏమిటి? కల్తీ నెయ్యి సరఫరా చెయ్యడమైనా, పరకామణి చోరీ కేసైనా... దేవుడంటే భయం లేనట్టే కదా? దేవుడిని నిజంగా నమ్మేవాళ్లు, పూజించే వాళ్లు ఇలాంటి నీచపు పనులకు పాల్పడరు కదా! తిరుమలలో జరుగుతున్న కొన్ని సంఘటనలను గమనిస్తే టీటీడీలో పనిచేస్తున్న కొందరికి ఆ దేవుడిపైన నమ్మకం, భయం లేనట్టే ఉంది. దేవుడిగా ఆ వెంకటేశ్వరుడిని నమ్మక పోతే నమ్మకపోయారు, ఆ దేవుడి పుణ్యానే కదా వారికి అక్కడ భృతి లభిస్తున్నది? అందుకైనా వారికి ఆ దేవదేవుడిపై భక్తి ఉండాలి కదా? పాలకమండలిగానీ, టీటీడీలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులుగానీ... 'దేవుడ్ని వాడుకుంటున్నామా? ఆ దేవదేవుడి కోసం పనిచేస్తున్నామా?' అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బు మాత్రమే సంపాదించాలని అనుకుంటే అందుకు ఎన్నో మార్గాలు ఉంటాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలలో అనైతిక చర్యలకు పాల్పడటమేమిటి? పాపానికి ఒడిగట్టిన వారి విషయం అలా ఉంచితే, సదరు పాపాన్ని చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని ఏమనాలి? క్రైస్తవ మతస్థుడైన జగన్‌రెడ్డికి కోనేటి రాయుడిపై నమ్మకం లేకపోవచ్చు. ఆ ఏడుకొండల వాడిని కోట్లాది మంది ఆరాధిస్తారు కదా? వారి మనోభావాలనైనా ఆయన గుర్తించి గౌరవించాలి కదా? జీసస్ సన్నిధిలో ఇలా జరిగితే జగన్‌రెడ్డి సహిస్తారా? అని బీజేపీ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించారు కానీ, జగన్‌రెడ్డి వంటి వారికి అవేవీ పట్టవు. వారు తమ స్వార్థం కోసం దేవుళ్లను కూడా వాడుకుంటారు. జగన్‌రెడ్డి ఇందుకు మినహాయింపు కాదు. అందుకే తిరుమలలో జరుగుతున్న అపచారాలు ఆయనకు స్వల్పమైనవిగా కనిపిస్తున్నాయి. తన వాళ్లను రక్షించుకొనే క్రమంలో దేవుడైనా ఆయనకు లెక్క ఉండదు. అయినా అలాంటి వాళ్ల సంగతి ఇక ఆ దేవుడే చూసుకుంటాడు!

క్రీమీలేయర్‌ను కాదంటే, రిజర్వేషన్లు వద్దన్నట్టే!

దేశంలో కులవ్యవస్థ, పేదరికం ఉన్నంతవరకు రిజర్వేషన్ల మీద, రిజర్వేషన్లలో క్రీమీలేయర్ మీద వాదనలు వినపడుతూనే ఉంటాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ధనవంతులు, ఎగువ మధ్య తరగతి వాళ్లను 'క్రీమీలేయర్' అంటాం. వాళ్ల పిల్లలకు రిజర్వేషన్లు ఇవ్వకూడదు అనేది క్రీమీలేయర్ సిద్ధాంతం. ముందుగా మనం రిజర్వేషన్లు లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో మాట్లాడుకుందాం.

1951–52 ఎన్నికల్లో 80శాతం మంది ఎన్నికైన ముఖ్యమంత్రులు ఒకే కులానికి చెందిన వాళ్ళు, మొదటి ముప్పై సంవత్సరాలు ఎంపికైన ఐఏఎస్ ఆఫీసర్లు (ఎస్సీ/ ఎస్టీ తప్ప) 80శాతం మంది ఒకటే కులానికి చెందినవారు. రిజర్వేషన్లు లేని హైకోర్టులో సుప్రీంకోర్టులో జడ్జీలు ఏ కులం వాళ్లు మాత్రమే ఉంటారో చూస్తున్నాం. 60శాతం బీసీలు ఉన్న దేశంలో రెండు శాతం బీసీలు మాత్రమే గత 75 సంవత్సరాలలో జడ్జీలుగా ఎంపిక అయ్యారు. సోకాల్డ్ ఉన్నత కులాల నుంచి వచ్చిన జడ్జీలు అవినీతి చేయకుండా చకచకా జడ్జిమెంట్లు ఏమైనా ఇచ్చారా అంటే అలాంటిది ఏమీ కనపడటం లేదు. పోనీ ఉన్నత వర్గాల నుంచి వచ్చిన ఐఏఎస్‌లు గొప్ప పరిపాలన చేసి దేశంలో పేదరికం పారద్రోలారా అంటే అదీ లేదు. దేశంలో మరో వందేళ్ళ తరవాత కూడా కులం ఉంటుంది. 'నాకు రోటీ లేకున్నా పర్లేదు, విద్య లేకున్నా పర్లేదు, ఉద్యోగం లేకున్నా పర్లేదు, కానీ మందిర్ కావాలి' అనే మూర్ఖులను తయారు చేస్తున్న రాజకీయ పార్టీలు ఉన్నంతవరకు కులాలు వర్ధిల్లుతాయి. మన దేశం మానవ అభివృద్ధి సూచికలో వెనక్కి వెళ్తూనే ఉంటుంది.

అందరికీ తెలియాల్సింది ఏమిటంటే జీడీపీ పెరిగితే మానవ అభివృద్ధి సూచిక పెరగదు, సగటు తలసరి ఆదాయం పెరిగితే మానవ అభివృద్ధి సూచిక పెద్దగా పెరగదు. అందరికీ న్యాయమైన ఉన్నత విద్య, నాణ్యమైన ఆరోగ్య సేవలు, అందరికీ కల్తీ లేని పౌష్టికాహారం, అందరికీ కొనుగోలు శక్తి, లింగ సమానత్వం, స్వచ్ఛమైన తాగునీరు, గౌరవప్రదమైన ఉపాధి, హింస లేని సమాజం... ఇవన్నీ సాధ్యమైనప్పుడే మానవాభివృద్ధి సూచిక ముందుకు వెళుతుంది.

కులాలు ఉన్నంతవరకు రిజర్వేషన్లు ఉండాల్సిందేనని ఎట్లా చెప్పుకుంటున్నామో అలాగే పేదరికం ఉన్నంతకాలం క్రీమీ లేయర్ ఉండాల్సిందే. రిజర్వేషన్లు లేకపోతే ధనిక కులాలు ఎలా ఎక్కువ లబ్ధి పొందుతాయో, అలాగే క్రీమీలేయర్ లేకపోతే రిజర్వేషన్ కులాలలో ఉన్న ధనవంతులు ఆ కులాలలో ఉన్న పేదలను వెనక్కినెట్టి ఎక్కువ లబ్ధి పొందుతారు.

> కులాలు ఉన్నంతవరకు రిజర్వేషన్లు ఉండాల్సిందేనని ఎట్లా చెప్పుకుంటున్నామో, అలాగే పేదరికం ఉన్నంతకాలం క్రీమీలేయర్ ఉండాల్సిందే. రిజర్వేషన్లు లేకపోతే ధనిక కులాలు ఎలా ఎక్కువ లబ్ధి పొందుతాయో, అలాగే క్రీమీలేయర్ లేకపోతే రిజర్వేషన్ కులాలలో ఉన్న ధనవంతులు తమ కులాలలో ఉన్న పేదలను వెనక్కినెట్టి ఎక్కువ లబ్ధి పొందుతారు.



క్రీమీలేయర్ లేకపోవడం వల్ల– ఒకే గేటెడ్ కమ్యూనిటీలో నివసించే ఇద్దరు అమ్మాయిలు ఎలా ఫీల్ అవుతారో చూద్దాం. ఒక ఎస్టీ అమ్మాయి, ఒక ఓసీ అమ్మాయి ఇద్దరి ఆర్థిక స్థాయి ఒక్కలాగే ఉంది. ఎస్టీ అమ్మాయికి తన కంటే పది మార్కులు తక్కువ వచ్చినా కానీ ఒక మంచి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినప్పుడు ఆ ఓసీ అమ్మాయికి ఏమీ అర్థం కాదు. ఇదేమి అన్యాయం అనుకుంటుంది. రిజర్వేషన్ల చరిత్ర, నేపథ్యం తెలియదు కాబట్టి ఆ ఓసీ అమ్మాయి ఇక అప్పటి నుంచి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తుంది. కింది కులాలను ద్వేషిస్తుంది. ఇందుకు భిన్నంగా– గ్రామీణ ప్రాంతంలో కానీ, పేదవాళ్లు ఉన్న బస్తీ నుంచి కానీ వచ్చిన అమ్మాయికి పది మార్కులు తక్కువ వచ్చినా, ఆ ఎంబీబీఎస్ సీటు వచ్చినప్పుడు అదే ఓసీ అమ్మాయి కొంతమేరకు అర్థం చేసుకుంటుంది. క్రీమీలేయర్ అనేది రిజర్వేషన్లలో రిజర్వేషన్ అని అర్థం చేసుకోవాలి. క్రీమీలేయర్ వద్దు అనే వాళ్ళు రిజర్వేషన్ వద్దు అనే వాళ్లతో సమానం.

క్రీమీలేయర్ విధానం ఉంటే విద్యలో రిజర్వేషన్ సీట్లు, ప్రభుత్వ రిజర్వుడు ఉద్యోగాలు నిండవనీ ఖాళీగా ఉండిపోతాయనీ చేసే వాదన చాలా తప్పు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో కొన్ని కోట్లమంది అర్హులైన అభ్యర్థులు ఉన్నారు.

'మంచి కార్పొరేటు విద్యాసంస్థల్లో చదువు పొందిన ఉన్నత ఉద్యోగస్థుల పిల్లలనూ, నాణ్యతలేని ప్రభుత్వ/ బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల్లో చదువు పొందిన పేదకూలీల, అల్పాదాయ వర్గాల పిల్లలనూ ఒకేలా చూడడం సరికాద'ని సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి గవాయి వాదనతో నేను –విద్యను పొందిన మొదటి తరం ఉన్నత ఉద్యోగిగా– పూర్తిగా ఏకీభవిస్తున్నాను. క్రీమీలేయర్ విధానం ఉంటే అందరికీ సమాన అవకాశాలు వస్తాయి. ఈ విధానం అందరికీ సమానత్వం, అందరికీ సమన్యాయం అనే రాజ్యాంగ స్ఫూర్తికి అనుబంధంగానే ఉందని మనం తెలుసుకోవాలి. 'వాళ్ల వాళ్ల కొట్టుకొని చావనీ' అని పరిపాలన చేసే పెద్ద కులాల పాలకులకు ఇది ఒక పెద్ద సమస్యగా కనపడదు. సమాజంలో ప్రభావం చూపించగలిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉన్నత ఉద్యోగులతో మనకు ఎందుకు వివాదం అని రాజకీయ పార్టీలు ఈ సమస్యను పక్కన పడేస్తాయి. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి, సమానత్వం సాధించాలి అనుకునే బుద్ధిజీవులే ఈ విషయంలో నిర్మొహమాటంగా మాట్లాడవలసిన అవసరం ఉంది.

▪ ఆకునూరి మురళి
రిటైర్డ్ ఐఏఎస్





● సుమ సోయగం

8

నగరంలోని పాలిక్లినిక్ రోడ్డులో ఉన్న ఓ మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్-ఏపీ ఏర్పాటు చేసిన పుష్ప, ఫల, గృహ అలంకరణ మొక్కల ప్రదర్శన ఆకట్టుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన శాఖ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పచ్చదనం, సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన కొనసాగుతోంది. 46 స్టాల్స్‌లో పూలమొక్కలు, 20 స్టాల్స్‌లో ఆర్గానిక్ ఆకుకూరల, కూరగాయల మొక్కలు ఏర్పాటు చేశారు.

పుష్పాంజలి



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగింది. వాడవాడలా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రతినబూనారు. ఈ సందర్భంగా స్వరాజ్య మైదానంలో ఉన్న అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలాభిషేకం చేసి నివాళులర్పించారు.



● గౌరవ వందనం

హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నగరంలోని సీఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ రాజశేఖరబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంతకుముందు సీపీ.. హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

8

పార్కింగ్ దోపిడీ

విజయవాడ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ బాదుడు

ప్రీమియం పేరుతో గంటకు రూ.12, రోజుకు రూ.288 వసూలు

విజయవాడ రైల్వే స్టేషన్‌లో పార్కింగ్ ఫీజులు ప్రయాణికులకు తలకుమించిన భారంగా మారుతున్నాయి. రోజుకు రెండు లక్షల మంది రాకపోకలు సాగించే అతిపెద్ద రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ చేయాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఊరెళ్లి రావడం కంటే కూడా రైల్వేస్టేషన్‌లో ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తే ప్రయాణ టికెట్‌కు మించి ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది. ప్రీమియం పేరుతో గంటకు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. నాన్ ప్రీమియం పేరుతో గంటలకు లెక్కలు కట్టి మరీ డబ్బు పిండుతున్నారు.

- నాన్ ప్రీమియం పార్కింగ్ ప్లేసుల్లో 3 గంటలకు రూ.12
- రోజుకు రూ. వందల్లో చెల్లిస్తున్న ప్రయాణికులు
- ఉపాధి, ఉద్యోగాలు చేసుకోవటానికి వచ్చే వారికి షాక్
- రైలు టికెట్ కంటే అధికంగా వసూళ్లు
- నెలవారీ పాసులకు మంగళం.. అడిగితే గొడవలు
- రైల్వే ఉద్యోగులకూ పార్కింగ్ వసతి లేని దుస్థితి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం విజయవాడ నుంచి రాకపోకలు సాగించే వారికి రైల్వే స్టేషన్ దగ్గర పార్కింగ్ ఫీజులు మోయలేని భారమవుతున్నాయి. రైల్వే అధికారులు యూనిక్ పాలసీ ప్రకారం టెండర్లు పిలుస్తున్నామని చెబుతున్నారు కానీ, వాహనాలు పార్కింగ్ చేసే ప్రయాణికుల జేబులకు మాత్రం మిగతా 6లో..

నెలవారీ పాసులు ఇవ్వరు

రైల్వేశాఖ నిబంధనల ప్రకారం పార్కింగ్ నిర్వాహకులు కచ్చితంగా నెలవారీ పాసులు ఇవ్వాలి. ఈ పాసుల కోసం ఎవరైనా ప్రయాణికులు అడిగితే, పాసులు పరిమితమని, అందరికీ సాధ్యం కాదని చెబుతున్నారు. ఇలా అందరికీ మాయ మాటలు చెబుతూ.. ఎవరికీ పాసులు ఇవ్వట్లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. గట్టిగా అడిగితే దందాగిరీ చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. పాసులైతే రాయితీ ఇవ్వాలనే పార్కింగ్ ప్లేస్‌ల నిర్వాహకులు ఇలా చేస్తున్నారు.

పాలసీ ప్రకారమే అంటున్నరైల్వే అధికారులు

పార్కింగ్ ప్లేస్‌ల వసూళ్లను రైల్వే అధికార వర్గాలు సమర్థించుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తున్నామని, నిబంధనల మేరకు టెండర్లు పిలుస్తున్నామని అంటున్నారు. ఇక్కడి భౌగోళిక పరిస్థితులు, ప్రయాణికుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను మాత్రం రైల్వే అధికారులు పెద్దగా పరిగణనలోకి తీసుకోవట్లేదు.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు మార్గంసుగమం

జిల్లావ్యాప్తంగా రహదారులకు మరమ్మతులు

- టెండర్లు ఆహ్వానించిన అధికారులు.. రూ.43 కోట్ల కేటాయింపు
- కొన్ని రోడ్లకు మరమ్మతులు, మరికొన్ని కొత్తగా నిర్మాణం

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించేందుకు మలివిడతగా రూ.43 కోట్లతో రోడ్లు భవనాల సంస్థ పనులు చేపట్టనుంది. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో పలు రోడ్ల పనులకు ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ నెలలోనే టెండర్లన్నీ ఖరారు కానున్నాయి. ఇటీవల మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించడానికి తొలిదశలో మిగతా 6లో..

మల్లవల్లి సీపీసీ.. లులుకు కేటాయింపు

కొత్త సంవత్సరంలో కార్యకలాపాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మల్లవల్లి మెగా ఫుడ్‌పార్కులో కోర్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ) నిర్వహణను 'లులు' గ్రూపు అనుబంధ సంస్థకు ఏపీఐఐసీ అధికారులు ప్రాథమికంగా అప్పగించారు. పక్షం రోజుల కిందట లులు గ్రూపు సంస్థకు ఏపీఐఐసీ అధికారులు అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చారు. అడ్వాన్స్ పొజిషన్ ఇచ్చిన 60 రోజుల్లో లులు గ్రూపు అద్దెను చెల్లించాలి. అద్దె చెల్లింపులు జరిగిన వెంటనే పూర్తిస్థాయిలో కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏపీఐఐసీ అధికారులు అప్పగిస్తారు. అద్దె ఇప్పటికిప్పుడు చెల్లించకపోయినప్పటికీ ప్రభుత్వం ఆదేశిస్తే పూర్తిస్థాయిలో అప్పగించే అవకాశాలు ఉన్నాయి. మిగతా 6లో..

స్క్రబ్ టైఫస్ కలవరం

ఉయ్యూరు మండలం ముదునూరులో ఒకరి మృతి

- ఐహెచ్‌ఐపీ పోర్టల్‌లో పాజిటివ్‌గా నమోదు
- కిడ్నీ మరణమంటున్న కృష్ణాజిల్లా వైద్యాధికారి
- అధికారికంగా కృష్ణాలో 15, ఎన్టీఆర్‌లో రెండు కేసులు
- గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు



ముదునూరులో స్థానికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో యుగంధర్ (ఇన్‌సెట్‌లో) శివశంకర్‌రాజు (ఫైల్)

విజయవాడ/ఉయ్యూరు/గుడ్లవల్లేరు/కంచికర్ల రూరల్/జి.కొండూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ ఉమ్మడి కృష్ణాజిల్లాను కలవరపెడుతోంది. కృష్ణాజిల్లాలో 15 కేసులు, ఎన్టీఆర్ జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయి. ఇవికాకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఈ లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో స్క్రబ్ టైఫస్ బారిన పడి ఉయ్యూరు మండలం ముదునూరు గ్రామానికి చెందిన బుట్టి శివశంకర్‌రాజు (42) ఈనెల 4న మృతిచెందడం కలకలం రేపుతోంది. జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న ఆయన మచిలీపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. లక్షణాలను బట్టి పరీక్ష చేయగా, స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని మిగతా 6లో..

గుడ్లవల్లేరులో రెండు కేసులు

గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో రెండు స్క్రబ్ టైఫస్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారి యశస్వినీ శనివారం తెలిపారు. స్థానిక ఇందిరా కాలనీకి చెందిన మానస, పామర్రుకు చెందిన అమలేశ్వరి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యంతో వచ్చారని, రక్త నమూనాలను సేకరించి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పంపగా, స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నమోదైందన్నారు. ఇద్దరికీ చికిత్స అందిస్తున్నామని, ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

రీల్ కోసమే హత్య

నవీన్‌రెడ్డి హత్య కేసులో కీలక మలుపు

- ఇన్‌స్టా రీల్ వేరొకరి ఫోన్‌లో చూడొద్దన్నందుకు కోపం
- తనకే ఎదురుచెప్పాడని నవీన్‌పై సాయి సీసాతో దాడి
- హత్య అనంతరం తెలంగాణాలోకి పరార్
- సూర్యాపేట, ఖమ్మంలో ఉన్నట్టు సమాచారం



రైలు ట్రాక్‌పై ప్రమాదకరంగా నిందితుడి సాయి రీల్స్

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాలో ఓ రీల్ కోసమే సస్పెక్ట్ షీటర్ అలవల నవీన్ రెడ్డిని గద్దె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి హత్య చేశాడా? అంటే అవుననే సమాధానమే వస్తుంది. సాయి పుట్టినరోజు సందర్భంగా గురువారం రాత్రి ధర్మవరప్పాడు తండా చప్టాపై మందు పార్టీ చేసుకున్నారు. ఈ పార్టీలో నవీన్‌రెడ్డి, అన్వేష్, నందకిషోర్‌తో పాటు మరికొంతమంది ఉన్నారు. వారంతా కలిసి బీరులు, మద్యంతో పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. పుట్టినరోజు సందర్భంగా సాయి తన రీల్స్‌ను ఇన్‌స్టాలో పోస్టు చేశాడు. పార్టీలో ఉన్న మరో యువకుడి ఫోన్ తీసుకుని సాయి తన రీల్స్‌ను చూసుకుంటున్నాడు. కొద్దిసేపటికి నవీన్‌రెడ్డి ఆ ఫోన్‌ను ఆ యువకుడికి ఇవ్వమని చెప్పాడు. ఆ రీల్స్‌ను సాయి ఫోన్‌లో చూసుకోవాలని సూచించాడు. ఇలా రెండు, మూడుసార్లు చెప్పేసరికి సాయికి కోపం వచ్చింది. నవీన్ తనకే ఆదేశాలు ఇస్తాడా.. అని కోపోద్రిక్తుడయ్యాడు. ఇద్దరి మిగతా 6లో..

డిజిటల్ అరెస్టు మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి



జ్యోతి వెలిగించి సమ్మిట్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

లబ్బీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి సూచించారు. బందర్ రోడ్డులోని ఒక కల్యాణ మండపంలో శనివారం ఆసరా ఏడవ జాతీయ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయమూర్తి మాట్లాడుతూ ఆధునిక యుగంలో సైబర్ నేరాలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా డిజిటల్ అరెస్టుల పేరుతో మోసాలు జరుగుతు న్నాయని, కానీ అసలు డిజిటల్ అరెస్టు అనే వ్యవస్థ లేదని పేర్కొన్నారు. సైబర్ వలలో ప్రజలు చిక్కుకోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయస్థానాలు పనిచేస్తున్నాయన్నారు. అనంతరం బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది, అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటి అండ్ అవేర్‌నెస్ ప్రతినిధి హబీబ్ సుల్తాన్, సంస్థ కోఆర్డినేటర్ క్రిష్టి, ఢిల్లీ ప్రెసిడెంట్ రాహుల్ సౌధాన్, జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు పాల్గొన్నారు.

'ఫైబర్‌నెట్' ఎఫ్ఐఆర్ ఇవ్వండి

● కోర్టులో ఎమ్మార్పీఎస్ నేత పిటిషన్

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ఫైబర్ నెట్ కార్పొరేషన్‌లో అవినీతి, నిధుల దుర్వినియోగం జరిగిందంటూ సీఐడీ నమోదు చేసిన కేసు వివరాలను అందజేయాలని ఎమ్మార్పీఎస్ నేత దాసరి సువర్ణరాజు ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ఫైబర్‌నెట్ కేసు ఎఫ్ఐఆర్, సీఆర్పీసీ 161 వాంగ్మూలాలు, తుది దర్యాప్తు నివేదికను ఇవ్వాలని కోరారు. ఎఫ్ఆర్ఐ, ఫిర్యాదు కాపీ నకళ్లను మాత్రమే ఇవ్వాలని కోర్టు అధికారులను న్యాయాధికారి పి.భాస్కరరావు ఆదేశించారు.

మల్లవల్లి సీపీసీ.. లులుకు కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

పాత కాంట్రాక్టర్‌తో సీపీసీకి ఉన్న లావా దేవీలు పూర్తిగా తెగిపోయాయి. ఆ కాంట్రాక్టు సంస్థతో సంప్రదింపులు జరిపి తాళాన్ని ఏపీఐ ఐసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రూ.70 కోట్లతో ఏపీఐఐసీ మెగా ఫుడ్‌పార్క్‌లో ఏర్పాటు చేసిన కోర్ ప్రాసెసింగ్ సెంటర్‌ను నూతన సంవత్సరంలో లులు అనుబంధ గ్రూప్ నిర్వహించనుంది. లులు నిర్వహణలో ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల ప్యాకింగ్‌తో పాటు పల్ప్ తయారీ, వాటి ప్యాకింగ్ ఇక్కడ చేపడతారు. అలాగే, లులు తన సొంత ఆర్డర్లపై పల్ప్, ప్యాకింగ్ వంటివి చేపడుతుంది.

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా శాఖ ఏర్పాటు చేయాలి

● కృష్ణవేణి సంగీత నీరాజనంలో మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగీత ప్రపంచంలో గురు, శిష్య పరంపర కొనసాగిస్తూ మనం అస్వాదించే సంగీత, సాహిత్య వారసత్వాలను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం మంత్రి కందుల దుర్గేష్ రెండు రోజుల పాటు నిర్వహించే కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీకి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేటాయించాలని ఇప్పటికే కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు కేంద్ర పర్యాటక శాఖ అడిషనల్ డైరక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డేకు తెలియజేశారన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, జిల్లాలో కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, కొండపల్లి కోట, గండికోటలు, బీచ్‌లు, సహజ సౌందర్యం వంటి వివిధ ఆకర్షణలన్నారు. భారతదేశాన్ని ఐక్యత, వైవిధ్యం ఉన్న దేశంగా అభివర్ణించారు. భారతదేశం విశ్వగురువుగా ఎదగడానికి సిద్ధంగా ఉన్నందున ప్రపంచం భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైపు చూస్తోందన్నారు. కేంద్ర పర్యాటక శాఖ అడిషినల్ డైరక్టర్ జనరల్ వెంకట్రామన్ హెగ్డే స్వాగతోపన్యాసం చేస్తూ, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు.

సమన్వయంతో విజయవంతం

● దీక్షల విరమణ ఏర్పాట్లు పరిశీలించిన దేవదాయ కమిషనర్

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భవానీ దీక్షల విరమణ ఈ నెల 11 నుంచి 15 వరకు జరుగనున్న సందర్భంగా చక్కని ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతం చేస్తామని దేవదాయశాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ అన్నారు. శనివారం దేవస్థానం అధికారులు, ధర్మకర్తలు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. 48 గంటల ముందే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం కావాలని ఆదేశించామన్నారు. ప్రతీ భక్తుడు పూర్తి సంతృప్తిగా దీక్షవిరమణ చేసుకుని వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దేవదాయశాఖ నుంచి డిప్యూటేషన్‌పై సిబ్బందిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్‌ల సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

హే.. కృష్ణా!

కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ నిర్ణయంపై విమర్శలు

> కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ నిర్ణయం అన్నదాతలకు శాపంగా మారింది. పుష్కలంగా పులిచింతల ప్రాజెక్టులో నీరున్నా ఎత్తిపోతల పథకాలకు నికర జలాలను కేటాయించడంలేదు. దీంతో మిగులు జలాలతోనే నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా దినదిన గండంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ఆయకట్టు పంటల పరిస్థితి తయారైంది.

- పులిచింతల ప్రాజెక్టులో పుష్కలంగా నీరు
- ఎత్తిపోతల పథకాలకు నికర జలాల కేటాయింపులు నిల్
- మిగులు జలాలతోనే నిర్వహణ
- దినదిన గండంగా పశ్చిమ ఎన్టీఆర్ జిల్లా ఆయకట్టు సాగు
- నీరందక సాగు మధ్యలోనే ఎండి పోతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



పులిచింతల ప్రాజెక్టు

(ఆంధ్రజ్యోతి, నందిగామ): నికర జలాలు కేటాయించకుండా మిగులు జలాలతో ఎత్తిపోతల పథకాల నిర్వహణ దినదిన గండంగా మారింది. కృష్ణానదిపై ఎన్టీఆర్ జిల్లా వైపు సుమారు 24 ఎత్తిపోతల పథకాల ద్వారా 48 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. అత్యంత శక్తివంతమైన ఈ ఎత్తిపోతల పథకాలకు నీరు పుష్కలంగా అందితే ఆయకట్టులోని పూర్తి భూమిలో రెండు పంటలు పండించే అవకాశం ఉంది. కానీ నదీ ప్రవాహం తగ్గిన సమయంలో ఎత్తిపోతల పథకాలకు సక్రమంగా నీరు అందడం లేదు. ఫలితంగా సాగు మధ్యలో నీరు లేక పంటలు దెబ్బతింటున్నాయి. డెల్టా రైతుల అవసరాల కోసమంటూ పులిచింతల డ్యామ్ దగ్గర భారీగా నీటిని నిల్వ ఉంచుతున్నారు. ఎప్పుడో అవసరమొస్తాయని ఇప్పటి అవసరాలను అటకెక్కించి ఎన్టీఆర్ జిల్లాకు అన్యాయం చేయడం కృష్ణా సెంట్రల్ డివిజన్ కమిటీ అనాలోచిత నిర్ణయమని విమర్శలు వస్తున్నాయి. మొత్తం 48 వేల ఎకరాల సాగు అంటే సామాన్యమైన విషయం కాదు. కొద్ది పాటి డ్యామ్ ఆయకట్టుకు సమానమని గుర్తించాల్సి ఉంది. భవిష్యత్ కోసం ప్రణాళిక అవసరమే కానీ వర్తమానంలో రైతును నష్ట పరిచడం సరైన నిర్ణయం కాదన్న విమర్శలు వస్తున్నాయి.

43 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా..

గతంలో కేవలం పది టీఎంసీల నీటిని మాత్రమే డెల్టా అవసరాలకు నిల్వ ఉంచే వారు. కానీ ప్రస్తుతం 43 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కృష్ణా సెంట్రల్ డివిజన్ అధికారులు నవంబరు మాసంలోనే పులిచింతల నీటిని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా వైపు పథకాలకు నీరు అందడం లేదు. పులిచింతల నుంచి మార్చి నెలాఖరు వరకూ నీరు విడుదల చేస్తేనే ఆయకట్టు రైతులు ఒడ్డున పడతారు. అప్పటి వరకూ నీరు విడుదల చేసినా పులిచింతలకు, డెల్టాకు వచ్చే నష్టం లేదు. నిరంతరాయంగా నీటిని విడుదల చేసినా పది టీఎంసీలు కూడా ఖర్చు కాని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో ప్రభుత్వం స్పందించి దీనిపై సమీక్ష నిర్వహించి పులిచింతల నుంచి ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేయించాల్సి ఉంది. జలవనరులను కాపాడుకోవడమంటే అనవసరంగా నిల్వ ఉంచడం కాదని, సమర్థవంతంగా సాగుకు వినియోగించుకోవడమన్న విషయాన్ని అధికారులు గుర్తించాల్సి ఉంది. కృష్ణా జలాలను ఎత్తిపోతల ద్వారా పంట పొలాలకు అందించే విధంగా ప్రభుత్వాలు అనుమతులు, నిధులు ఇచ్చి నిర్మించాయి. కానీ ఆ పథకాలకు నికర జలాలు కేటాయించకపోవడం నిర్లక్ష్యంగా భావించాల్సి ఉంది. కేవలం నదిలో నీరున్నప్పుడే వినియోగించుకోవడమంటే ఆ ఆయకట్టును వర్షాధార ఆయకట్టుగానే భావించాల్సి ఉంటుంది. వర్షాలు పడే సమయంలో ఆయకట్టుకు కృష్ణానది నీరు పెద్దగా అవసరం ఉండదు. వర్షాలు వెనకేసిన తర్వాత నదిలో నీరుండదు. అవసరమైన సమయంలో నదిలో నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. కనుక ఆయకట్టు స్థిరీకరణకు స్థిరమైన నీటి కేటాయింపులు చేపట్టాల్సి ఉంది. ఇందు కోసం మార్చి నెలాఖరు వరకూ నిరంతరం మూడు వేల క్యూసెక్కుల నీటిని పులిచింతల డ్యామ్ నుంచి విడుదల చేయాల్సి ఉంది.

గోదావరి ఉండగా ఎందుకు ఆందోళన?

డెల్టా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ మెట్ట ప్రాంత రైతులను ఇబ్బంది పెడుతున్న కృష్ణా సెంట్రల్ డివిజన్ అధికారులు మితిమీరిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పులిచింతల నీటి మట్టం నాలుగో శాతం ఉన్నా డెల్టా అవసరాలకు సరిపోయే అవకాశం ఉంది. దీనికి తోడు ఎప్పుడు కావాలంటే అప్పుడు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తీసుకువచ్చే అవకాశం ఉంది. డెల్టా రైతాంగం కోసం క్షణం కూడా ఆలోచన చేయాల్సిన పని లేని నేపథ్యంలో మెట్ట రైతుల అవసరాలను అడ్డుకోకుండా అధికారులు, పాలకులు స్పందించి పులిచింతల నీటిని కేటాయించాల్సి ఉంది. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు స్పందించి పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించం ద్వారా ఎత్తిపోతల పథకాల ఆయకట్టును ఆదుకోవాల్సి ఉంది. వనరులు ఉన్నా వడ్డించే వారు లేక అల్లాడుతున్న మెట్ట రైతుకు అండగా నిలవాల్సి ఉంది. పులిచింతల నీటిని నిరంతరం పథకాలకు అందించేందు గాను ఎన్టీఆర్ జిల్లా వైపు కృష్ణానదిలో కాలువ తీసి పటిష్టంగా లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అలా చేపడితే నీరు కూడా వృథా కాకుండా కొద్దిపాటి నీటితోనే ఎత్తిపోతల పథకాలు పూర్తి సామర్థ్యంతో ఆయకట్టుకు నీరందించగలుగుతాయి. దీంతో రైతుల జీవన ప్రమాణాలు పెరిగి కూటమి ప్రభుత్వం ఆశించిన విధంగా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది.

భవానీ దీక్షల విరమణకు పకడ్బందీ ఏర్పాట్లు

● సి.వి.రెడ్డి ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నం
● దేవస్థానంలో ఖర్చులు తగ్గించేందుకు చర్యలు
● మరింత నాణ్యమైన లడ్డూ ప్రసాదం
● దుర్గగుడి చైర్మన్ బి.రాధాకృష్ణ



మాట్లాడుతున్న చైర్మన్ రాధాకృష్ణ, చిత్రంలో ఈవో శీనానాయక్, పాలకవర్గ సభ్యులు

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు జరగనున్న భవానీ దీక్ష విరమణలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ తెలిపారు. శనివారం వన్‌టౌన్ బ్రాహ్మణవీధి జమ్మిదొడ్డిలోని దేవస్థానం కార్యాలయంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. పలు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. అనంతరం ఈ.వో శీనా నాయక్‌తో కలిసి మీడియాతో చైర్మన్ రాధాకృష్ణ మాట్లాడారు. భవానీ దీక్ష విరమణల ఏర్పాటుకు పెద్ద ఎత్తున భవానీలు, సాధారణ భక్తులు రానున్నట్లు తెలిపారు. చివరి రెండు రోజుల్లో పెద్ద ఎత్తున భవానీలు వచ్చే అవకాశం ఉందన్నారు. అమ్మవారి దర్శనానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతుందని చెప్పారు. గత పదేళ్లగా సుమారు 50, 60 మంది రిటైర్ అయ్యారని, ఆ పోస్టులు భర్తీకాకపోవటం ఇబ్బందికర పరిస్థితి ఉందన్నారు. భక్తుల తాకిడి పెరగటం వలన కొన్ని కొత్త నిర్ణయాలు తీసుకుంటున్నామని, భక్తుల నుంచి కూడా అభిప్రాయలు తీసుకుంటున్నామని తెలిపారు. దేవస్థానంలో ఖర్చులు తగ్గించటానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మంచినీటి సరఫరాకు ఎక్కువ ఖర్చు అవుతుందని దేవస్థానమే వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు తగిన చర్యలు చేపడతామని తెలిపారు. వాహనాల్లో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 500 కార్లు పార్కింగ్ చేసే విధంగా తగిన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో నష్టం వచ్చిన ప్పటికీ ఇంకా నాణ్యమైన లడ్డూ ప్రసాదం అందిస్తామని చెప్పారు. దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాలపై సమావేశంలో చర్చించామని, వాటిని ఏ విధంగా ఉపయోగించాలనే దాని పై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. దుర్గాఘాట్‌ను మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వ్యాపారస్తులు భక్తుల నుంచి అధిక రుసుము వసూలు చేయకుండా ఉండేందుకు ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని వ్యాపారస్తులకు సూచించినట్లు చెప్పారు. దేవస్థానం పాలక మండలి దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు సేవలు అందించటానికి పూర్తిగా సపోర్టు చేస్తుం దని, అందుకుగాను ఆలయ అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న లడ్డూ ప్రసాదం తయారీ భవనం, అన్నదాన భవనాలను ఆరు నెలల్లో పూర్తి చేసి భక్తులకు అందు బాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. ఆలయ ప్రాంగణాన్ని మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు మరో 100 మంది సిబ్బందిని నియమించవలసి ఉందని తెలిపారు. ముఖ్యంగా భవానీ దీక్షల విరమణల అనంతరం దేవస్థానం అభివృద్ధిపై భక్తులకు కల్పించవలసిన సౌకర్యాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించారు. ఆలయ ఉద్యోగులు భక్తుల పట్ల మర్యాదగా మాట్లాడేవిధంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ను సీవీరెడ్డి ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు బోర్డు సభ్యులతో చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

రెండో విడత భూసమీకరణ విరమించుకోవాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గాంధీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రెండవ దశ భూసమీకరణ ప్రక్రియను పలువురు వక్తలు తీవ్రంగా వ్యతిరేకించారు. మొదటి దశ భూసమీకరణలో భూములిచ్చిన రైతులకు నేటికి న్యాయం చేయలేదని విమర్శించారు రైతు సంఘం నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యర్యంలో సమావేశం ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఇప్పటికే సేకరించిన భూమిని అభివృద్ధి చేయకుండా ఇంకా భూసమీకరణ చేయాలని నిర్ణయించడం దురదృష్టకమన్నారు. అమరావతి పేరుతో సుమారు 65 వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్ర ప్రజలపై తీవ్ర భారం మోపారని విమర్శించారు. వడ్డే శోభనాద్రీశ్వర రావు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు పగటి కలలకు రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరైందికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ ఎన్.తులసీరెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో వైసీపీ, కూటమి ప్రభుత్వాలు విఫలం చెందాయని విమర్శించారు. సీపీఎం నేత బాబురావు తదితరులు మాట్లాడారు.

స్క్రబ్ టైఫస్ కలవరం

వచ్చింది. దీంతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం (ఐహెచ్ఐపీ) పోర్టల్‌లో రాజుకు పాజిటివ్ వచ్చినట్టుగా అప్‌లోడ్ చేశారు. విషయం తెలుసుకున్న కృష్ణాజిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.యుగంధర్ శనివారం సాయంత్రం ముదునూరులోని మృతుడు శివశంకర్‌రాజు ఇంటికి వెళ్లారు. అతని కుటుంబసభ్యులు, స్థానికులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కిడ్నీ సంబంధిత వ్యాధితో శివ శంకరరాజు బాధపడుతున్నట్లు తమ విచారణలో తేలిందని, దీనివల్లే ఆయన మృతిచెందినట్లు నిర్ధారణకు వచ్చామని వెల్లడించారు. పేడపురుగు కుట్టడం వల్ల స్క్రబ్ టైఫస్ వ్యాధి వస్తుందని, కానీ చనిపోయే అవకాశాలు చాలా తక్కువని తెలిపారు. మందులు వాడితే తగ్గిపోతుందన్నారు.

కంచికచర్లలో ఒక కేసు

నందిగామ నియోజకవర్గ పరిధిలోని కంచికచర్లలో స్క్రబ్ టైఫస్ లక్షణాలతో మహిళ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కంచికచర్లలో ఆ మహిళకు స్క్రబ్ టైఫస్ సోకినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు రావడంతో జిల్లా వైద్యాధికారులు స్పందించారు. కంచికచర్ల ఇందిరా కాలనీకి చెందిన మహిళ ఈనెల 3న జ్వరంతో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆమెకు 5న పరీక్షలు నిర్వహించగా, స్క్రబ్ టైఫస్ అని వైద్యులు గుర్తించారు. సమాచారాన్ని కంచికచర్ల పంచాయతీ అధికారులకు సమాచారం అందించడంతో అధికారులు అప్రమత్తమై రక్షణ చర్యలు చేపట్టారు. మహిళా నివాసిత ప్రాంతంలో బ్లీచింగ్ సున్నం పిచికారీ చేశారు.

జి.కొండూరులో ఒక కేసు

జి.కొండూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సంకటి రాకేశ్ అనే రెండున్నరేళ్ల బాలుడికి స్క్రబ్ టైఫస్ సోకింది. ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. రాకేశ్ ఆరు నెలల నుంచి మైలవరం మండలం పొందుగల గ్రామంలో నానమ్మ ఇంటి దగ్గర ఉంటున్నాడు. వారం క్రితం బాలుడికి తీవ్ర జ్వరం రావడంతో మైలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి అనంతరం విజయవాడ పాత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక పరీక్షలో స్క్రబ్ టైఫస్ అని తేలింది. బాబు శరీరంపై మచ్చలు కానీ, గాయాలు కానీ లేకపోవడంతో కొత్త ప్రభుత్వ ఆసుపత్రికి పరీక్ష కోసం బాలుడి రక్త, మూత్ర శాంపిల్స్ పంపారు. నాలుగు రోజుల తర్వాత చెబుతామని వైద్యులు చెప్పారని బాలుడి తల్లి తెలిపింది.

రీల్ కోసమే హత్య

(5వ పేజీ తరువాయి)

మధ్య మాటామాటా పెరిగి నవీన్, సాయి మధ్య ఘర్షణ మొదలైంది. వెంటనే చప్టాపై ఉన్న బీరు సీసాను పగలగొట్టి నవీన్‌పై ఇష్టానుసారంగా దాడి చేసి చంపేశాడు.

పరారీలో..

ఈ హత్య కేసులో ప్రధాన నిందితుడు గద్దె సాయికృష్ణ అలియాస్ పిల్ల సాయి ఎక్కడున్నాడు? నవీన్‌రెడ్డి హత్య తర్వాత తెలంగాణాలోకి పారిపోయాడా? సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని, వేర్వేరు నెంబర్ల నుంచి స్నేహితులకు ఫోన్లు చేస్తున్నాడా? అంటే దర్యాప్తు బృందాలు అవుననే అంటున్నాయి. హత్య తర్వాత అక్కడి నుంచి తెలంగాణాలోకి పారిపోయాడని తెలిసింది. సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో సంచరిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సూర్యాపేటలోని ఓ లాడ్జిలో బస చేశాక ఖమ్మం పారిపోయినట్టు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. అక్కడి నుంచి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. వేర్వేరు నెంబర్ల నుంచి చిల్లకల్లులో ఉన్న స్నేహితులకు ఫోన్లు చేసి డబ్బు పంపమని అడుగుతున్నాడని తెలిసింది.

ఎక్కడున్నా గ్యాంగ్ తయారీ

సాయి విజయవాడలోనే కాదు.. ఎక్కడున్నా ఒక గ్యాంగ్‌ను తయారు చేసుకుంటాడు. రాణిగారితోటలో పదిమంది యువకులను చేరదీసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డాడు. వారికి గంజాయిని అలవాటు చేశాడు. దారినపోయే జనాన్ని బెదిరించి, డబ్బు వసూలుచేసి వారికి సమకూర్చాడు. ఆ యువకులతో గంజాయి విక్రయాలు చేయించేవాడు. ఈ గ్యాంగ్ మొత్తాన్ని కృష్ణలంక పోలీసులు గంజాయి కేసుల్లో జైళ్లకు పంపారు. గోవా నుంచి చిల్లకల్లు చేరుకున్న నవీన్‌రెడ్డి, సాయి ఒకే గదిలో నివాసం ఉంటున్నారు. అక్కడ కూడా కొత్త గ్యాంగ్‌ను తయారు చేసినట్టు తెలుస్తోంది. గురువారం సాయి పుట్టినరోజు సందర్భంగా చిల్లకల్లులో 50 మంది యువకులు 'హ్యాపీ బర్త్‌డే సాయి అన్న' అంటూ ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకోవడమే ఇందుకు నిదర్శనం.

కథలు వెతికే కష్టంలో నుంచి వచ్చిందే... వార్షిక సంకలనం

● కథాసాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్



విజయవాడ కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ సంకలనం 'కథ 60-85' పుస్తకం కోసం కథలు వెతికే క్రమంలో పడిన కష్టం నుంచి వచ్చిన ఆలోచనే ఈ కథా వార్షిక సంకలనాలని కథాసాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్ అన్నారు. ఆదివారం సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కథ 2024' గురించి ముచ్చటిస్తూ "శివారెడ్డి, హరి, చలసాని ప్రసాదరావు, చేకూరి రామారావు వంటి పెద్దల ప్రోద్బలంతో ఈ సంకలనాల పని మొదలుపెట్టాను. మరో సంపాదకుడిగా ఉండవలసిందిగా పాపినేని శివశంకర్‌ను సంప్రదించాను. ఆయన సరే అనడంతో ఇద్దరి ప్రయాణం మొదలైంది. 1991 మార్చి నెలలో ఇద్దరం అనుకుని కథల ఎంపిక మొదలుపెట్టి 15 కథలతో 'కథ 90' సంకలనాన్ని రూపొందించి 1991 డిసెంబరు 28న శివారెడ్డి, చేకూరి రామారావు తో రోజూ కలిసి కూర్చునే ద్వారకా హోటల్‌లోనే ఆవిష్కరణ చేశాం. కేతు విశ్వనాథరెడ్డి, శీలా వీర్రాజు, హరి, చలసాని ప్రసాదరావు, కోడూరి కాశి(ప్రముఖ దర్శకుడు రాజమౌళి పెదనాన్న)తో సహా అనేకమంది సాహితీ ప్రముఖుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. 160 పేజీలు రూ.17 ధరతో ఇంత తక్కువ రేటా అని ఆశ్చర్యపోయి ఇది వచ్చే సంవత్సరం నాటికైనా వచ్చేనా అన్నారు. దాంతో పెరిగిన పట్టుదల 35 ఏళ్ల పాటుగా నడిపిస్తూ వస్తోంది. 1990లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'ఈ వారం కథ' శీర్షిక మొదలైంది. ప్రతి కథ ఒక అద్భుతంలా ఉండేది. ఇవి కాక ఇతర పత్రికల్లో వచ్చిన కథలన్నీ కలిపి సంకలనంలోకి రావాల్సిన మంచి కథలు దాదాపు 60 వరకు ఉన్నాయి. ఎంపిక మహా కష్టమైంది. ఏదీ వదలబుద్ధి కాలేదు. అలాంటి ఆ రోజులు మళ్లీ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుటున్నాను. వస్తాయని నమ్మకమూ ఉంది. 'కథ 91' కి వెంటనే ప్రయత్నాలు మొదలెట్టి ఆగస్టు నాటికి పూర్తిచేశాను. ఆగస్టు 28న అనంతరపురంలో మధురాంతకం రాజారాం ఆవిష్కరించారు. ఇలా ప్రతిచోట ఒక్కోచోట ఆవిష్కరించే సంప్రదాయం మొదలైంది. మూడు నాలుగేళ్లు మొదలయ్యే సరికి క్రమం తప్పకుండా సంకలనాలు తేగలమని సాహితీ ప్రియులందరికీ నమ్మకం కలిగింది. అలా ఇప్పుడు 35వ సంకలనం మృణాళిని చేతులు మీదగా ఆవిష్కరిస్తున్నాం. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఏబీ గురవాడరెడ్డి, కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, బండ్ల మాధవరావు, పాపినేని శివశంకర్ హాజరు కానున్నారు. ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు పుస్తక సమీక్ష చేయనున్నారు."

పార్కింగ్ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

భారీగా చిల్లులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ ఎదుటే తూర్పు ద్వారం వద్ద ప్రీమియం పార్కింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఇక్కడ గంటకు రూ.12 (జీఎస్టీతో కలిపి) వసూలు చేస్తున్నారు. 12 గంటలైతే రూ.144 తీసుకుంటున్నారు. మచిలీపట్నం, గుంటూరు, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి విజయవాడలో చిరు ఉద్యోగాలు చేసుకునేవారు రైళ్లలోనే వస్తారు. రైల్వేస్టేషన్ నుంచి పని ప్రదేశానికి వెళ్లడానికి వీరు ద్విచక్రవాహనాలను పార్కింగ్ ప్లేస్‌లో పెట్టుకుంటారు. వీరికి రోజుకు రూ.144 ఫీజు భారం పడుతోంది. ఏలూరు, గుంటూరు, మచిలీపట్నానికి జనరల్ బోగీల్లో వెళ్లాలంటే రూ.100లోపే చార్జీ అవుతుంది. పార్కింగ్‌కు మాత్రం రెట్టింపు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. సెలవు రోజుల్లో రెండు, మూడు రోజులు ఆఫీసులకు రాకపోతే రూ.400 నుంచి రూ.500 చెల్లించాలి. పార్కింగ్ ఫీజుల్లో నిలువు దోపిడీ చేస్తున్నారని చిరుద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగులే కాకుండా.. దూరప్రాంతాలకు ప్రయాణిస్తున్నవారు, ద్విచక్రవాహనాల్లో రైల్వేస్టేషన్‌కు చేరుకుంటున్నవారు, ఇతర పనుల మీద దూరప్రాంతాలకు వెళ్లేవారు కూడా ఈ ఇబ్బందులు పడుతున్నారు. మూడు, నాలుగు రోజు రైల్వేస్టేషన్‌లోని ప్రీమియం, నాన్ ప్రీమియం పార్కింగ్ ప్లేస్‌లలో తమ వాహనాలను పార్కింగ్ చేయటం ద్వారా రూ.1,000 వరకు ఫీజు చెల్లిస్తున్నారు. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఉండే ప్రీమియం పార్కింగ్‌లో అధిక ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రైల్వేస్టేషన్ సర్క్యులేటింగ్ ఏరియాలో మరో నాలుగు నాన్ ప్రీమియం పార్కింగ్ ప్లేస్‌లు ఉన్నాయి. రైల్వేస్టేషన్ వెస్ట్, నార్త్ సైడ్‌తో పాటు ఈస్ట్ సైడ్ ఎంట్రన్స్ రోడ్డు వెంబడి పార్శిల్ బ్లాక్ వైపు.. ఇలా పలు నాన్ ప్రీమియం పార్కింగ్ ప్లేస్‌లు ఉన్నాయి. ఇక్కడ మూడు గంటలకు రూ.12 వసూలు చేస్తున్నారు. మూడు గంటలయ్యాక మళ్లీ మూడు గంటలకు రూ.12 చెల్లించాలి. రైల్వేస్టేషన్‌కు రోజూ 3 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వీరిలో నిత్యం లక్షమందికి పైగా తమ వాహనాలను పార్కింగ్ ప్లేస్‌లలో ఉంచుతారు. దీనిని బట్టి చూస్తే ప్రయాణికుల నుంచి రూ.కోట్లలో పిండేస్తున్నారని అర్థమవుతుంది.

రైల్వే ఉద్యోగులూ బాధితులే..

రైల్వే ఉద్యోగులు కూడా పార్కింగ్ ప్లేస్‌ల బాధితులుగా మారిపోయారు. విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో 18 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరంతా విజయవాడ నుంచి డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలకు వెళ్లి పనులు చేస్తారు. ఎక్కువమంది ఉద్యోగులు రన్నింగ్‌లో ఉంటారు. వీరికి ప్రత్యేకంగా పార్కింగ్ ప్లేస్ అనేది లేదు. ఏ సంస్థ అయినా తమ ఉద్యోగులు వాహనాలు నిలుపుకోవడం కోసం పార్కింగ్ ప్లేస్ కల్పించాలి. డీఆర్ఎం కార్యాలయం చెంతనే ఉన్నా పార్కింగ్ ప్లేస్ లేదు. దీంతో రైల్వేస్టేషన్‌లోని పెయిడ్ పార్కింగ్ ప్లేస్‌లలో వాహనాలు పెట్టుకుంటున్నారు.

ఆర్అండ్‌బీ రోడ్లకు మార్గంసుగమం

(5వ పేజీ తరువాయి)

కొన్ని టెండర్లు పిలిచారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో తాజాగా రెండోదశ పనులకు టెండర్లు పిలిచారు. రెండు జిల్లాలో ఉన్న పలు రోడ్లు, భవనాలను పరిశీలించి నిర్మాణం లేదా మరమ్మతులకు ఈ రెండోదశ టెండర్లు పిలిచారు. ఆయా రోడ్లు, భవనాల నిర్మాణాలకయ్యే ఖర్చుల వివరాలను అంచనా వేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా సుమారు రూ.43 కోట్లతో ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఈ రోడ్ల నిర్మాణాలతో పాటు మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో దిశ వన్‌స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి రూ.44 లక్షలు కేటాయించినట్టు ఆర్ అండ్ బీ అధికారులు వెల్లడించారు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా పలు రోడ్ల మరమ్మతులు, నిర్మాణానికి రూ.11 కోట్లు కేటాయించినట్టు జిల్లా రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. విజయవాడ-విస్సన్నపేట రోడ్డు (రాష్ట్ర హైవే-32) అభివృద్ధి పనుల కోసం రూ.3 కోట్లు కేటాయించినట్టు జిల్లా ఆర్అండ్‌బీ అధికారులు వెల్లడించారు. మచిలీపట్నం-నూజివీడు, కల్లూరు (ఎంఎన్‌కే) రోడ్డు మరమ్మతుల కోసం రూ.2.91 కోట్లు, జగ్గయ్యపేట నుంచి షేర్‌మహ్మద్‌పేట వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.71 కోట్లతో టెండర్లు ఆహ్వానించారు. విజయవాడ-విస్సన్నపేట రోడ్డు (రాష్ట్ర హైవే-30) మరమ్మతులకు రూ.2.38 కోట్లు కేటాయించినట్టు అధికారులు వెల్లడించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	149,158, 169
చికెన్ విత్ స్కిన్	284
చికెన్ స్కిన్‌లెస్	294

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 670

లయోలా కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

భారతీనగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) సహకారంతో ఎన్‌టీఆర్ వికాసం ఆధ్వర్యంలో లయోలా కళాశాలలో శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎ.మోహన్‌బాబు మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 68 మంది అభ్యర్థులు హాజరుకాగా 42మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను నెలకు రూ.19వేల నుంచి రూ.21 వేల వేతనంతో పాటు ఉచిత ఆహారం, వసతి కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ మెల్చియోర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.సహాయభాస్కరన్, ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు, జిల్లా మేనేజర్, ఎంపికైన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయండి

కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు



భారతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని నాల్గో డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు తెలిపారు. ఎన్‌ఏసీ సమీపంలో జరుగుతున్న హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులను శనివారం డివిజన్ కార్పొరేటర్ సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి సాధ్యమైనంత త్వరగా ప్రజలకు అందుబాటులో తీసుకొస్తామని తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

జిమ్‌లో బిగిస్తున్న పరికరాలు



రాణిగారితోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాణిగారితోట 17వ డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్న జిమ్‌లో పరికరాలు బిగిస్తున్నారు. జిమ్ ఆలస్యం పై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు వెంటనే జిమ్ పరికాలు తెప్పించారు. వీటిని గత రెండురోజుల నుంచి బిగిస్తున్నారు. దాదాపు 15రకాల పరికరాలు ఇక్కడ ఏర్పాటు చేయనుండడంతో స్థానికంగా యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పరికరాలు పూర్తి స్థాయిలో అమర్చేందుకు దాదాపు 15రోజుల సమయం పట్టనుండడంతో దీనిని నెల రోజులలోపు ప్రారంభించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్‌లో

ఎస్ఆర్ఆర్ జట్టుకు ప్రథమ స్థానం

గుణదల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాతవాహన కళాశాలల ఆధ్వర్యంలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పురుషుల వాలీబాల్ టోర్నమెంట్లో ఎస్ఆర్ఆర్ కళాశాల జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుందని ప్రిన్సిపాల్ కే.భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ టోర్నమెంట్ ప్రారంభ దశ నుంచే తమ కళాశాల టీమ్ అద్భుతమైన ఆట ప్రదర్శించారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల వ్యాయామ విభాగాధిపతులు డాక్టర్ డి.యుగంధర్, డి.నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల మధ్యలో పొదలు: దోమలతో వెతలు



పటమట, ఆంధ్రజ్యోతి: 12వ డివిజన్ పండరీపురం మూడో రోడ్డు ప్రారంభంలో ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. స్థల యజమాని నిర్లక్ష్యం వల్ల ఆప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది. వర్షం పడినప్పుడు నీళ్లు నిలిచి ఆ ప్రాంతమంతా దోమలు చేరుతున్నాయి. జనం రోగాల బారిన పడక ముందే ఇళ్ల మధ్యలో ఉన్న పొదలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పూడికతో నిండిన డ్రెయినేజీ

దుర్వాసనతో నాగార్జుననగర్ కాలనీ వాసుల పాట్లు



భారతీనగర్, ఆంధ్రజ్యోతి: పూడికతో నిండిన సైడ్ డ్రెయినేజీతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జుననగర్ కాలనీ సర్వీస్ రోడ్డు వెంబడి ఉన్న డ్రెయినేజీ పూడికతో నిండిపోవడంతో మురుగునీరు ప్రవహించక నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం నేడు

గాంధీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వర్కింగ్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్టు అధ్యక్షుడు వక్కలగడ్డ భాస్కరరావు తెలిపారు. సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాంధీనగర్‌లోని హోటల్ కుబేర గ్రాండ్‌లో సమావేశం జరుగుతుందన్నారు. ఏపీ ఫెడరేషన్‌కు సొంత భవనం కొనుగోలు, కమిటీ సభ్యుల చేర్పులు, మార్పులు, ఫెడరేషన్ అభివృద్ధి, ఫెడరేషన్‌లో నూతన సభ్యులను ఆమోదించడం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. ఇప్పటి వరకు సంస్థ అభివృద్ధికి సహకరించిన సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని తమ సూచనలు, సలహాలు అందించాలని ఆయన కోరారు.

పీబీ సిద్ధార్థలో ముగిసిన సదస్సు

మొగల్రాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాల వృక్ష జంతు జీవ సాంకేతిక విభాగాలు, శ్రీ చైతన్య సరస్వత్ మఠ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న సదస్సు శనివారంతో ముగిసింది. ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎంవీ జగన్నాథం మాట్లాడుతూ సైన్స్ ప్రకృతిపై పెత్తనం చేస్తే ,వేదాంతం ప్రకృతిలో తాను భాగం అంటుందని తెలిపారు.శ్రీ చైతన్య సరస్వత్ మఠ్ అధ్యక్షుడు డాక్టర్ లీలా భక్తి నిష్కామ శాంత మహరాజ్ మాట్లాడుతూ జీవం పుట్టుక సైన్స్‌కు అందదని చెప్పారు. ఆచార్య బలరాంసింగ్ (అమెరికా నుంచి ఆన్‌లైన్ ద్వారా), వైద్యులు డాక్టర్ సందీప్ మిశ్రా, సర్జన్ డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, ఆచార్య బీబీ ప్రసాద్ మిశ్రా (కాన్పూర్ ఐఐటీ) తదితరులు వేదాంత శాస్త్ర విజ్ఞాన అంతరాలను మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, వైద్యులు, శాస్త్రవేత్తలు, ఆచార్యులు పాల్గొన్నారు.

చిన్న పైపులు.. కదలని మురుగు

- జనావాసాలకు అనుగుణంగా లేని పైపులు
- 9వ డివిజన్‌లో నెలకు నాలుగైదు సార్లు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి

(బెంజిసర్కిల్, ఆంధ్రజ్యోతి)

9వ డివిజన్‌లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రధాన సమస్యగా పరిణమించింది. ప్రస్తుతం సుమారు 40 వేలకు మంది 9వ డివిజన్‌లో నివాసం ఉంటున్నారు. జనసాంద్రతకు తగ్గ సౌకర్యాలు కొరవడడంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైపు లైన్ సరిపోవడం లేదు. దీంతో ప్రధాన లైన్‌లో సమస్య ఏర్పడితే ఆ నీరు వెనక్కి మళ్లి డివిజన్‌లోని పలు డ్రెయినేజీలు పొంగిపొర్లుతున్నాయి. నెలకు మూడు నాలుగు సార్లు ప్రధాన లైన్‌కు మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

పెద్ద పైపులైన్‌తో సమస్యకు చెక్



డివిజన్‌లో నీటి వినియోగం పెరిగింది. దీంతో డ్రెయినేజీలోకి వెళ్లే నీరు శాతం పెరిగింది. పైప్‌లైన్లు సుమారు 28 ఏళ్ల క్రితం వేసినవి. దీంతో డ్రెయినేజీ పైపులు చిన్నగా ఉండడంతో మురుగునీరు ముందుకు కదలడం లేదు. అదీ కాకుండా ప్రధాన రహదారిపై ఉన్న పైపులైన్ భారీ వాహనాల వల్ల పగిలిపోతున్నాయి. దీంతో సమస్య తీవ్రంగా ఎదుర్కోవాల్సి వస్తోంది. నెలకు మూడు సార్లైన మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. పెద్ద పైపులైన్ వేస్తే ఈ సమస్య నుంచి బయట పడగలం.

చెన్నుపాటి కాంతిశ్రీ,9వ డివిజన్ కార్పొరేటర్



రహదారికి మరమ్మతులు చేస్తున్న దృశ్యం(ఫైల్ ఫొటో)

పైపులైన్ మార్చాల్సి ఉంది

డివిజన్‌లో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ పైపు లైన్లు నేటి జనావాసాలకు అనుగుణంగా మార్చాలని పలువురు కోరుతున్నారు. పైపులైన్‌లు చిన్నవిగా ఉండడంతో నీరు కదలడం లేదని డివిజన్ వాసులు చెబుతున్నారు. డ్రెయినేజీ సమస్య వల్ల దోమల బెడద పెరుగుతోందని, దీంతో అనారోగ్య బారిన పడుతున్నామని చెబుతున్నారు.

భారీ వాహనాలతోనే సమస్య

ప్రధాన లైన్ కృష్ణవేణి రోడ్డు నుంచి రామలింగేశ్వర నగర్‌లోని డ్రెయినేజీ ప్లాంట్‌కు తరలిపోతుంది. ఈ రహదారి నుంచి బస్సులు నడపడంతో ప్రధాన లైన్ పైపులు పగిలి లీకేజీలు ఏర్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇలా లీకేజీలైన ప్రతిసారి డ్రెయినేజీ నీరు కదలకపోవడంతో డివిజన్‌లోని యూజీడీ నీరు వెనక్కి మళ్లుతున్నాయని అంటున్నారు. రామలింగేశ్వర నగర్ వైపు నుంచి వచ్చే బస్సులను, భారీ వాహనాలను నిలుపుదల చేస్తే యూజీడీ సమస్య తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇల్లు : ఎమ్మెల్యే గద్దె

పటమట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కా గృహం అందించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. తూర్పు పరిధిలోని ప్రజలు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలను అందించారు. 3.వ డివిజన్‌కు చెందిన బొడ్డు వెంకట లక్ష్మికి ఆయన సొంత నిధులతో తోపుడు బండిని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు జీవించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అందించారన్నారు. ఇక నుంచి ప్రజాదర్బార్ శుక్రవారం ఉంటుందన్నారు. ఎంత మంది దరఖాస్తులు చేసుకుంది, ఎంత స్థలం ఇవ్వాలనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కార్పొరేటర్లు, పలు డివిజన్ పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.





అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ వేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎండీ పి.పుల్లారెడ్డి, విద్యుత్ శాఖ అధికారులు

మార్గదర్శకుడు అంబేడ్కర్

ముస్లిం మైనార్టీ హక్కుల సమితి కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మొగల్రాజపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురంలో ఉన్న ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు,రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహ్మద్ ఫరూక్ షుబ్లీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని శనివారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షుబ్లీ మాట్లాడుతూ న్యాయం సమానత్వం కోరుకునే ప్రతి ఒక్కరికి అంబేడ్కర్ మార్గదర్శకుడని చెప్పారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ మాట్లాడుతూ అంబేడ్కర్ కలలు కన్న రాజ్యాన్ని సీఎం చంద్రబాబు ప్రజలకు అందిస్తున్నారని చెప్పారు. సమతా సైనిక్‌దళ్ నాయకులు పిల్లి సురేంద్ర బాబు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, దళిత మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. **లబ్బీపేట:** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురునానక్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాల యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీప్రసాద్, సుదర్శనం, జాన్ పాల్గొన్నారు.● ఇండియన్ అంబేడ్కర్ సొసైటీ ఆధ్వర్యంలో కళాక్షేత్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ స్మృతి వనంలో జనహిత వేదిక ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



టీడీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంలో ..

భారతీనగర్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని గత విద్యుత్ నిలయం ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి వేడుకల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎండీ పి.పుల్లారెడ్డి పాల్గొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టరు మురళీ కృష్ణ యాదవ్, ప్రాజెక్టు డైరెక్టరు టీవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

విజయవాడ: ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్‌లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శాంతి శివరాం ప్రసాద్ గౌడ్, గౌడ కులహక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోల్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో కొనసాగుతున్న షెడ్డు నిర్మాణ పనులు



లబ్బీపేట, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయంలో భక్తుల సౌకర్యం కోసం షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ ఆలయంలో కూడా వారంలో నాలుగైదు రోజులు భక్తుల సహకారంతో 100మందికి పైగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే భక్తులకు ఎండ, వాన నుంచి ఇబ్బందులు ఎదురవుతుండడంతో ఆలయానికి కుడివైపు షెడ్డు నిర్మించాలని నిర్ణయించిన టీటీడీ అధికారులు ఆ దిశగా చర్యలు ప్రారంభించి షెడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఆలయం ఎడమవైపు కూడా షెడ్డు నిర్మాణానికి భక్తులు ముందుకు రావడంతో ఈ నిర్మాణానికి కూడా అధికారులు సిద్ధమయ్యారు. ప్రస్తుత షెడ్డుతో పాటు, ఆలయం ఎడమవైపు షెడ్డు పూర్తయితే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

నిత్యాన్నదానానికి భక్తులు ముందుకు రావాలి

శ్రీవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు సహకారం ఎంతో ముఖ్యమని టీటీడీ అధికారులు అంటున్నారు. శ్రీవారి ఆలయాల్లో త్వరలో ప్రారంభించే ఈ కార్యక్రమం ద్వారా భక్తులకు అన్నప్రసాదం నిత్యం లభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించాలనుకునే భక్తులు వారు బయట నుంచి అన్నప్రసాదాన్ని తెచ్చినా ఆలయం ఆవరణలో భక్తులకు వితరణ చేయవచ్చని లేని పక్షంలో 100మందికి రూ.6500 చెల్లిస్తే ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు సహకరించాలని టీటీడీ అధికారులు కోరుతున్నారు.

42 మందికి అన్యాయం జరిగింది

- కోర్టు తీర్పును వ్యతిరేకించలేం ● సొసైటీపై పూర్తి విచారణ చేపడతాం
- ఎమ్మెల్యే సుజనా చౌదరి

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురంలో ప్లాట్లను కొనుగోలు చేసిన 42 మందికి అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. భవానీపురంలోని ఎన్డీఏ కార్యాలయంలో శనివారం ఆయన కూటమి నాయకులు, బాధితులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 42 మంది ప్లాట్ల తొలగింపు విషయం ముందే తన దృష్టికి వచ్చిందని, ఈ వ్యవహారం సివిల్ వివాదం కావటంతో కోర్టుకు వెళ్లమని చెప్పినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాల తోనే 42 మంది ప్లాట్ల నివాసాలను తొలగించారు. వారికి ఏవిధంగా న్యాయం చేయాలనేది చూస్తున్నామన్నారు. కోర్టు ఆదేశాలను కాదని ఎవరూ ఏమి చేయలేని పరిస్థితి అని తెలిపారు. సొసైటీ ప్రతినిధులు కూడా ముందుకు వస్తే 42 మంది ప్లాట్ల యజమానులతో కలిసి చర్చిస్తామని చెప్పారు. ఇరువర్గాలతో కమిటీని కూడా ఏర్పాటు చేసి వివాదం పరిష్కారం కోసం పనిచేయనున్నట్లు తెలిపారు. సొసైటీకి సంబంధించి ఆడిట్ వివరాలు కూడా సేకరించాలని, వచ్చే శుక్రవారంలోపు సొసైటీకి సంబంధించిన రికార్డులను ఇవ్వాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ మాధురి లావణ్య, బాధితులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ప్లాట్ల యజమానులు

విద్యాధరపురంలోని వివాదంలో ఉన్న 42మంది ప్లాట్ల యజమానులు తమ న్యాయవాదులతో కలిసి శనివారం కానూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుజనా చౌదరిని కలిశారు. ఈ సందర్భంగా ప్లాట్ల యజమానులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే వారి తరపున లాయర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందిం చిన ఎమ్మెల్యే తనవంతు సహాయ సహకారాలను అందిస్తానని వారికి హామీ ఇచ్చారు.


హార్లమెంటల్ బనానా



ఫల పుష్ప శోభితం

● ఆకట్టుకుంటున్న రోజ్ సొసైటీ ఫల పుష్ప ప్రదర్శన ● అందుబాటులో దేశ, విదేశాల మొక్కలు ● విభిన్న మొక్కలకు ఒకటే వేదిక

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: సువాసనలు వెదజల్లే తెల్ల సంపంగి, ఇంటికి అందం తీసుకొచ్చే సీతమ్మ వారి జడ, బోన్సాయ్, లిప్‌స్టిక్ మొక్కలు, ఆరోగ్యాన్నిచ్చే ఆర్గానిక్ మొక్కలు, ఆకట్టుకునే స్టోన్ ఆర్ట్ వీటన్నింటికీ సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ మైదానం వేదికైంది. నగరంలోని పాలిక్లినిక్ రోడ్డులో ఉండే ఈ మైదానంలో రోజ్ సొసైటీ ఆఫ్ ఏపీ ఏర్పాటు చేసిన పుష్ప, ఫల, గృహ అలంకరణ మొక్కల ప్రదర్శన ప్రజలను అమితంగా ఆకర్షిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ పచ్చదనం, సుందరీకరణ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన కొనసాగుతోంది. థాయ్‌ల్యాండ్, డార్జిలింగ్, కడియం, కాకినాడ, తమిళనాడు, కేరళ, పూణె, బెంగుళూరు, భీమవరం, విజయవాడ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన నర్సరీల మొక్కలు ఇక్కడ అందుటుబాటులో ఉంచారు. 46 స్టాల్స్‌లో పూలమొక్కలు, 20 స్టాల్స్‌లో ఆర్గానిక్ ఆకుకూరల, కూరగాయల మొక్కల ఏర్పాటు జరిగింది. రుద్రాక్ష, సీతమ్మవారి జడ, టికీకూహిల్, మంకీస్ టెయిల్, హార్లమెంటల్ బనానా, సన్‌సెట్ క్రీపర్, గోల్డ్ చైన్, స్పోటోడియమ్, తెల్ల సంపంగి, మండవెల్లి, లిప్‌స్టిక్, కాలా లిల్లీ, కుర్‌కుమ, కొల్లస్‌మన్, పైరకాంతార, కాక్టస్, సక్యులెన్స్, ఓల్డ్‌మెన్, గుంటూరు ఆర్గానిక్ కారపొడులు, కందులు, మినుము, తోటకూర, ఉలవలు, మొంతుల మైక్రో మొక్కలు, లిషియంతాస్, ఏసియాటిక్ లిల్లీ, బ్రొమిలియార్డ్, లెమన్, లైట్ వంగ, కర్పూరం, దాలియాస్, అన్నపూర్ణ మొక్క, పాండావతు, లెమన్‌షైన్, మిర్చీ, బోన్సాయ్, మందారం, గులాబీ, మల్లె, సన్నజాజి తదితర వందల రకాల మొక్కలు అందుబాటులో ఉంచారు. జైపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఏర్పాటు చేసిన స్టోన్ ఆర్ట్ స్టాల్ ఈ ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రపంచంలో లభించే అన్ని రకాల రాళ్లతో తయారు చేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంది. ఈ నెల 8వరకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకురాలు పద్మప్రియ తెలిపారు. వన్ లైఫ్, వన్ ఎర్త్ పేరుతో ప్రత్యేకంగా ప్రదర్శన స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భూమి ఆరోగ్య కాపాడటంలో మొక్కల పాత్ర అనే అంశాలపై రోజూ ఒక్కో థీమ్‌తో పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహిస్తామన్నారు.


బ్రొమిలియార్డ్


సీతమ్మవారి జడ


రుద్రాక్ష


తెల్ల సంపంగి



సందర్శకులతో కళకళలాడుతున్న రోజ్ సొసైటీ ఫల, పుష్ప ప్రదర్శన


కొల్లస్‌మన్


కొండ రాళ్లతో తయారు చేసిన కుండీలు




టికీకూహిల్

గన్నవరం సీహెచ్‌సీ అభివృద్ధికి నిధులు

ఫలించిన ఎమ్మెల్యే యార్లగడ్డ కృషి ● సీఎస్‌ఆర్ సంస్థ నిధులు మంజూరు

విజయవాడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపయోగపడే గన్నవరం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ అభివృద్ధికి వివిధ సంస్థల నుంచి నిధులు సమీకరించడంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ కృషి ఫలించింది. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ఈ వైద్యశాలకు నిధులు తెచ్చి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే భావించారు. దీంతో పదవి చేపట్టిన వెంటనే వైద్యశాల అభివృద్ధికి నిధుల కోసం వైద్యారోగ్య శాఖను సంప్రదించగా నిధుల కొరత ఉందని, ప్రతిపాదనలు అందజేస్తే ప్రాధాన్యత క్రమంలో నిధులు మంజూరు చేస్తామని తెలిపింది. ఈ ప్రక్రియతో హెల్త్‌సెంటర్ అభివృద్ధి జాప్యం అవుతుందని భావించిన యార్లగడ్డ కార్పొరేట్ సంస్థలతో సంప్రదింపులు జరిపి సీఎస్‌ఆర్ నిధులు తెచ్చే ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు అవి ఓ కొలిక్కి వచ్చాయి. ఈ మేరకు కోల్ ఇండియా సంస్థ చైర్మన్ పోలవరపు ప్రసాద్‌ను కలిసి సీఎస్‌ఆర్ ఫండ్స్ నుంచి వైద్యశాల అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. యార్లగడ్డ విజ్ఞప్తి మేరకు స్పందించిన ప్రసాద్ పదవీ విరమణకు రెండురోజుల ముందు రూ.2.25 కోట్ల నిధులను గన్నవరం సామాజిక వైద్యశాల అభివృద్ధికి కోల్ ఇండియా సీఎస్‌ఆర్ నిధులు మంజూరు చేశారు. వైద్య చికిత్సలకు అవసరమైన అధునాతన వైద్య పరికరాల ఏర్పాటుకు ఈ రూ.2.25 కోట్ల నిధులు వెచ్చించి త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించనున్నారు. నిధులు మంజూరు చేసిన చైర్మన్ పోలవరపు ప్రసాద్ సేవలు మరువలేమని యార్లగడ్డ అన్నారు. ఇదిలా ఉండగా గన్నవరంలోని హెచ్‌సీఎల్ సంస్థ సీఎస్‌ఆర్ నిధులను గత ప్రభుత్వ హయాంలో మచిలీపట్నం గుడివాడ నియోజకవర్గానికి కేటాయించగా ఎమ్మెల్యే పదవి చేపట్టిన వెంటనే వెంకట్రావు హెచ్‌సీఎల్ సంస్థ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు స్పందించిన హెచ్‌సీఎల్ సంస్థ రూ.17.25 లక్షల ని ధులను మంజూరుచేసి అభివృద్ధికి సహకరించింది. ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురై న ఆసుపత్రికి ఎమ్మెల్యే చొరవతో అధునాతన వసతులు సమకూరుతున్నాయి.

ఆటపాటల్లో నైపుణ్యం పెంచుకోవాలి

- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ
- కృష్ణాతరంగ్ చాంపియన్‌గా పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు
- రన్నర్స్‌గా నలంద కళాశాల జట్టు
- 3 రోజుల పాటు కృష్ణాతరంగ్ విద్యార్థుల కళా ప్రతిభకు దర్పణం
- వైభవంగా ముగింపు ఉత్సవాలు





బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరా, వీసీ రాంజీ, విజేతగా నిలిచి పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, కళాత్మక ప్రదర్శనలపై శిక్షణ ఇవ్వడం ముదావహమని ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు అన్నారు. కృష్ణా వర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన కృష్ణాతరంగ్ ఉత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. వందలాది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లోని విద్యార్థులు పెద్ద ఎత్తున రుద్రవరంలోని కృష్ణా వర్సిటీకి తరలివచ్చారు. ఒకరిపై ఒకరు పోటీ పడుతూ ఆద్యంతం ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను విజయవాడ వీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. రన్నర్స్‌గా విజయవాడ నలంద కళాశాల విద్యార్థులు గెలుచుకున్నారు. నాలుగు విభాగాలకు చెందిన 28 కేటగిరిల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఉపకులపతి కూన రాంజీ, బీజేపీ అధికార ప్రతినిధి సాధినేని యామినిశర్మ బహుమతులు అందచేశారు. షీల్డు, ప్రశంసాపత్రాలను అందుకున్న విద్యార్థుల కేరింతలు మారుమోగాయి. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు నేర్చుకున్న కళలను వదిలిపెట్టకుండా కొనసాగించాలన్నారు. ఉపకులపతి కూన రాంజీ మాట్లాడుతూ సీనియర్ కళాకారులకు దీటుగా విద్యార్థులు శాస్త్రీయ, వెస్టర్న్ సంగీతాన్ని గానం చేశారన్నారు. శాస్త్రీయ నృత్యంతో పాటు గిరిజన నృత్యం, పాశ్చాత్య నృత్యాలను ప్రదర్శించి తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ ఉష, రెక్టార్ బసవేశ్వరరావు, కృష్ణాతరంగ్ ఇన్‌చార్జి దిలీప్ పాల్గొన్నారు. విద్యార్థులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు చూపిన శ్రద్ధపై కళాశాలల యాజమాన్యాలు అభినందించారు.


ఎత్తిపోతల పథకంపై నుంచి కృష్ణానదిని పరిశీలిస్తున్న ఐడీసీ ఎండీ ఎస్ తిరుమలరావు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

ఎత్తిపోతల పథకాల పరిశీలన

● ఐడీసీ ఎండీతో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే సౌమ్య

చందర్లపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలను ఐడీసీ ఎండీ ఎస్ తిరుమలరావు, పులిచింతల ఎస్‌ఈ మెహిద్దీన్‌తో కలిసి ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు పరిశీలించారు. పులిచింతల డ్యామ్ నీటిని నిలిపివేయడంతో ఎత్తిపోతల పథకాలకు నీరందడం లేదని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు శనివారం ఈ పర్యటన నిర్వహించారు. మండలంలోని కొడవటికల్లు, పొక్కునూరు, కాసరబాద, ఉస్తేపల్లి ఎత్తిపోతల పథకాల వద్ద కృష్ణానదీ ప్రవాహాన్ని పరిశీలించారు. నదీ ప్రవాహం గుంటూరు జిల్లా వైపు ఉండడం వల్ల ఇక్కడి పథకాలకు నీరందడం లేదని సౌమ్య అధికారులకు తెలిపారు. తక్షణమే పులిచింతల నుంచి 3వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయాలని కోరారు. శాశ్వత పరిష్కారంగా ఎన్టీఆర్ జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు ప్రత్యేకంగా కాలువ ఏర్పాటు చేసి నిరంతరం నీటిని అందించాలని కోరారు. దీనిపై స్పందించిన ఐడీసీ ఎండీ తిరుమలరావు మాట్లాడుతూ నీటి విడుదలకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సౌమ్య చెప్పినట్టు శాశ్వత పరిష్కారంపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ పర్యటన సందర్భంగా వందలాది మంది రైతులు అధికారులను కలిసి తమ గోడును వివరించారు. ఐడీసీ ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, ఈఈ చిన్నయ్యరెడ్డి, ఐడీసీ డైరెక్టర్ అంకం ఇందిరా ప్రియదర్శిని, టీడీపీ మండలాధ్యక్షుడు మేకల సుధాకర్‌బాబు, కోనాయపాలెం సొసైటీ అధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, వాసిరెడ్డి సాంబశివరావు, బీ రామకృష్ణ పాల్గొన్నారు.

హోం గార్డుల సేవలు ప్రశంసనీయం

● సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రత పరిరక్షణలో హోం గార్డులు అందిస్తున్న సేవలను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు కొనియాడారు. హోంగార్డ్స్ 63వ వ్యవస్థాపక దినోత్సవం నగరంలోని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీ రాజశేఖరబాబు ముఖ్య అతిథి హాజరై ప్రసంగించారు. ఎన్టీఆర్ జిల్లాలో ప్రస్తుతం వెయ్యి మంది హోం గార్డులు విధుల్లో కొనసాగుతూ., శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, క్రైం నియంత్రణ, సీఐడీ, టాస్క్‌ఫోర్స్, పోలీస్ అంతర్గత భద్రత, పోలీస్ వాహనాల డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల వద్ద భద్రత విధుల్లో, సీసీ కెమెరాల టెక్నీషియన్లుగా సేవలు అందిస్తున్నారని వివరించారు. కోవిడ్-19, అగ్నిప్రమాదాలు, వరదలు, విపత్కర పరిస్థితులు తలెత్తినపుడు హోంగార్డులు అందించే సేవలు మరువలేనివన్నారు. తొలుత గ్రౌండ్‌లో హోం గార్డ్స్ నిర్వహించిన పేరెడ్‌ను సీపీ పరిశీలించి, వారి నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీపీ రాజశేఖరబాబును హోంగార్డ్స్ తరుపున కమాండెంట్ టి.ఆనందబాబు, ఆర్ఐ సుధాకరరెడ్డి దుశ్శాలువాలతో సత్కరించి కొండపల్లి బొమ్మను అందజేశారు.

టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కన్నుమూత



పార్థివదేహం పిన్నమనేని వైద్య కళాశాలకు అప్పగింత ● ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సహా ప్రముఖుల నివాళి

గన్నవరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపాలెంకు చెందిన టీడీపీ సీనియర్ నేత కంభంపాటి కోటేశ్వరరావు(74) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యాపార రీత్యా 30 ఏళ్ల క్రితం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. టీడీపీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో క్రియాశీలకంగా పనిచేశారు. అప్పటి టీడీపీ ఎమ్మెల్యేల అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. వసంత నాగేశ్వరరావు, దేవినేని నెహ్రూ, దేవినేని రమణ లాంటి నాటి ప్రముఖులతో సత్సంబంధాలు ఉండేవి. విశాఖపట్నం వెళ్లిన తరువాత కూడా టీడీపీ కోసం పని చేశారు. కోటేశ్వరరావు భౌతికకాయానికి బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్యేలు ముసునూరు రత్నబోస్, డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు యార్లగడ్డ సతీష్, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, విజయ విజయడెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కిసాన్ మోర్చా, రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, టీడీపీ మండలాధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్, టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఇన్‌చార్జి సర్పంచ్ పాలడుగు నాని, జాస్తి వెంకటేశ్వరరావు, ఆళ్ల గోపాలకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, మూల్పూరి వెంకటరత్నం, వేగిరెడ్డి పాపారావు, సుంకర కృష్ణమోహన్, గూడపాటి పద్మ శేఖర్, కంభంపాటి హేమంత్ కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటేశ్వరరావు పార్థివదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు అప్పగించారు.


కోటేశ్వరరావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



నేటి విజయ వీచిక.. భవిష్యత్తుకు కరదీపిక

● సవాళ్లను అధిగమిస్తూ దసరా ఉత్సవాలను నిర్వహించాం
● కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు

కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల నిర్వహణలో ఎదురైన సవాళ్లు, వాటిని ఎదుర్కొంటూ విజయ తీరాలకు చేరిన తీరు, సూచనల సమాహారంతో విజయ వీచిక పేరుతో డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, జేసీ ఇలక్కియా, దుర్గగుడి ఈవో వీకే శీనానాయక్‌తో కలిసి శనివారం కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి వీసీ హాల్‌లో విజయ వీచిక.. అభ్యాస దీపిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ శాఖల మధ్య పటిష్ఠ సమన్వయం, 36 ప్రత్యేక సెక్టార్లు, సాంకేతికతతో అనుసంధానం గౌరవ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా దసరా ఉత్సవాలను విజయవంతం చేసి సీఎం ప్రశంసలు అందుకున్నామన్నారు. ఈ అనుభవం భవిష్యత్తు ఉత్సవాలకు రిఫరెన్సుగా ఉండాలనే ఉద్దేశంతోనే సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో విజయ వీచిక పేరుతో పుస్తకాన్ని వెలువరించినట్టు వివరించారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ విజయ వీచిక పుస్తకం భవిష్యత్తులో జరిగే ఉత్సవాలకు భద్రతతో పాటు ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగపడుతుందన్నారు.దుర్గగుడి ఈవో శీనానాయక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారం, అధికారుల భాగస్వామ్యంతో అంతా కలిసి ఉత్సవాలను విజయవంతం చేశామన్నారు. డీఐపీఆర్‌వో కేవీ రమణారావు, డివిజనల్ పీఆర్‌వో కే రవి, ఏపీ సూపర్‌వైజర్ వీవీ ప్రసాద్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు డీసీ డాక్టర్ జే సుమన్, కలిమిశ్రీ గ్రాఫిక్స్ అధినేత కలిమిశ్రీ పాల్గొన్నారు.

రబీకి ఎరువులు సిద్ధం

సన్నద్ధతా చర్యల్లో భాగంగా రబీ సీజన్‌కు వివిధ రకాల ఎరువులను సిద్ధంగా ఉంచుతున్నామని, అవసరానికనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియాతో కలిసి జిల్లాలో రబీకి ఎరువుల అవసరం, లభ్యత, ధాన్యం కొనుగోళ్లపై మీడియాతో మాట్లాడారు. రబీలో 33,765 హెక్టార్లలో వివిధ పంటల సాగు చేపట్టడం జరుగుతుందన్న అంచనాలకు అనుగుణంగా ఎరువుల సరఫరా ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. డిసెంబరు నెలకు 17,812 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా 27,542 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో 7,815 మెట్రిక్ టన్నుల యూరియా, 1,983 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,720 మెట్రిక్ టన్నుల పొటాష్, 13,659 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సులు, 2,365 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ అందుబాటులో ఉన్నాయన్నారు.

స్ఫూర్తిప్రదాత డాక్టర్ అంబేడ్కర్



స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ రాష్ట్ర, దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ రూపకల్పనకు విశేష కృషిచేసిన బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల బాటలో యువత నడుస్తూ ఆదర్శవంతంగా నిలవాలని సూచించారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం రమాదేవి, ఏఎస్‌డబ్ల్యూ గణేష్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి నిధులివ్వండి

● మంత్రికి ఎమ్మెల్యే తాతయ్య వినతి



పేటలో మంత్రి ఆనంకు వినతిపత్రం ఇస్తున్న తాతయ్య, నందిగామలో ఇనాం బాధిత రైతులు

జగ్గయ్యపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, తిరుమలగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి, ముక్త్యాలలో శ్రీ కోటిలింగ హరిహర క్షేత్రం, వేదాద్రి శ్రీ యోగానంద స్వామి దేవస్థానాల అభివృద్ధికి టెంపుల్ టూరిజం, ప్రసాదం పథకాల కింద నిధులు మంజూరు చేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కలిసి విజ్ఞాపన పత్రం ఇచ్చారు. నియోజకవర్గంలో 19 ధూపదీప నైవేద్యాల కోసం అనుమతివ్వాలని కోరారు. వేదాద్రి దేవస్థానానికి ఘాట్ రోడ్డు నిర్మాణ శంకుస్థాపనకు హాజరు కావాలని మంత్రిని కోరారు. అంతేకాక నియోజకవర్గంలో ఈనామ్ భూముల సమస్యను పరిష్కరించాలని మంత్రిని ఆయన ప్రత్యేకంగా కోరారు. వేదాద్రి దేవస్తానం ఈవో కానూరి సురేష్‌బాబు, దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తల తరపున రాంప్రసాద్ ఉన్నారు.

ఇనాం భూములు సమస్య పరిష్కరించండి

నందిగామ: ఇనాం భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ బాధిత రైతులు మంత్రి ఆనం రాంనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. శనివారం టీడీపీ సీనియర్ నేత తొండెపు జనార్ధన్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరారు. విధానపరమైన నిర్ణయం తీసుకొని తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరారు. స్పందించిన మంత్రి ఆనం త్వరలో సీఎంను కలిసి వివరిస్తానని హామీ ఇచ్చారు. ఈనామ్ బాధిత రైతు సంఘం నేతలు ప్రసాద్, అచ్యుతరామయ్య, రాటకొండ రామకోటేశ్వరరావు, సుధీర్, నరసింహారావు, రాంబాబు, చంద్రశేఖర్, కరుణాకరరెడ్డి, రామసుబ్బారావు, వెంకట్రావు, సూర్యనారాయణ, శ్రీను, శివాజీ, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై కారు దగ్ధం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వీరవల్లి బైపాస్ వద్ద కారులో మంటలు చెలరేగి దగ్ధమైన ఘటన శనివారం ఉదయం జరిగింది. వీరవల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం నుంచి విజయవాడ వెళుతున్న కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అందులో ప్రయాణిస్తున్నవారు అప్రమత్తమై రోడ్డు పక్కన నిలిపి బయటకు పరుగులు తీశారు. విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బయలుదేరిన జంగారెడ్డిగూడెం మండలం తాడ్వాయికు చెందిన ఇద్దరు మహిళల సహా ఏడుగురు వీరవల్లి బైపాస్‌పై కారు ఆగిపోవడంతో పాటు పొగ రావడంతో భయంతో దిగిపోయి రోడ్డు పక్కకు వెళ్లిపోయినట్టు తెలిపారు. స్థానికుల సమాచారంతో హనుమాన్‌జంక్షన్ ఫైర్ ఆఫీసర్ అమరేశ్వరరావు సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అప్పటికే కారు మొత్తం దగ్ధమైపోయింది. వీరవల్లి ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి బాధితులను వేరే వాహనంలో తరలించారు. కారులో పొగలు రావడంతో ప్రయాణికుల అప్రమత్తతే వారిని కాపాడిందన్నారు.



భార్గవి కూనం... సెలబ్రిటీ డిజైనర్. ఫ్యాషన్ రంగంలో భార్గవి లేబుల్‌కు ఒక ప్రత్యేకత ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి భార్య గీత నుంచి మెగా కృష్ణారెడ్డి భార్య సుధ దాకా... నయనతార నుంచి శ్రీలీల దాకా అందరూ భార్గవి దగ్గర దుస్తులు డిజైన్ చేయించుకొనే వారే! భార్గవిని 'నవ్య' పలకరించినప్పుడు తన అనుభవాలను పంచుకున్నారు.

అతిథి

ప్రతి చేనేత వెనక ఒక కథ ఉంటుంది







చాలామంది సెలబ్రిటీలతో పనిచేయటం కష్టం కదా... అని అడుగుతూ ఉంటారు. కానీ నా ఉద్దేశంలో అంత కష్టం కాదు. గీత గారికి (రేవంత్‌రెడ్డి భార్య), సుధ గారికి (మెగా కృష్ణరెడ్డి భార్య), సమంత.. నయనతార.. రకుల్.. శ్రీలీల.. ఇలా చాలామంది సెలబ్రిటీలకు ఏం కావాలో నాకు తెలుసు. వారితో చాలా కాలంగా కలిసి పని చేస్తున్నాను కాబట్టి వారి ఇష్టాలు నాకు తెలుసు. వాళ్లకు ఏం కావాలో తెలిసినప్పుడు డిజైనింగ్ సులభమవుతుంది కదా! ఇతర కస్టమర్లకు మూడు ప్రత్యామ్నాయాలు చూపిస్తే- వీరికి పది చూపిస్తాను. అయితే కొన్నిసార్లు ఒత్తిడి ఉంటుంది. ఫ్రస్ట్రేషన్ కూడా వస్తుంది. కానీ వాటిని నేను పట్టించుకోను. ఎందుకంటే వాటన్నిటినీ దాటితేనే వృత్తిపరంగా మనం ఎదగగలుగుతాం.

"మాది ఆళ్లగడ్డ. మధ్యతరగతి కుటుంబం. డాక్టర్ల కుటుంబం. మా నాన్నగారు డాక్టర్. మా అన్నయ్య డాక్టర్. నేను ఇంటర్ పూర్తి చేసిన తర్వాత నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేయాలనుకున్నా. కానీ ఆ రోజుల్లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును చిన్నచూపు చూసేవారు. నేను నిఫ్ట్‌లో చేరటానికి నాన్నగారు ఒప్పుకోలేదు. నేను క్రియేటివ్ కోర్సు చేయాలనుకున్నా. ఆర్కిటెక్చర్‌కు వెళ్తానని పట్టుపట్టా. నాన్నగారు ఒప్పుకున్నారు. ఆర్కిటెక్చర్ చదివాను కానీ నా దృష్టి.. శ్రద్ధ అంతా బట్టలపైనే ఉండేది. ఎందుకో నాకు తెలియదు.. ఒక మంచి చీరనో.. డ్రస్సునో చూసినప్పుడు.. దానిని ఎంపిక చేసుకున్నప్పుడు ఇతరులలో వచ్చే చిరునవ్వును చూడటం నాకు చాలా ఇష్టం.

ఒక కంపెనీలో ఆరు నెలలు పనిచేసి బయటకు వచ్చేసి సొంతంగా ఒక లేబుల్ పెట్టుకున్నా. నేను నా సొంత డిజైనింగ్ కంపెనీని ప్రారంభించినప్పుడు నా దగ్గర ముగ్గురు పని చేసేవారు. 18 ఏళ్ల తర్వాత 200 మంది నా దగ్గర పనిచేస్తున్నారు. ఈ 18 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో అనుభవాలు. వాటి నుంచి నేర్చుకున్న ఎన్నో పాఠాలు. వాటిని వెనక్కి తిరిగి చూసుకుంటే- ఆనందంగా అనిపిస్తుంది. సంతృప్తిగా అనిపిస్తుంది.

ఎవరూ తెలియని దశ నుంచి...

నేను హైదరాబాద్‌కు తొలిసారి వచ్చినప్పుడు- నాకు వృత్తి కొత్త. నాకు ఇక్కడ ఎవరూ తెలియదు. ఇప్పుడు ఇక్కడ అందరూ తెలుసు. ఎవరైనా నన్ను మీ 18 ఏళ్ల గురించి చెప్పండి అని అడిగితే- "అప్పుడు ఎవరూ తెలియదు.. ఇప్పుడు అందరూ తెలుసు" అని చెబుతాను. ప్రారంభించినప్పుడు ఇద్దరు ఎంబ్రాయిడరీ పని వాళ్లు ఉండేవారు. ఒక టైలర్ ఉండేవారు. నేను తొలిసారి లంగా.. ఓణీ డిజైన్ చేసి ఒక క్లయింట్‌కు ఇవ్వటం నాకు ఇంకా గుర్తుంది. నేను ప్రారంభించిన రోజుల్లో బొటిక్‌లు ఉండేవి. వాటిలో కొన్ని డిజైనర్ వేర్ ఉండేది. అక్కడకు వెళ్లి మనకు నచ్చింది కొనుక్కోవాల్సి వచ్చేది. మనకు నచ్చింది కొనుక్కోవటం కాకుండా మనకు ఏది నప్పితే అది కుట్టించుకుంటే బావుంటుందని నేను భావించాను. అలా నా కస్టమర్లకు వాళ్లకు ఏది నప్పుతుందో సూచించేదాన్ని.

> దక్షిణ భారత మహిళలు చాలా బావుంటారు. వాళ్లు వేసుకొనే ఓణీలు, చీరలు వాళ్లను భిన్నంగా మారుస్తాయి. ఒక పెళ్లికి వెళ్లే ప్రతి అమ్మాయి, ప్రతి మహిళా చాలా అందంగా కనిపిస్తుంది. తెలుగు, కన్నడ, తమిళులు అని వేర్వేరుగా అనిపించవచ్చు. కానీ అందరూ చాలా అందంగా ఉంటారు. తమిళులు చాలా సంప్రదాయబద్ధంగా ఉంటారు. తెలుగు వారు కొత్త కొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తుంటారు.

> మనం ఎంత ఆధునికంగా ఉన్నా పెళ్లిళ్లకు, పండగలకు సంప్రదాయబద్ధంగా బట్టలు ధరించాల్సిందే! వీటిలో నాకు అనుభవం ఉంది. నేను రకరకాల చేనేతలను కలిపి కుడతాను. కాంచీవరం లెహంగాకు.. కలంకారి దుపట్టా వేసి.. దానిపై ఎంబ్రాయిడరీ బ్లౌజ్ వేస్తాను. ఇలా రకరకాల చేనేతలను కలపటంవల్ల మొత్తం డ్రస్సుకు మంచి అందం వస్తుంది. ఒక డ్రస్సులో అనేక పొరలు వేస్తా. ప్రతిసారి వేర్వేరు రంగులు వాడతాను.

మలుపు తిప్పిన సందర్భం...

కొందరు కొన్ని రకాల బట్టలు వేసుకోవటానికి ఇష్టపడరు. వారికి తగినట్లుగా బట్టలు కుట్టేదాన్ని. వాళ్లు పార్టీలకు వెళ్లినప్పుడు అవి భిన్నంగా ఉన్నాయని అందరూ గమనించేవారు. వారు మళ్లీ నాకు చెప్పేవారు. నా అనుభవసారమంతా కస్టమర్ల నుంచి వచ్చినదే! వాళ్లు నేర్పినదే. పదేళ్ల పాటు నేను ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా పనిచేశా. ఆ తర్వాత 'భార్గవి కూనం' కోసం వచ్చేవారు. 15 ఏళ్ల క్రితం ఒక ఇంగ్లీషు దినపత్రిక కోసం నోవాటిల్‌లో ఒక డిజైనర్ ఫ్యాషన్ షో నిర్వహించాను. హైదరాబాద్‌లో అలాంటి ఫ్యాషన్ షో జరగటం అదే తొలిసారి. ఆ ఫ్యాషన్ షో తర్వాత నాకు మంచి గుర్తింపు వచ్చింది. అదే సమయంలో కృష్ణవంశీ గారి 'మొగుడు' సినిమాలో 36 మందికి బట్టలు.. నగలు నేనే డిజైన్ చేశాను. ఆ సినిమాలో హీరోయిన్ తాప్సీ పన్ను, హీరో గోపీచంద్‌లకు డిజైన్ చేసిన బట్టలు బాగా ప్రసిద్ధి పొందాయి. ఈ సినిమాలో అనేక తరాలకు కావాల్సిన బట్టలు డిజైన్ చేయాల్సి వచ్చింది. ఈ సినిమావల్ల ఒక పెద్ద వివాదంలో చిక్కుకోవాల్సి వచ్చింది. ఈ సినిమాకు నేను డిజైనర్‌ని. క్రెడిట్స్‌లో కూడా నా పేరే ఉంటుంది. అయితే ఈ కాస్ట్యూమ్ డిజైన్స్‌ను ఆ సినిమా నిర్మాతలు కళామందిర్‌కు 50 లక్షల రూపాయలకు విక్రయించారు. కళామందిర్ వారు వెడ్డింగ్ కలెక్షన్‌గా ప్రచారం చేసుకున్నారు. నేను ఆ సమయంలో నా ఆవేదనను ఫేస్‌బుక్‌లో పెట్టాను. ఆ సమయంలోనే 'నేను ఎప్పుడూ సినిమాలకు పని చేయకూడదు' అనుకున్నా. 'రారండోయ్.. వేడుక చేద్దాం' సహా 20 సినిమాలకు పనిచేసి ఉంటా! ఈ సినిమాలో మొత్తం 25 లంగా, ఓణీలు డిజైన్ చేశాను. కానీ ఏ రోజూ డైరక్టర్‌ని కానీ.. హీరో హీరోయిన్లను కానీ కలవలేదు. స్టైలిస్ట్‌తోనే కలిసి పనిచేశా! వాళ్లు డబ్బులు ఇచ్చారు. నేను డిజైన్స్ ఇచ్చా. ఈ సినిమాల్లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పేరు వేస్తే నాకు మరింత పేరు వచ్చేదేమో! కానీ సినిమాలకు నాకు పడదని అర్థమయిపోయింది కాబట్టి నేను క్రెడిట్ కోసం ఎప్పుడూ పట్టించుకోలేదు.

నేసేవారందరూ మహిళలే

నేను బ్రాండ్ ప్రారంభించినప్పుడు వేర్వేరు ప్రాంతాల నుంచి వస్త్రాలు కొనేదాన్ని. పదేళ్ల తర్వాత దానిని కూడా నేనే తయారుచేయించుకుంటే బావుండుననిపించింది. 8 ఏళ్ల క్రితం నాకు అవసరమైన బట్టలు నేను నేయించుకోవటం మొదలుపెట్టాను. ఒక మగ్గంతో ప్రారంభించా. ఇప్పుడు నా దగ్గర 45 మగ్గాలు ఉన్నాయి. వీటిని నేసేవారందరూ మహిళలే! వాళ్లకు ఇంట్లో పని అయిపోయిన తర్వాత నేయటం మొదలుపెడతారు. వారికి డబ్బులు కూడా వస్తాయి. నా బట్టలన్నీ వీళ్లు నేసినవే! కొన్ని చీరలు చాలా బావుంటాయి. కొన్ని అంతగా బావుండవు. దీనికి కారణం- నేసేవారి భావోద్వేగాలు. ప్రతి చీర వెనక ఒక నేత కథ ఉంటుంది. అందుకే చీరలకు ఆత్మ ఉంటుందని నేను నమ్ముతాను. చీరలు వాటిని నేసేవారి కథలను ప్రతిబింబిస్తాయి. చీరకు వారికి మధ్య ఒక అనుబంధం ఉంటుంది. ఇప్పటికీ కాంచీపురంలో చీర నేసిన వెంటనే కామక్షి దేవి ఆలయానికి తీసుకు వెళ్లి పూజ చేయిస్తారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతారు."

• సీవీఎల్ఎన్ ప్రసాద్





నా బలం నా వర్క్.. నా క్లయింట్స్. ఇప్పుడు వెడ్డింగ్స్‌లో వేర్వేరు డిజైనర్స్‌ను వాడుతున్నారు. ఆరేళ్ల క్రితం అన్నీ ఒక్కళ్లకే ఇచ్చేవారు. ఇప్పుడు వేర్వేరు ఫంక్షన్లకు వేర్వేరు డిజైనర్లను పెట్టుకుంటున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి కూతురు పెళ్లిలో 12 ఈవెంట్స్‌కు నేనే కాస్ట్యూమ్స్ డిజైన్ చేశా! వారి కుటుంబంలో నలుగురు ఉంటే, వారందరికీ ప్రతి ఫంక్షన్‌కూ పది భిన్నమైన డిజైన్స్ చేసి చూపించాల్సి వచ్చింది. అది నిజంగా ఒక ఛాలెంజ్ అని చెప్పాల్సిందే!

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు







ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మాన్ వర్సెస్ బేబీ	వెబ్‌సిరీస్	డిసెంబర్ 11
గుడ్‌బై జూన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
సింగిల్ పాపా	హిందీ సిరీస్	డిసెంబర్ 12
వేక్ అప్ డెడ్ మాన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
అమెజాన్ ప్రైమ్		
మెర్సీ	ఒరిజినల్ మూవీ	డిసెంబర్ 10
టెల్ మీ సాఫ్టీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
జియో హాట్‌స్టార్		
సూపర్‌మ్యాన్	హాలీవుడ్‌మూవీ (తెలుగులో)	డిసెంబర్ 11
ది గ్రేట్ షంషుద్దీన్ ఫ్యామిలీ	హిందీ చిత్రం	డిసెంబర్ 12
ఆహా...		
త్రీ రోజెస్	తెలుగు సిరీస్	డిసెంబర్ 12
జీ 5		
సాలీ మొహబ్బత్	హిందీ చిత్రం	డిసెంబర్ 12

ఈ ఏడాది విడుదలైన 'హరున్ ఇండియా ఆర్ట్ లిస్ట్ 2025' జాబితాలో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 17 మంది మహిళలు స్థానం సంపాదించి చరిత్ర సృష్టించారు. భారత ఆర్ట్ మార్కెట్ గతిని మార్చేస్తున్న ఈ శుభపరిణామానికి గ్యాలరీలు, కళారాధకులు, వేలం సంస్థలు బ్రహ్మరథం పడుతున్నాయి. మహిళల సృజనకు, వారి విభిన్నమైన ఆలోచనా సరళికి ఎట్టకేలకు సరైన గుర్తింపు, ఆర్థిక విలువ లభిస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం.

కళా ప్రపంచంపై వారి ముద్ర



అగ్రపీఠంపై 85 ఏళ్ల మేధావి

ఈ మహిళా శక్తికి మకుటంగా నిలిచారు 85 ఏళ్ల దిగ్గజ కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత అంజోలి ఎలా మేనన్. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ ఆమె తన కళతో ఇప్పటికీ మార్కెట్‌ను శాసిస్తున్నారు. గడిచిన సంవత్సరంలో ఏకంగా రూ. 8.7 కోట్ల టర్నోవర్‌తో ఈ జాబితాలోని మహిళల్లో అగ్రస్థానాన్ని అధిష్ఠించారు. మొత్తం 32 కళాఖండాలు విక్రయించగా, అందులో ఒక చిత్రం గరిష్ఠంగా రూ. 1.4 కోట్లకు అమ్ముడు కావడం ఆమె కళకు ఉన్న డిమాండ్‌కు అద్దంపడుతోంది. దశాబ్దాలుగా తనదైన శైలితో కళాభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్న మేనన్ విజయం నేటి యువ కళాకారులకు స్ఫూర్తిదాయకం.

ఒకరిద్దరు కాదు...





ఈ విజయం కేవలం ఒకరిద్దరిది కాదు. మేనన్ తర్వాత ఢిల్లీకి చెందిన సీనియర్ ఆర్టిస్ట్ అర్పితా సింగ్ (రూ. 5.7 కోట్లు), ముంబైకి చెందిన నళిని మలాని (రూ. 4.9 కోట్లు) వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. ముఖ్యంగా అర్పితాసింగ్ గీసిన ఒక కళాఖండం రూ. 3.9 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించింది. టాప్-10 జాబితాను పరిశీలిస్తే మహిళల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. జయశ్రీ బర్మన్ (రూ.4.3 కోట్లు), భారతీ ఖేర్ (రూ.4 కోట్లు) వంటి ప్రముఖులతోపాటు మాధ్వీ పరేఖ్, అర్పణాకౌర్, శోభా బ్రూటా, సెలియాపాల్, అంజు దోడియా వంటి ప్రతిభావంతులు కోటి రూపాయలకుపైగా టర్నోవర్‌తో ఈ జాబితాలో సగర్వంగా నిలిచారు.

మారిన దృక్పథం.. పెరిగిన ఆదరణ

ఒకప్పుడు పురుషాధిక్య రంగంగా భావించిన కళా ప్రపంచంలో ఈ మార్పు ఆకస్మికంగా వచ్చింది కాదు. ఎందరో మహిళలు తమ జీవితాలను కళకే అంకితం చేసి నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోయారు. వారి కళలోని లోతు, సామాజిక స్పృహ, ప్రత్యేక భావవ్యక్తీకరణ ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కళను కేవలం అలంకార వస్తువుగా కాకుండా, ఒక శక్తిమంతమైన ఆయుధంగా, పెట్టుబడిగా చూసే ధోరణి పెరగడంతో కళాకారిణుల కృతులకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. మొత్తం మీద హరున్ ఆర్ట్‌లిస్ట్ 2025 భారత కళారంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అది కేవలం గణాంకాల నివేదిక కాదు. పట్టుదల, ప్రతిభ, సృజనాత్మకతతో కాన్వాసుపైనే కాదు, మార్కెట్‌లోనూ తమదైన ముద్రవేస్తున్న మహిళల విజయ పతాక.

నల్లని పట్టీలే నయా ట్రెండ్..!

వెండి పట్టీల స్థానంలో ఆక్సిడైజ్డ్ పట్టీలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. ఒకింత నలుపుదనాన్ని మేళవించినట్లుండే ఈ పట్టీలు.. ఎన్నేళ్లు పెట్టుకున్నా చెక్కు చెదరకుండా ఉంటాయి. అందుకే మహిళలంతా వీటివైపే మొగ్గు చూపుతున్నారు. ఆధునిక పోకడలకు అనుగుణంగా విభిన్నమైన డిజైన్లలో సరికొత్త హంగులతో వీటిని రూపొందిస్తున్నారు. నేటి యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్న ఈ ఆక్సిడైజ్డ్ పట్టీలపై ఓ లుక్కేద్దామా...

కడా మోడల్



ఈ పట్టీలు రాజస్థాన్, గుజరాత్ సంస్కృతులను ప్రతిబింబిస్తూ నల్లగా గుండ్రంగా ఉంటాయి. కడా బ్రేస్‌లెట్‌ను తలపిస్తాయి. పాదాల మీదుగా జాలువారకుండా చీలమండకు అంటి పెట్టుకుని ఉంటాయి. వీటికి స్క్రూ లేదా స్నాప్ క్లోజర్‌ను అమరుస్తారు. క్లాసీగా ఉండేలా చిన్న చిన్న మువ్వలు చేర్చి రత్నాలు పొదిగిన కడా స్టయిల్ పట్టీలు ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

స్టోన్ వర్క్ పట్టీలు




సున్నితమైన గొలుసుకు రంగురంగుల రాళ్లు, పూసలు, చిన్న సైజు రత్నాలు జతచేసి తయారుచేసిన ఈ పట్టీలు.. అమ్మాయిలను బాగా ఆకర్షిస్తున్నాయి. నల్లగా మెరిసే వెడల్పాటి గొలుసు మీద చిన్న మోటిఫ్‌లు, పూలు, లతలు తీర్చి వాటి మధ్యలో మెరిసే రాళ్లు, కుందనాలు పొదిగి ఆకర్షణీయమైన పట్టీలను రూపొందిస్తున్నారు.

గుత్తి స్టయిల్



నల్లగా మెరిసే వెడల్పాటి పట్టీలకు చిన్న చిన్న మువ్వలను గుత్తులు గుత్తులుగా జోడిస్తారు. ఈ మువ్వలు శబ్దం చేయవు. పట్టు చీరలు, పరికిణీలు, లెహంగాల మీద గ్రాండ్ లుక్‌నిస్తాయి. మహిళలు వివాహాది శుభ కార్యాల్లో వీటిని ఎక్కువగా ధరిస్తుంటారు. చిన్న పిల్లల నుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఇష్టపడే మోడల్ ఇది.

ఫ్లవర్ డిజైన్



పువ్వులను వరుసగా పేర్చినట్లు కనిపించే ఈ డిజైనర్ పట్టీలకు కూడా డిమాండ్ అధికంగా ఉంది. తేలికపాటి నలుపు రంగులో సింపుల్‌గా కనిపించే విభిన్నమైన డిజైన్లలో ఇవి లభ్యమవుతున్నాయి. ఇవి రోజువారీ పెట్టుకోడానికి బాగుంటాయి.

ఎలా తయారుచేస్తారంటే...

వెండి పట్టీలను సల్ఫైడ్ సమ్మేళనాల్లో ముంచి నల్లబరిచి ఆక్సిడైజ్డ్ పట్టీలను తయారు చేస్తున్నారు. ఈ ఆక్సిడైజ్డ్ పట్టీలు.. దుమ్ము, ధూళిని ఆకర్షించకుండా అందంగా మెరుస్తూ కనిపిస్తాయి. డిజైన్‌ను అనుసరించి వాటికి అరుదైన గ్రాండ్ లుక్ కూడా వస్తుంది. చీరలు, లెహంగాలు, సల్వార్ సూట్లు లాంటి సంప్రదాయ దుస్తులతోపాటు డెనిమ్, బోహేమియన్, ఫ్యూజన్ తదితర మోడరన్ డ్రెస్‌ల మీద కూడా ఇవి చక్కగా సూటవుతాయి.

మిర్రర్ మోడల్



గుండ్రని లేదా జ్యామితి ఆకృతుల్లో ఉన్న చిన్న, పెద్ద అద్దాలను చక్కని డిజైన్ ప్రకారం చేర్చి ఈ మిర్రర్ మోడల్ ఆక్సిడైజ్డ్ పట్టీలను తయారు చేస్తారు. ఇవి రాజస్థానీ కచ్ సంప్రదాయాన్ని గుర్తుకు తెస్తాయి. ఈ పట్టీలకు చిన్న మువ్వలను కూడా జోడించడంతో నడిచేటప్పుడు శ్రావ్యమైన ధ్వని వస్తుంటుంది. వీటిని యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

రత్నాల పట్టీలు



అక్కడక్కడా నల్లగా మెరిసే ఆక్సిడైజ్డ్ వెండి గొలుసుకు రంగురంగుల రత్నాలను జతచేసి ఈ రత్నాల పట్టీలను రూపొందిస్తున్నారు. పూలు, కొమ్మల డిజైన్లలో ఇవి ఎక్కువగా లభిస్తుంటాయి. వీటికి పెద్ద సైజు మువ్వలను లేదంటే చిన్న మువ్వల గుత్తులను జోడించి వింటేజ్ లుక్ తెస్తున్నారు. వివాహాది శుభకార్యాల్లో, పండుగలప్పుడు పెట్టుకోడానికి మహిళలు ఎక్కువగా ఈ రత్నాల పట్టీలనే ఎంచుకుంటున్నారు.

చిట్కా

కడాయి మాడిందా..?

నల్లగా మాడిన కడాయిలో బేకింగ్ సోడా చల్లాలి. దీని మీద కొద్దిగా వెనిగర్‌ను చిలకరించాలి. రెండూ కలిసి నురుగులా పొంగు వస్తుంది. దీన్ని అలాగే అరగంటసేపు ఉంచాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్ది నీళ్లు పోసి కడిగితే కడాయి తళతళా మెరుస్తుంది. స్టీల్ లేదా ఇనుప కడాయిని తోమడానికి స్టీల్ స్క్రబ్బర్‌ను ఉపయోగించాలి. నాన్‌స్టిక్ కడాయికి మాత్రం మృదువైన స్పాంజ్ స్క్రబ్బర్‌ను వాడాలి.

స్పోర్ట్స్

విజయవాడ ● ఆదివారం 7 డిసెంబరు 2025

టాస్ గెలిచారోచ్..

ఒకటా.. రెండా వరుసగా 20 వన్డేల్లో టాస్ ఓడిన భారత జట్టుకు ఈసారి అదృష్టం వరించింది. 2023 వన్డే వరల్డ్ కప్ సెమీస్ తర్వాత తిరిగి ఇన్నాళ్లకు టీమిండియా టాస్ గెలవడం విశేషం. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లకు మంచు ప్రభావం ఉండడంతో టాస్ గెలిచిన జట్టుకు ప్రయోజనం ఎక్కువగా ఉంటోంది. మరోవైపు అనలిస్ట్ హరి సూచన మేరకు తానీసారి ఎడమ చేత్తో నాణేన్ని ఎగరేసి ఫలితం రాబట్టినట్టు కెప్టెన్ రాహుల్ తెలిపాడు.





టీ20 సిరీస్ బరిలో గిల్

న్యూఢిల్లీ: భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ (సీఓఈ)లో నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో తను పాస్ అయ్యాడు. దీంతో దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు టీ20ల సిరీస్ ఆడనున్నాడు. ఇంతకుముందే ఈ సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ ఉంటేనే ఆడతాడని ప్రకటించారు. కోల్‌కతా టెస్టులో గాయపడ్డాక గిల్ సీఓఈలో పునరావాస శిబిరంలో చేరాడు.

సురుచికి పసిడి

షూటింగ్ వరల్డ్ కప్ ఫైనల్



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీలో తొలి రోజే భారత షూటర్లు పతకాల పంట పండించారు. శనివారం ఇక్కడ జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సురుచి సింగ్ స్వర్ణం, సైన్యామ్ రజతం సాధించారు. మనూ భాకర్ ఐదోస్థానానికి పరిమితమైంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సమ్రాట్ మూడోస్థానంతో కాంస్యం దక్కించుకున్నాడు.

సూపర్ లీగ్‌కు ఆంధ్ర

కేరళపై గెలుపు

లఖ్‌నవూ: ఆంధ్ర జట్టు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 టోర్నీ సూపర్ లీగ్‌కు దూసుకు పోయింది. శనివారం జరిగిన గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో 7 వికెట్లతో కేరళను చిత్తు చేసింది. తొలుత కేరళ 20 ఓవర్లలో 119/7 స్కోరుకే పరిమితమైంది. సంజూ శాంసన్ (73) హాఫ్ సెంచరీతో ఆదుకున్నాడు. సౌరబ్, సత్యనారాయణ రాజు చెరో 2 వికెట్లు తీశారు. స్వల్ప ఛేదనను ఆంధ్ర 12 ఓవర్లలో 123/3 స్కోరుతో పూర్తి చేసింది. శ్రీకర్ భరత్ (53) సత్తా చాటాడు. గ్రూపు దశలో మరో రౌండ్ జరగాల్సి ఉండగా.. ఆంధ్ర (20 పాయింట్లు) సూపర్ లీగ్‌లో అడుగుపెట్టింది.

గ్రీవ్స్ అజేయ డబుల్

కివీస్-విండీస్ తొలి టెస్ట్ డ్రా



క్రైస్ట్‌చర్చ్: జస్టిన్ గ్రీవ్స్ (202 నాటౌట్) ద్విశతక పోరాటంతో.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ డ్రాతో గట్టెక్కింది. 531 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఐదో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 212/4 స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 6 వికెట్లకు 457 పరుగులు సాధించింది. షాయ్ హోప్ (140), కీమర్ రోచ్ (58 నాటౌట్) రాణించారు. జాకబ్ డఫీ మూడు వికెట్లు పడగొట్టాడు. కివీస్ 231, 466/8 డిక్లేర్ చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకు ఆలౌటైంది. కాగా, ఐదు రోజుల టెస్ట్‌ల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో విండీస్ చేసిన 457 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం.

ఓటమి దిశగా ఇంగ్లండ్

ఆసీస్‌తో యాషెస్ రెండో టెస్ట్

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా వెటరన్ పేసర్ మిచెల్ స్టార్క్ ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్నాడు. తొలి టెస్ట్‌లో పది వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టిన మిచెల్.. రెండో టెస్ట్‌లో అటు బౌలింగ్‌తోపాటు ఇటు బ్యాటింగ్‌లోనూ ఇంగ్లండ్‌ను వణికించాడు. ఇక్కడ జరుగుతున్న డే/నైట్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన స్టార్క్..అర్ధ సెంచరీతో బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 2 కీలక వికెట్లు పడగొట్టాడు. దాంతో ఈ టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. 177 పరుగుల మొదటి ఇన్నింగ్స్ లోటుతో..రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ మూడోరోజు ఆఖరికి 134/6 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 378/6తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూలు 511 రన్స్ చేశారు. స్టార్క్ (77), బోలాండ్ (21 బ్యాటింగ్) తొమ్మిదో వికెట్‌కు 75 రన్స్ జోడించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 రన్స్ చేసింది.



రాహుల్‌కు ట్రోఫీ అందజేస్తున్న చాముండి

విశాఖలో విజయ గర్జన

ఆఖరి వన్డేలో సఫారీలపై ఘన విజయం

2-1తో భారత్‌దే సిరీస్

బౌలింగ్‌లో భళా అనిపించారు.. బ్యాటింగ్‌లో బెదరగొట్టారు. వెరసి సిరీస్ నిర్ణాయక వన్డేలో టీమిండియా చెలరేగింది. పేసర్ ప్రసిద్ధ్ విమర్శకులకు సమాధానమిస్తూ పదునైన బంతులతో కీలక వికెట్లు తీసి సఫారీల భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. అటు స్పిన్ మాంత్రికుడు కుల్దీప్ ఉచ్చులో టెయిలెండర్లు విలవిల్లాడారు. ఇక ఓ మాదిరి ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ వన్డేల్లో తొలి శతకంతో మెరవగా.. వెటరన్లు రోహిత్, విరాట్ మరోసారి చెలరేగారు. ఫలితంగా సఫారీలను 9 వికెట్లతో చిత్తుచేసిన టీమిండియా 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



1 వన్డేల్లో ఎక్కువ శతకాలు (23) చేసిన వికెట్ కీపర్‌గా సంగక్కరతో కలిసి టాప్‌లో నిలిచిన డికాక్. అలాగే భారత్‌పై జయసూర్యతో కలిసి ఎక్కువ సెంచరీలు (7) చేసిన బ్యాటర్ కూడా డికాకే.




డికాక్ సెంచరీ వృథా

జైస్వాల్ అజేయ శతకం

యశస్వీ జైస్వాల్ (116 నాటౌట్)

6 మూడు ఫార్మాట్లలోనూ శతకాలు బాదిన ఆరో భారత బ్యాటర్‌గా జైస్వాల్. రైనా, రాహుల్, విరాట్, రోహిత్, గిల్ ముందున్నారు.



ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీతో కోహ్లీ

విశాఖపట్నం స్పోర్ట్స్ **(ఆంధ్రజ్యోతి):** దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు 2-1తో గెల్చుకుంది. శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చిన రాహుల్ సేన 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (121 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో 116 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. ముందుగా దక్షిణాఫ్రికా 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. డికాక్ (89 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 106) సెంచరీ సాధించగా, కెప్టెన్ బవుమా (48), బ్రెవిస్ (29) ఫర్వాలేదనిపించారు. స్పిన్నర్ కుల్దీప్, పేసర్ ప్రసిద్ధ్‌లకు నాలుగేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 39.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 271 రన్స్ చేసి గెలిచింది. రోహిత్ (73 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 75), విరాట్ (45 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 65 నాటౌట్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జైస్వాల్.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా కోహ్లీ నిలిచారు.

టాపార్డర్ అదుర్స్: భారీ ఛేదన కాకపోవడంతో భారత్ ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడింది. ఓపెనర్లు రోహిత్, జైస్వాల్ తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యం అందించగా.. విరాట్ ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. ఆరంభంలో పిచ్ పేసర్లకు సహకరించడంతో ఓపెనర్లు నిదానంగానే ఆడారు. జైస్వాల్ లెఫ్టామ్ పేసర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడినా ఈసారి పట్టుదలగా క్రీజులో నిలిచాడు. అయితే స్ట్రయిక్‌ను రొటేట్ చేయడంలో విఫలమయ్యాడు. రోహిత్ మాత్రం ధాటిని చూపుతూ అడపాదడపా బౌండరీలతో స్కోరులో కదలిక తెచ్చాడు. కాస్త కుదురుకున్నాక జైస్వాల్ ఆటతీరులోనూ మార్పు కనిపించింది. దీనికి తోడు మంచు ప్రభావం చూపడంతో బ్యాటర్లకు ఇబ్బందిలేకపోయింది. జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయ్యాక ఆటలో వేగం పెంచాడు. పేసర్లను దీటుగా ఎదుర్కొంటూ ఫోర్లు సాధించాడు. అయితే సెంచరీ వైపు సాగుతున్న రోహిత్ స్లాగ్‌స్వీప్‌నకు వెళ్లి కేశవ్ ఓవర్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ కెరీర్‌లో తొలి శతకం పూర్తి చేయగా.. విరాట్ సూపర్ ఫామ్‌తో ప్రేక్షకులను అలరించాడు. బాష్ ఓవర్‌లో 6,4 ఆ వెంటనే బార్ట్‌మన్ ఓవర్‌లో 4,6తో అదరగొట్టాడు. ఈ ఊపుతో విరాట్ 40 బంతుల్లోనే ఫిఫ్టీ అందుకున్నాడు. 40వ ఓవర్‌లో అతను మరో 2 ఫోర్లతో 61 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

అటు ప్రసిద్ధ్, ఇటు కుల్దీప్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సఫారీలకు ఆరంభం బాగానే ఉన్నా మధ్య ఓవర్ల నుంచి కష్టాలు మొదలయ్యాయి. ప్రసిద్ధ్ టాప్, మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. చివర్లో కుల్దీప్ హవా చూపాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్‌ను అర్ష్‌దీప్ డకౌట్ చేశాడు. ఈ దశలో ఓపెనర్ డికాక్ జట్టుకు అండగా నిలిచాడు. సిరీస్‌లో తొలిసారిగా బ్యాట్‌ను ఝళిపించిన అతను కెరీర్‌లో 23వ శతకంతో ఆకట్టుకున్నాడు. అతడికి బవుమా సహకరించడంతో రెండో వికెట్‌కు 113 రన్స్ జత చేరాయి. ప్రసిద్ధ్ రెండో ఓవర్‌లో డికాక్ 6,6,4తో 18 రన్స్ రాబట్టాడు. ఈ జోరుతో డికాక్ 42 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాక, మరింత ధాటిని కనబర్చిన అతను 79 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అయితే బవుమాను జడేజా అవుట్ చేయడంతో ఈ జోడీకి బ్రేక్ పడింది. కానీ డికాక్‌కు బ్రీట్‌స్కే (24) జత కలవడంతో మూడో వికెట్‌కు 54 రన్స్ చేరాయి. తిలక్‌ను బ్రీట్‌స్కే లక్ష్యం చేసుకోవడంతో కెప్టెన్ రాహుల్ తిరిగి ప్రసిద్ధ్‌కు బంతినిచ్చాడు. ఇక్కడే మ్యాచ్ టర్న్ అయ్యింది. తన తొలి స్పెల్‌లో రెండు ఓవర్లకే 27 రన్స్ ఇచ్చుకున్న ప్రసిద్ధ్ ఈసారి మిడిలార్డర్ భరతం పడుతూ.. వరుస 4 ఓవర్లలో 3 వికెట్లతో సఫారీల వెన్ను విరిచాడు. ముందుగా 29వ ఓవర్‌లో బ్రీట్‌స్కే, మార్‌క్రమ్ (1)లను పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత కాసేపటికే ఫుల్ లెంగ్త్ డెలివరీకి డికాక్‌ను బౌల్డ్ చేయడంతో జట్టు ఇబ్బందుల్లో పడింది. ఇక టెయిలండర్లను స్పిన్నర్ కుల్దీప్ కుదురుకోనీయకుండా చకచకా 4 వికెట్లతో సఫారీ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా: డికాక్ (బి) ప్రసిద్ధ్ 106, రికెల్టన్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 0, బవుమా (సి) కోహ్లీ (బి) జడేజా 48, బ్రీట్‌స్కే (ఎల్బీ) ప్రసిద్ధ్ 24, మార్‌క్రమ్ (సి) కోహ్లీ (బి) ప్రసిద్ధ్ 1, బ్రెవిస్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 29, యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 17, బాష్ (సి అండ్ బి) కుల్దీప్ 9, కేశవ్ (నాటౌట్) 20, ఎన్‌గిడి (ఎల్బీ) కుల్దీప్ 1, బార్ట్‌మన్ (బి) ప్రసిద్ధ్ 3, **ఎక్స్‌ట్రాలు:** 12; **మొత్తం: 47.5 ఓవర్లలో 270 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-114, 3-168, 4-170, 5-199, 6-234, 7-235, 8-252, 9-258, 10-270; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 8-1-36-1, హర్షిత్ 8-2-44-0, ప్రసిద్ధ్ 9.5-0-66-4, జడేజా 9-0-50-1, కుల్దీప్ 10-1-41-4, తిలక్ 3-0-29-0.

భారత్: జైస్వాల్ (నాటౌట్) 116, రోహిత్ (సి) బ్రీట్‌స్కే (బి) కేశవ్ 75, కోహ్లీ (నాటౌట్) 65, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 39.5 ఓవర్లలో 271/1; వికెట్ పతనం:** 1-155; **బౌలింగ్:** యాన్సెన్ 8-1-39-0, ఎన్‌గిడి 6.5-0-56-0, కేశవ్ మహరాజ్ 10-0-44-1, బార్ట్‌మన్ 7-0-60-0, బాష్ 6-0-53-0, మార్‌క్రమ్ 2-0-17-0.

బిజినెస్ ప్లస్

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు డౌన్

ప్రత్యామ్నాయాలు బోలెడు.. దిగులెందుకు దండగ



దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. గత ఏడాది కాలంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు 1.25 శాతం తగ్గించింది. తాజాగా శుక్రవారం వెలువరించిన ద్రవ్య పరపతి విధానంలోనూ ఆర్‌బీఐ ఎంపీసీ రెపో రేటు పావు శాతం తగ్గించింది. ధరల సెగ అదుపులో ఉన్నందున ఫిబ్రవరిలో జరిగే భేటీలోనూ ఎంపీసీ రెపో రేటు మరో పావు శాతం తగ్గిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. రెపో రేటు తగ్గడంతో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై చెల్లించే వడ్డీ రేట్లలోనూ కోత పెడుతున్నాయి. ప్రస్తుతం పదేళ్ల కాలపరిమితి ఉండే ఎఫ్‌డీని తీసుకున్నా ఏ బ్యాంకూ 8 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు. దీంతో కేవలం వడ్డీ ఆదాయంపై మాత్రమే ఆధారపడే పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆలోచిస్తే ఎఫ్‌డీలకూ మంచి ప్రత్యామ్నాయాలు ఉన్నాయంటున్నారు ఆర్థిక నిపుణులు. అవేమిటో తెలుసుకుందాం.

డెట్ మ్యూచువల్ ఫండ్స్

పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండే మదుపరులకు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, రిటైరీలు.. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే రుణ పథకాలపై దృష్టి పెట్టవచ్చు. ఈ పథకాల ద్వారా సమీకరించే నిధులను ఎంఎఫ్‌లు ప్రభుత్వ రుణ పత్రాలు, మంచి పరపతి రేటింగ్ ఉన్న కంపెనీల రుణ పత్రాలు, ఇతర స్థిర ఆదాయ పథకాల్లో మదుపు చేస్తాయి. ఈ రుణ పథకాలపై రాబడులు స్థిరంగా 6 నుంచి 8.5 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం ఎఫ్‌డీలపై లభించే రాబడుల కంటే ఇది ఎక్కువే. ఫిక్స్‌డ్ డిపాజిట్ల తరహాలోనే ఈ డెట్ పథకాల్లో పెట్టుబడులకు లాక్-ఇన్ పీరియడ్ అంటూ ఉండదు. ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు యూనిట్లను ఆ రోజు అమ్ముకుని సొమ్ము చేసుకోవచ్చు. స్వల్ప, మధ్యకాలిక మదుపరులకు ఇవి అత్యంత అనువైనవి. దీర్ఘకాలిక మదుపరులైతే ఈ డెట్ ఫండ్స్ రాబడులపై ఇండెక్సేషన్ ప్రయోజనంతో పన్ను పోటు కూడా తగ్గించుకోవచ్చు. అయితే ఈ ఫండ్స్‌ను ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. స్థిరమైన రాబడులు అందిస్తూ, మంచి పరపతి రేటింగ్ ఉన్న రుణ పత్రాలను తన పోర్టుఫోలియోలో కలిగి ఉన్న ఎంఎఫ్ రుణ పథకాలను మాత్రమే ఎంచుకోవాలి. పెద్దగా రిస్క్ లేని ఈ పథకాలను రిటైరీలు, సీనియర్ సిటిజన్లు ఎంచుకోవచ్చు.

కంపెనీల ఎఫ్‌డీలు

కార్పొరేట్ కంపెనీలు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) కూడా బ్యాంకుల ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయం. ఈ ఎఫ్‌డీలపై కంపెనీలు.. బ్యాంకులు తమ ఎఫ్‌డీలపై చెల్లించే వడ్డీ కంటే 2 నుంచి 3 శాతం అధికంగానే చెల్లిస్తాయి. కాకపోతే ఇక్కడ పరపతి రేటింగ్ సంస్థలు ఆ ఎఫ్‌డీలకు ఇచ్చిన రేటింగ్ ఆధారంగా మాత్రమే వీటిని ఎంచుకోవాలి. ట్రిపుల్ ఏ లేదా కనీసం డబుల్ ఏ రేటింగ్ ఉన్న కంపెనీల ఎఫ్‌డీలను మాత్రమే ఎంచుకోవాలి. లేకపోతే జేబుకు చిల్లు పడే ప్రమాదం ఉంది. సీనియర్ సిటిజన్లు, రిటైరీలు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్

ఏ మాత్రం నష్ట భయం గానీ, మార్కెట్ ఆటుపోట్ల ప్రభావం గానీ లేకుండా హామీతో కూడిన స్థిర ఆదాయం కోరుకునే వ్యక్తులు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)ని ఎంచుకోవడం మంచిది. ప్రస్తుతం ఈ పథకంపై 7.7 శాతం వడ్డీ లభిస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి ఉండే ఈ పథకంపై చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ కూడా ఉంది. ఈ పథకంపై ఏడాదికి ఒకసారి వడ్డీ లెక్క కట్టి మెచ్యూరిటీ సమయంలో చెల్లిస్తారు. సెక్షన్ 80సీ కింద ఈ పథకంలో పెట్టుబడులకు ఆదాయ పన్ను ప్రయోజనాలూ లభిస్తాయి. పన్ను ప్రయోజనాల కోసం చూసే సంప్రదాయ మదుపరులకు ఎన్ఎస్‌సీ చక్కటి ప్రత్యామ్నాయం.

ఈక్విటీ పథకాలు

దీర్ఘకాలిక మదుపరులు ముఖ్యంగా ఐదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం వేచి చూడగలిగే మదుపరులు బ్యాంకు ఎఫ్‌డీలకు బదులు ఈక్విటీ పథకాలపైనా దృష్టి పెట్టవచ్చు. కొద్దిగా రిస్క్ ఉన్నా దీర్ఘకాలంగా చూస్తే ఈ పథకాలు మదుపరులకు ఎంత లేదన్నా 12 నుంచి 14 శాతానికి పైగా రాబడులు పంచుతున్నాయి. కాకపోతే ఫండ్‌తో పాటు ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డు చూసి మరీ ఈ పథకాలను ఎంచుకోవాలి. ఆస్తుల కల్పన కోసం చూసే యువత బ్యాంకు ఎఫ్‌డీల కంటే మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ఈక్విటీ పథకాలను ఎంచుకోవడం మంచిది. వీటిపై సరైన అవగాహన లేకపోతే సరైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకుని మదుపు చేయడం మంచిది. రిస్క్ తీసుకోలేని సీనియర్ సిటిజన్లు కూడా లార్జ్ క్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మంచిది.

బులియన్ పెట్టుబడులు

బంగారం, వెండి కూడా ఎఫ్‌డీలకు చక్కటి ప్రత్యామ్నాయం. ఈ సంవత్సరం ఈ రెండు లోహాలు ఇచ్చినంత లాభం మరే ఆస్తులు ఇవ్వలేదు. వచ్చే ఏడాది కూడా బంగారం, వెండి ధరలు మరింత పరుగు తీస్తాయే తప్ప వెనకడుగు వేయవని నిపుణులు చెబుతున్నారు. పెద్దగా రిస్క్ లేకుండా సురక్షితమైన దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం చూసే మదుపరులు బ్యాంకు ఎఫ్‌డీలకు బదులు గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా డిజిటల్ గోల్డ్‌ను ఆశ్రయించడం మంచిది. కొత్తగా సావరిన్ గోల్డ్ బాండ్స్ జారీ చేయడాన్ని ప్రభుత్వం ఆపేసింది. అయితే ఆసక్తి ఉన్న మదుపరులు సెకండరీ మార్కెట్ నుంచి వీటికి కొనుగోలు చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు.

కిసాన్ వికాస్ పత్ర

ప్రస్తుతం ఈ పథకంపై 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ పథకంలో పెట్టుబడి 115 నెలల్లో రెట్టింపు అవుతుంది. ఈ పథకం చెల్లింపులకు ప్రభుత్వ హామీ ఉంటుంది. ఎలాంటి ఆటుపోట్లు లేకుండా స్థిరమైన ఆదాయం కోరుకునే సంప్రదాయ మదుపరులు, సీనియర్ సిటిజన్లకు 'కిసాన్ వికాస్ పత్ర' అత్యంత అనువైంది.

బ్యాంకు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు తగ్గిపోతున్నాయని గాభరా పడకుండా సంప్రదాయ మదుపరులు, సీనియర్ సిటిజన్లు పై పథకాలను ఎంచుకోవడం మంచిది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,150 ▲	1,19,300 ▲	1,95,900 ▼
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,84,000 ▲
విశాఖపట్నం	1,29,930 ▼	1,19,100 ▲	1,95,900 ▼
రాజమండ్రి	1,30,150 ▼	1,19,300 ▼	1,82,000 ▲
ప్రొద్దుటూరు	1,27,400 ▼	1,17,210 ▼	1,78,000 ▲
ముంబై	1,28,592 ▲	1,17,790 ▲	1,78,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ. 90	

ఈ టర్మ్ లైఫ్ పాలసీల ప్రీమియం తిరిగిచ్చేస్తారు..

జీవిత బీమా కవరేజీతో పాటు ప్రీమియం రిఫండ్ కోరుకునే వారి కోసం టీఆర్ఓపీ



జీవితం క్షణ భంగురం. మరణం ఎన్నటికైనా తథ్యం. కానీ, నూరేళ్ల ఆయువు అర్ధాంతరంగా ముగియడం దురదృష్టకరం. పాలసీదారు అకాలంగా మరణించిన సందర్భంలో అతడు లేదా ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించేదే జీవిత బీమా. అందులో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ అత్యంత సరళమైన, అందుబాటు ధరలో లభించే పాలసీ. మిగతా లైఫ్ పాలసీలతో పోలిస్తే ప్రీమియం తక్కువ. బీమా కవరేజీ ఎక్కువ. కానీ, పథకం గడువు తీరే నాటికి పాలసీదారు బ్రతికి ఉన్న పక్షంలో చెల్లించిన ప్రీమియం మాత్రం తిరిగి రాదు. పాలసీ గడువు ముగిశాక రిఫండ్ కోరుకునే వారి కోసం బీమా కంపెనీలు రిటర్న్ ఆఫ్ ప్రీమియం ఆప్షన్‌తో కూడిన టర్మ్ ప్లాన్లను (టీఆర్ఓపీ) కూడా అందుబాటులోకి తెచ్చాయి. కాకపోతే, వీటి ప్రీమియం కాస్త అధికం. సంప్రదాయ టర్మ్ పాలసీలతో పోలిస్తే రెండింతల వరకు ప్రీమియం చెల్లించాల్సి రావచ్చు. జీవిత బీమా కవరేజీతోపాటు ప్రీమియం రిఫండ్‌నూ కోరుకునేవారు ఈ పాలసీలను ఎంచుకోవచ్చు. రిటర్న్ ఆఫ్ ప్రీమియం (ఆర్ఓపీ) ఆప్షన్‌తో కూడిన టర్మ్ లైఫ్ ప్లాన్‌ను ఎంచుకునే వారు గమనించాల్సిన అంశాలు..

- రిఫండ్ చేయాల్సిన ప్రీమియం మొత్తం నుంచి బీమా కంపెనీ రుసుముల పేరుతో ఏమైనా మినహాయించుకోనుందా అని పాలసీ కొనుగోలుకు ముందే డాక్యుమెంట్లోని వివరాలను పరిశీలించాలి. లేని పక్షంలో బీమా కంపెనీ ప్రతినిధిని స్పష్టత కోరండి.
- బీమా కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ల గత చరిత్రను కూడా పరిశీలించాలి. కంపెనీ విశ్వసనీయతకు ఇది ప్రతీక.
- ప్రీమియం చెల్లింపుల్లో వెసులుబాట్లను తెలుసుకోవాలి. సాధారణంగా కంపెనీ వార్షిక, అర్ధ సంవత్సరం, త్రైమాసిక, నెలవారీ చెల్లింపు అవకాశాలను కల్పిస్తాయి. మీ ఆదాయానికి అనుగుణమైన ఆప్షన్‌ను ఎంచుకోండి.
- ప్రీమియం రిఫండ్‌తోపాటు క్రిటికల్ ఇల్‌నెస్, యాక్సిడెంటల్ డెత్, డిసేబిలిటీ బెనిఫిట్ వంటి రైడర్ ఆప్షన్లు కూడా ఉన్న ప్లాన్లను ఎంచుకోవడం ఉత్తమం. అయితే, ఈ రైడర్లకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో సరికొత్త రికార్డును సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో కేవలం 249 రోజుల్లోనే 6 కోట్ల టన్నుల సరుకును రవాణా చేసింది. ఈ మైలురాయిని చేరుకోవడానికి 2024-25లో 273 రోజులు, 2023-24లో 275 రోజుల సమయం పట్టింది. సరుకు రవాణాలో పోర్టు అనుసరిస్తున్న నూతన విధానాలు, ఉద్యోగుల నిబద్ధత, ప్రాంతీయ వాణిజ్యాభివృద్ధికి తీసుకున్న సానుకూల నిర్ణయాలు...ఇందుకు కారణమని పోర్టు ఇన్‌చార్జి ఛైర్మన్ ఎం అంగముత్తు పేర్కొన్నారు.

మార్కెట్లోకి రెడ్‌మీ 15 సీ 5జీ స్మార్ట్‌ఫోన్



ముంబై: షామీ ఇండియా మార్కెట్లోకి రెడ్‌మీ 15సీ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను ఆవిష్కరించింది. 17.53 సెంటీమీటర్ల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ఆక్టాకోర్ ప్రాసెసర్, 50 ఎంపీ ఏఐ డ్యూయల్ కెమెరా, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీతో దీన్ని తీసుకువచ్చింది. 4జీబీ+128 జీబీ, 6జీబీ + 128 జీబీ, 8జీబీ+128 జీబీ వేరియంట్లతో కూడిన ఈ స్మార్ట్‌ఫోన్ ధరలు వరుసగా రూ.12,499, రూ.13,999, రూ.15,499గా ఉన్నాయి.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	125
కర్నూలు	129	నెల్లూరు	130
విశాఖపట్నం	126	అనంతపురం	130
గోదావరి	130		

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

తెలుగు నేర్చుకుంటా.. డబ్బింగ్ నేనే చెబుతా

- శివ రాజ్‌కుమార్



పేదల పక్షపాతి, సైకిల్ పై అసెంబ్లీకి వెళ్లిన ఇల్లందు మాజీ శాసన సభ్యుడు గుమ్మడి నర్సయ్య జీవిత కథను అదే పేరుతో సినిమాగా తీస్తున్నారు ఎస్.సురేశ్‌రెడ్డి. కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ టైటిల్ పాత్రను పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శనివారం పాల్వంచలో మొదలైంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి సతీమణి నందిని దర్శకుడు పరమేశ్వర్ హివ్రాలేకు స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రధాని నరేంద్రమోదీకి చూపిస్తామని అన్నారు. శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి వ్యక్తి పాత్రను పోషిస్తున్నందుకు ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకుంటా.. నేనే డబ్బింగ్ చెబుతా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ 'వ్యవస్థలో మార్పు రావాలంటే ముందు మనలో మార్పు రావాలి. నేనేం గొప్ప నాయకుడిని కాదు.. అందరిలా సామాన్యుడినే. నన్ను గొప్పగా కాకుండా నా భావాలను మాత్రమే ఈ సినిమాలో చూపించాలని, చూపిస్తారని ఆశిస్తున్నా' అని అన్నారు. ఉద్యమగడ్డ అయిన పాల్వంచ నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టామనీ, 'గుమ్మడి నర్సయ్య' చిత్రం రాజకీయాల్లో కచ్చితంగా మార్పు తెస్తుందని భావిస్తున్నామనీ నిర్మాత సురేశ్‌రెడ్డి చెప్పారు.

పాల్వంచ రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్రేమకథతో..



సంజూస్ తగరం హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించే 'మై లవ్' చిత్రం షూటింగ్ శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హర్షిత హీరోయిన్. శాసన సభ్యుడు నవీన్ యాదవ్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, తెలంగాణ ఐ.టి. మినిస్టర్ శ్రీధర్‌బాబు తొలి క్లాప్ ఇచ్చారు. నేటి యువతకు మంచి సందేశం అందించే ప్రేమ కథాచిత్రం ఇదనీ, నటుడిగా, సంగీత దర్శకుడిగా, దర్శకుడిగా తనకు మంచి గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉందని సంజూస్ చెప్పారు. మంచి కథ, కథనాలతో వినోదాత్మకంగా చిత్రం ఉంటుందని నిర్మాత శ్రీనివాసరావు తెలిపారు.



పాత్రే తప్ప సావిత్రి కనపడేవారు కాదు

- ఎం.వెంకయ్య నాయుడు

'మహానటికి మరణం లేదు, సావిత్రి గారు నవరస అద్భుత నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేవారు, తన నట జీవితంలో ప్రతి చిత్రంలోనూ కేవలం పాత్ర మాత్రమే కనిపించేది. సావిత్రి గారు కనపడేవారు కాదు' అని అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు. మహానటి సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమె కుమార్తె విజయ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'సంగమం ఫౌండేషన్' చైర్మన్ సంజయ్ కిశోర్ నిర్వహణలో హైదరాబాద్‌లో సావిత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో ఎంత మంది కథానాయికలున్నా మహానటి మాత్రం సావిత్రి గారే' అని కొనియాడారు. నటుడు, నిర్మాత మురళీమోహన్, తనికెళ్ల భరణి, నన్నపనేని రాజకుమారి, రోజా రమణి, శివపార్వతి, నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మహానటి' చిత్ర నిర్మాతలు ప్రియాంక దత్, స్వప్న దత్, రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణ కర్త బొల్లినేని కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు.

రవీంద్రభారతి (ఆంధ్రజ్యోతి)

భయపెడుతూనే వాస్తవాన్ని చూపిస్తుంది

- కేఎల్ దామోదర ప్రసాద్



'సాధారణంగా హారర్ థ్రిల్లర్ సినిమాల్లో డ్రామా ఎక్కువగా ఉంటుంది. సినిమాటిక్ లిబర్టీ ఎక్కువ తీసుకుంటారు. మా 'ఈషా'లో కూడా ఆ లిబర్టీ ఉన్నప్పటికీ సినిమా పూర్తయ్యేసరికి ప్రేక్షకులు ఒక పర్సనల్ ఫీల్‌తో బయటకు వస్తారు. భయపెడుతూనే రియాలిటీ చూపించే చిత్రమిది' అని నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ అన్నారు. ఆయన సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రమిది. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. మంచి కథ కోసం చూస్తున్నప్పుడు శ్రీనివాస్ చెప్పిన ఈషా పాయింట్ చాలా ఆసక్తికరంగా అనిపించి, ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టాం. ఈ సినిమా బాధ్యతనంతా దర్శకుడు తన భుజాలపై వేసుకున్నాడు. నా నమ్మకాన్ని నిలబెట్టాడు. అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. హెబ్బాపటేల్, త్రిగుణ్, అఖిల్ రాజ్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు' అని చెప్పారు.

ఆ ఖ్యాతి ఘంటసాలదే!



మధుర గాయకుడు ఘంటసాల జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకున్న 'ఘంటసాల ది గ్రేట్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. గాయకుడు కృష్ణచైతన్య ఘంటసాలగా నటించిన ఈ చిత్రాన్ని సిహెచ్ రామారావు దర్శకత్వంలో సిహెచ్ ఫణి నిర్మించారు. ఇటీవల నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో కృష్ణ చైతన్య మాట్లాడుతూ 'ఘంటసాల పాటలు వింటూ పెరిగిన నాకు ఈ సినిమాలో నటించే అవకాశం దక్కడం ఓ వరం. పాటలు పాడుకొనే నాతో పట్టుబట్టి ఈ వేషం వేయించారు రామారావుగారు' అని అన్నారు. 'భారతదేశ చరిత్రలోనే ఒక గాయకుడి బయోపిక్ రావడం ఇదే ప్రథమం. ఆ ఖ్యాతి ఘంటసాలకే దక్కింది. దాన్ని తీసే అదృష్టం నన్ను వరించింది' అని రామారావు అన్నారు. ఘంటసాల బయోపిక్ విడుదల చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని నిర్మాత శోభారాణి చెప్పారు. ఈ సినిమా మొదటి టికెట్‌ను లక్ష రూపాయలకు నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు కొనడం విశేషం.

క్లిక్ దూరంలో రైతుబజార్లు

ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే నిమిషాల్లోనే ఇంటికి కూరగాయలు

- రైతుబజార్ ధరలకే డోర్ డెలివరీ
- విశాఖలో పైలట్ ప్రాజెక్టు
- డిజి రైతుబజార్ ఏపీ.కామ్ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్
- త్వరలో అందుబాటులోకి యాప్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)





'డిజీరైతుబజార్‌ఏపీ.కామ్' వెబ్‌సైట్

రైతుబజారు నుంచి తాజా కూరగాయలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం ఉంటే.. అక్కడి రేట్లకే ఇంటికే తెచ్చి ఇస్తే.. ఎంత బావుంటుందో కదా.! ఈ ఆలోచనతోనే అటు రైతులకు, ఇటు వినియోగదారులకు కూడా లాభం చేకూర్చడానికి ప్రభుత్వ సహకారంతో 'మాచింట్ సొల్యూషన్స్' అనే సంస్థ ముందుకొచ్చింది. రైతుబజార్లను ఈ-కామర్స్ ప్లాట్‌ఫారంపైకి తీసుకువచ్చింది. బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి సంస్థలు ఎలాగైతే ఆన్‌లైన్‌లో కూరగాయలు, పండ్లను ఆర్డర్ తీసుకొని డోర్ డెలివరీ చేస్తున్నాయో అదే విధానంలో రైతుబజార్ల నుంచి తాజా కూరగాయాలు, పండ్లు, ఇతర నిత్యవసరాలు సరఫరా చేయడానికి మాచింట్ సొల్యూషన్స్ https://digirythubazaarap.com/ అనే వెబ్‌సైట్ రూపొం దించింది. ఆ వెబ్‌సైట్ ఓపెన్ చేస్తే ఆరోజు రైతుబజార్లలో అందుబాటులో ఉన్న వ్యవసాయ ఉత్పత్తులు, వాటి ధరలు కనిపిస్తాయి. నచ్చినవి ఆర్డర్ చేసుకున్న తర్వాత.. నిమిషాల వ్యవధిలోనే వాటిని మాచింట్ సొల్యూషన్స్ సంస్థ డోర్ డెలివరీ చేస్తుంది. వీటికి ఆన్‌లైన్‌లోనే డిజిటల్ చెల్లింపులు చేసుకోవచ్చు. విశాఖపట్నంలోని ఎంవీపీ కాలనీ రైతుబజారులో దీనిని పైలట్ ప్రాజెక్టు కింద వారం రోజుల క్రితం ప్రారంభించారు. రైతుబజారుకు 4 నుంచి 5 కి.మీ. దూరంలో ఉన్న వారి నుంచి ఆర్డర్లు తీసుకొని, డెలివరీ చార్జీలు ఏమీ తీసుకోకుండానే రైతుబజార్ ధరలకే సరుకులు, కూరగాయలు అందిస్తున్నారు. ఇది విజయవంతమైతే ఈ సంస్థతో ఎంవోయూ చేసుకుని మిగిలిన బజార్లకు కూడా ఈ సేవలు విస్తరించాలని వ్యవసాయ మార్కెటింగ్ శాఖాధికారులు యోచిస్తున్నారు. డిజీరైతబజార్ యాప్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నారు. త్వరలోనే అది కూడా అందుబాటులోకి రానుంది.

ప్రచారం కల్పించాలి


డిజీరైతుబజారుఏపీ.కామ్‌లో ఎవరైనా ఆర్డర్ బుక్ చేయగానే మాచింగ్ సొల్యూషన్స్ సంస్థ సిబ్బంది నేరుగా రైతుబజార్‌కు వచ్చి వాటిని రైతుల వద్దనే కొని డబ్బులు చెల్లించి తీసుకువెళుతున్నారు. ప్రస్తుతం రోజుకు పది నుంచి పదిహేను వరకు ఆర్డర్లు వస్తున్నాయి. దీనికి ఇంకా విస్తృత ప్రచారం కల్పించి, యాప్‌ను పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తే బ్లింకిట్, బిగ్‌బాస్కెట్‌లా విజయవంతం అవుతుంది.

- వరహాలు, రైతుబజారు ఎస్టేట్ అధికారి

రేషన్‌లో మళ్లీ రాగులు, జొన్నలు

సీమ జిల్లాల్లో ఏప్రిల్ నుంచే పంపిణీ.. ఇప్పుడు ఉత్తర కోస్తా జిల్లాలకు విస్తరణ

- కొన్ని జిల్లాలకు రాగులు, మరికొన్నింటికి జొన్నలు
- 3 కేజీల వరకు బియ్యం మినహాయించి ఉచితంగానే పంపిణీ



అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం, మారుతున్న ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పోషక విలువలు కలిగిన తృణధాన్యాలను ఉచితంగానే సరఫరా చేస్తోంది. రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, కడప, నంద్యాల జిల్లాల్లో గత ఏప్రిల్ నుంచే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదారతోపాటు రాగులు, జొన్నలు పంపిణీ చేస్తోంది. ఈ డిసెంబరు నెల నుంచి రాగుల పంపిణీని ఉత్తర కోస్తా ప్రాంతంలోని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు విస్తరించింది. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జొన్నల పంపిణీని ప్రారంభించింది. ప్రభుత్వం మనిషికి 5 కేజీల చొప్పున బియ్యాన్ని ఉచితంగానే పంపిణీ చేస్తోంది. ఈ రేషన్‌లో కొంతమేర బియ్యానికి బదులుగా గరిష్ఠంగా 3 కేజీల వరకు రాగులు, జొన్నలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. అంటే ప్రతి నెలా 20 కేజీల రేషన్ బియ్యం తీసుకునే కుటుంబం.. ఇప్పుడు రెండు కేజీల రాగులు మాత్రమే కావాలనుకుంటే.. ఆ మేరకు బియ్యాన్ని మినహాయించుకుని, మిగిలిన 18 కేజీల బియ్యాన్ని, 2 కేజీల రాగులను అందిస్తారు. గతంలోనూ టీడీపీ ప్రభుత్వం ఇదేవిధంగా రేషన్‌కార్డుదారులకు రాగులు, రాగిపిండిని ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసింది. ఇప్పుడు మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరుకుల్లో తృణధాన్యాలను అందించాలని నిర్ణయించింది.

రాష్ట్రప్రభుత్వమే సేకరించి..

అప్పట్లో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వమే ఎఫ్‌సీఐ ద్వారా రాష్ట్రంలో పీడీఎస్ అవసరాలకు సరిపడా రాగులు, జొన్నలను కేటాయించేది. ఇప్పుడు కేంద్రం కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే వాటిని టెండరు ప్రక్రియ ద్వారా ప్రొక్యూర్ చేస్తూ కార్డుదారులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. రాగులు, జొన్నల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతుండటంతో వీటిని దశలవారీగా అన్ని జిల్లాల్లోనూ పంపిణీ చేసేందుకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాట్లు చేస్తోంది.

కల్తీ నెయ్యి కేసులో మరిన్ని అరెస్టులు

- త్వరలో ఐదుగురు టీటీడీ ఉద్యోగులు అదుపులోకి?
- ఈవోకు సమాచారమిచ్చిన సిట్
- మొత్తం 9మందిపై కేసు.. ఇప్పటికే ఒకరి అరెస్ట్



తిరుపతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో మరో ఐదుగురు టీటీడీ ఉద్యోగుల అరెస్టుకు రంగం సిద్ధమైంది. త్వరలో వారిని సిట్ అధికారులు అరెస్టు చేయనున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. టీటీడీ ఉద్యోగుల అరెస్టు గురించి ముందస్తుగా టీటీడీ ఈవోకు సిట్ అధికారులు సమాచారం ఇచ్చారు. కల్తీ నెయ్యి సరఫరా దందాలో భోలే బాబా డెయిరీ ప్రతినిధులకు సహకరించిన ఆరోపణలపై సిట్ అధికారులు టీటీడీకి చెందిన మొత్తం 9 మంది అధికారులు, ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు తొలి దశలో ప్రొక్యూర్‌మెంట్ విభాగానికి చెందిన నాగేంద్రప్రసాద్ (ఏ9), కరమల శేఖర్(ఏ10) అనే ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులను కేసులో నిందితులుగా చేర్చారు. అయితే వారిని ఇంత వరకూ అరెస్టు చేయలేదు. తర్వాత గత నెల 23వ తేదీన ఏకంగా ఏడుగురు టీటీడీ అధికారులు, ఉద్యోగులను కేసులో నిందితులుగా చేరుస్తూ సిట్ అధికారులు నెల్లూరు ఏసీబీ కోర్టులో మెమో దాఖలు చేశారు. ఈ క్రమంలోనే 9 మందిలో ఒకరైన ప్రొక్యూర్‌మెంట్ మాజీ జీఎం సుబ్రమణ్యాన్ని(ఏ29) అరెస్టు చేశారు. కల్తీ నెయ్యి కేసులో అరెస్టు అయిన టీటీడీ తొలి ఉద్యోగి ఆయనే. ప్రస్తుతం ఆయన రిటైర్డ్ అయ్యారు. మిగిలిన నిందితుల్లో ముగ్గురు రిటైర్డ్ కాగా, ఐదుగురు సర్వీసులో ఉన్నారు. తిరుమల గోడౌన్ కీపర్‌గా విధులు నిర్వహించిన డిప్యూటీ ఈవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ పల్లి ఈశ్వర్‌రెడ్డి (ఏ25), గతంలో ప్రొక్యూర్‌మెంట్ జీఎం కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ముద్దు వెంకట అనిల్‌కుమార్ (ఏ26), తిరుపతి గోడౌన్ డిప్యూటీ ఈవోగా పనిచేసి రిటైరైన పోలేపల్లి వెంకట నటేష్‌బాబు (ఏ27), ప్రొక్యూర్‌మెంట్ జీఎంగా పనిచేసి రిటైరైన పేరూరు జగదీశ్వర్‌రెడ్డి (ఏ28), ఈ కేసులో ఫిర్యాదుదారు, ప్రొక్యూర్‌మెంట్ జీఎంగా పనిచేసి రిటైరైన ప్రళయకావేరి మురళీకృష్ణ (ఏ30), టీటీడీ గోశాల డైరెక్టర్‌గా పనిచేసి తొక్కిసలాట ఘటనలో సస్పెండైన మాజీ జీఎం డాక్టర్ కె.హరినాథరెడ్డి (ఏ31) నిందితులుగా ఉన్నారు. మరో ఐదుగురు కూడా టీటీడీకి సంబంధించిన వారే నిందితులుగా ఉన్నప్పటికీ వారు టీటీడీ ఉద్యోగులు కారు. టీటీడీ ఇతర రాష్ట్రాల నుంచీ నియమించుకున్న నెయ్యి సంబంధిత నిపుణులు. రిటైరైన ఉద్యోగులు, అధికారుల అరెస్టు గురించి టీటీడీ ఈవోకు ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన అవసరం సిట్‌కు లేనందున.. త్వరలో జరగనున్న అరెస్టులు ప్రస్తుతం సర్వీసులో ఉన్న వారివే అయ్యే అవకాశముంది. నిందితులు ముడుపులు తీసుకుని అవకతవకలకు పాల్పడినట్టు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి.

నేడు బెజవాడలో 'కథ 2024' పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కథాసాహితి సంకలనాల పరంపరలో 35వది అయిన 'కథ 2024'ను ఆదివారం విజయవాడలో ఆవిష్కరించనున్నట్టు కథాసాహితి సంపాదకుడు వాసిరెడ్డి నవీన్ శనివారం తెలిపారు. సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో సాహిత్య అకాడమి ఈసీ మెంబర్ డాక్టర్ మృణాళిని 'కథ 2024'ను ఆవిష్కరిస్తారని వివరించారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కథాప్రియులందరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమానికి కళాపీఠం అధ్యక్షుడు పి.లక్ష్మణరావు, ప్రముఖ వైద్యుడు ఏవీ గురవారెడ్డి, కథాసాహితి మరో సంపాదకుడు పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు హాజరు కానున్నట్టు తెలిపారు.

కాకాణి 'ఫైల్స్' మిస్సింగ్!

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పెట్టిన ఫోర్జరీ సంతకాల కేసుకు సంబంధించిన ఫైళ్లపై దొంగలు పడ్డారు. అప్పట్లో ఇది చిత్తు కాగితాలు ఏరుకునేవారు చేసిన చిల్లర దొంగతనంగా పోలీసులు లెక్కతేల్చారు. 2014 ఎన్నికల సమయంలో కాకాణిపై నమోదైన కల్తీ మద్యం కేసుకు సంబంధించిన ఫైళ్లలోనూ కీలక డాక్యుమెంట్లు అదృశ్యమైనట్టు తాజాగా వెలుగు చూసింది. 2018 చివర్లోనే విజయవాడలోని ప్రత్యేక కోర్టు ఈ విషయాన్ని గుర్తించింది. అదృశ్యమైన కీలక డాక్యుమెంట్లను తిరిగి భర్తీ చేసే పనిని అప్పట్లో సీఐడీకి అప్పగించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో ఈ కేసును మూలన పడేసింది. ఐదేళ్లు పట్టించుకోలేదు. గతేడాది కూటమి ప్రభుత్వం రావడంతో కేసులో మళ్లీ కదలిక వచ్చింది. ప్రస్తుతం నెల్లూరు సీఐడీ అధికారులు కాకాణి కల్తీ మద్యం కేసుకు సంబంధించి అదృశ్యమైన కీలక డాక్యుమెంట్లను తిరిగి భర్తీ చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. కాకాణి కేసుల్లో ఎవరి ప్రమేయం లేకుండా సాధారణంగా జరిగిన మిస్సింగ్‌లా లేక వ్యూహాత్మకంగా జరుగుతున్న మిస్సింగ్‌లా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

2014 నాటి కేసు

2014 ఎన్నికల సమయంలో సర్వేపల్లి నియోజకవర్గంలో రాజకీయ నాయకులు పంపిణీ చేసిన మద్యం తాగి వందల సంఖ్యలో ఆసుపత్రుల పాలయ్యారు. అప్పట్లో ఇది సంచలనం సృష్టించింది. ఎక్సైజ్ అధికారులు రంగంలోకి మద్యం పంపిణీ చేసిన వారిని పట్టుకొని ప్రశ్నించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మద్యం సరఫరా చేశారని, ఆయన గెలుపుకోసం తాము పంపిణీ చేశామని వారంతా విచారణలో చెప్పారు. దీంతో కాకాణితో పాటు మద్యం పంచిన కార్యకర్తలపై కేసులు నమోదు చేశారు. ఇదే తరహాలో కావలి నియోజకవర్గంలోనూ జరిగింది. అక్కడ వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. ఈ రెండు చోట్ల ఈ ఇద్దరు నాయకుల అత్యంత సన్నిహితులైన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, మన్నెమాల సుకుమార్‌రెడ్డిలపై కూడా కేసులు నమోదయ్యాయి. ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ఈ కేసులను సీఐడీకి అప్పగించింది. సీఐడీ చాలా లోతుగా దర్యాప్తు చేసి, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ గోపాలకృష్ణ అలియాస్ అప్పు ద్వారా కల్తీ మద్యం తెప్పించారని ధ్రువీకరించుకుంది. అతడ్ని అదుపులోకి తీసుకుంది. కల్తీ మద్యానికి ప్రముఖ కంపెనీల లేబుళ్లు అతికించి ప్రజలకు పంపిణీ చేశారని, ఇది చాలా హానికరమైన మద్యమని ల్యాబ్ పరీక్షల ద్వారా నిర్ధారించుకుంది. ఈ ఆధారాలతో పాటు 2017 చివర్లో చార్జిషీట్ వేశారు. నెల్లూరు కోర్టులో కాకాణిపై నాలుగు, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై ఆరు కేసులు ఉన్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 2018లో ప్రజాప్రతినిధులపై ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం విజయవాడలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారు. ఈ కేసులను అక్కడికి బదలాయించారు. ఈ ఫైళ్లను పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఇందులో కీలక డాక్యుమెంట్లు అదృశ్యమయ్యాయని, వాటిని భర్తీ చేసి మళ్లీ సమర్పించాలని ఆ ఏడాది చివర్లో నెల్లూరు కోర్టుకు పంపింది. నెల్లూరు కోర్టు ఆ పనిని ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీఐడీకి అప్పగించింది. ఇంతలో ఎన్నికలు రావడం, 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ఫైలు మూలనపడిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దీనిపై దృష్టి సారించడంతో కదలిక వచ్చింది.



వెంకటాచలంలో కాకాణిపై కేసు

వెంకటాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై శనివారం నెల్లూరు జిల్లా వెంకటాచలంలో కేసు నమోదు చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై కాకాణి పరుష పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేశారని చవటపాలెం సొసైటీ చైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. చంద్రమోహన్‌రెడ్డి దేవదాయ భూములు రూ.కోట్లకు అమ్మేశారంటూ కాకాణి అర్థరహిత విమర్శలు చేశారని, 'వెర్రి పువ్వా నిన్నుకొట్టి చదువు నేర్పిస్తా' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇవీ మిస్సింగ్‌లు..

సీసీ నంబర్: 56-17
- ఏ1 రిమాండ్ రిపోర్టు
- ఏ2 సరెండర్ పిటిషన్
- ఏ6 బెయిల్ బాండ్, రిలీజ్ ఉత్తర్వులు మినహా ఇతర డాక్యుమెంట్లు లేవు
- ఏ7 మెమో, పీటీ వారెంట్‌తో పాటు మిగిలిన పత్రాలు
- ఏ8 బెయిల్ బాండ్, వారెంట్ మినహా ఇతర పత్రాలు లేవు

సీసీ నంబర్: 57
- ఏ6 బెయిల్ బాండ్, వారెంట్ మాత్రమే ఉన్నాయి. క్యాష్‌బాండ్‌తో పాటు మిగిలిన పత్రాలు లేవు
- ఏ7 మెమో
- ఏ8 క్యాష్ బాండ్‌తో పాటు ఇతర పత్రాలు లేవు
- ఏ10 పీటీ వారెంట్ మినహా ఇతర పత్రాలు లేవు

సీసీ నంబరు: 58
- ఏ1 ష్యూరిటీ బాండ్లు
- ఏ3 బెయిల్ బాండ్ రౌండ్ సీల్
- ఏ5 క్యాష్ బాండ్, ఏ6 క్యాష్ బాండ్‌లు

సీసీ నంబరు: 59

ఏ1 బెయిల్ బాండ్, వారెంట్, చార్జిషీట్ నీట్ కాపీ లేవు

- కాకాణి 11వ నిందితుడిగా ఉన్న ఈ కేసుల్లో మిగిలిన నిందితులకు సంబంధించిన ఫైళ్లు అదృశ్యమయ్యాయి. కానీ ఒక్క కేసులో కూడా కా కాణికి సంబంధించిన ఫైల్ ఏదీ మిస్ కాలేదు. కేసును నీరుగార్చేందుకు వ్యూహాత్మకంగానే ఇతర నిందితుల ఫైళ్లను అదృశ్యం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి.
- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నిందితుడుగా ఉన్న కల్తీ మద్యం కేసుల్లోనూ కీలక డాక్యుమెంట్లు అదృశ్యమయ్యాయి.

ఏయూ మాజీ వీసీ ప్రసాదరెడ్డికి హైకోర్టు షాక్

- కోర్టు ధిక్కరణ కేసులో నెలరోజుల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ) మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాదరెడ్డికి హైకోర్టు గట్టిషాక్ ఇచ్చింది. బోటనీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నూకన్న దొరను కొనసాగించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను ఆయన ఉద్దేశపూర్వకంగా ధిక్కరించారని నిర్ధారిస్తూ ప్రసాదరెడ్డికి నెలరోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ప్రసాదరెడ్డి తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు తీర్పు అమలును ఈనెల 22వ తేదీ వరకు సస్పెండ్ చేసింది. అప్పీల్ దాఖలు చేయకున్నా, స్టే రాకపోయినా డిసెంబరు 22న సాయంత్రం 5 గంటల లోపు హైకోర్టు రిజిస్ట్రార్(జ్యుడీషియల్)వద్ద లొంగిపోవాలని ప్రసాదరెడ్డిని ఆదేశించారు. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గతనెల 20న తీర్పు ఇచ్చారు. తీర్పు ప్రతి తాజాగా అందుబాటులోకి వచ్చింది. నూకన్న 2006 జూలైలో ఏయూ సైన్స్ టెక్నాలజీ కళాశాల బోటనీ విభాగంలో నియమితులయ్యారు. కాంట్రాక్ట్ ప్రొఫెసర్‌గా 17ఏళ్ల పాటు సేవలందించారు. అయితే, ఆయనను విధుల నుంచి తొలగిస్తూ 2022 నవంబరు 18న ఏయూ వీసీ ఉత్తర్వులు ఇచ్చారు. దీన్ని సవాల్ చేస్తూ నూకన్న 2023లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి పిటిషనర్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగించాలని నిర్దిష్ట కాలానికి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో నూకన్న వీసీ ప్రసాదరెడ్డిపై కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి.. 'కోర్టు ఉత్తర్వులను యథాతథంగా అమలు చేయడం అధికారుల విధి. వాటికి వక్రభాష్యం చెప్పడానికి వీల్లేదు. కోర్టు ఆదేశాలు చట్టవిరుద్ధంగా ఉంటే అప్పీల్ దాఖలు చేసుకోవచ్చు. అంతేకానీ, తప్పుడు అర్థం చెప్పకూడదు' అని స్పష్టం చేశారు. కోర్టు ఆదేశాలను ప్రసాదరెడ్డి వరుసగా ఉల్లంఘించారని, ఇలాంటి వ్యవహారశైలి చట్టబద్ధ పాలనకు తీవ్ర ప్రతిబంధకమని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల అమలుకు తక్కువ ప్రాధాన్యం ఇచ్చారని, వీసీ బాధ్యతల నుంచి తప్పుకొనేవరకు ఉత్తర్వులను అమలు చేయలేదని, ఇలాంటి వ్యక్తిపై కనికరం చూపితే న్యాయవ్యవస్థకు తీవ్ర నష్టమని స్పష్టం చేశారు.



ఏలూరులో జగన్ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

యాదవులకు జగన్ క్షమాపణ చెప్పాలి

- ఏలూరులో మాజీ సీఎం ఫ్లెక్సీ దహనం

ఏలూరు రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌పై ఏలూరు జిల్లా యాదవ, బీసీ సంఘాల నాయకులు భగ్గుమన్నారు. మాజీ ఐఏఎస్, బీసీ కులానికి చెందిన కృష్ణయ్య యాదవ్, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగన్ యాదవులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఏలూరులోని ఫైర్‌స్టేషన్ సెంటర్లో యాదవ యువ సమితి జిల్లా అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ ఆధ్వర్యంలో జగన్ ఫొటో ఉన్న ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. గోపీనాథ్ జెట్టి, కృష్ణయ్యలను వాడు.. వీడు అంటూ సంబోధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ద్వారకాతిరుమలలో జరిగిన యాదవుల సమావే శంలో సంఘం నేతలు మాట్లాడుతూ జగన్ చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

స్క్రబ్ టైఫస్‌తో మరొకరి మృతి!

- కిడ్నీ వ్యాధివల్లే అంటున్న వైద్యాధికారులు
- ఉమ్మడి కృష్ణాలో 16 మందికి పాజిటివ్
- ఏలూరులో మరొకరికి వ్యాధి నిర్ధారణ

విజయవాడ/ఏలూరు అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ మరణాలు కలకలం సృష్టిస్తున్నాయి. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం ముదునూరుకు చెందిన బుట్టి శివశంకర్ రాజు(42) ఈ వ్యాధి లక్షణాలతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వారం క్రితం తీవ్ర జ్వరం, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న ఆయన మచిలీపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. స్క్రబ్ టైఫస్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు అనుమానం వ్యక్తం చేయడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ నిర్వహించిన పరీక్షల్లో శివశంకర్ రాజుకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. దీంతో ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫాం(ఐహెచ్‌ఐపీ) పోర్టల్‌లో ఆయన పేరు నమోదు చేసి వైద్యాధికారులకు సమాచారం అందించారు. రాజు చికిత్స పొందుతూ శుక్రవారం వేకువజామున మృతిచెందారు. కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ యుగంధర్ మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను విచారించారు. రాజుకు కిడ్నీ సమస్య ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్య రిపోర్టులు పరిశీలించిన తర్వాత రాజు కిడ్నీ వాధితోనే మృతి చెందారని వైద్యాధికారి నిర్ధారించారు. అయితే స్క్రబ్ టైఫస్ మరణాన్ని దాచేందుకే ఇలా చెబుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కాగా, కృష్ణాజిల్లాలో 15, ఎన్టీఆర్ జిల్లాలో ఒకటి చొప్పున స్క్రబ్ టైఫస్ కేసులు నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా జీ.కొండూరు మండలం వెంకటాపురం గ్రామంలో ఓ బాలుడికి లక్షణాలు వెలుగుచూడగా పరీక్షల కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన ఓ వ్యక్తి(35) తాపీపనుల నిమిత్తం రోజూ ఏలూరు రాకపోకలు సాగిస్తుంటాడు. తీవ్ర జ్వరంతో గతనెల 29న నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చేరాడు. చికిత్స అందిస్తున్నప్పటికీ జ్వరం అదుపులోకి రాకపోవడంతో శుక్రవారం రాత్రి ఎలీసా టెస్టు నిర్వహించగా స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన్ను శనివారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీంతో ఈ జిల్లాలో బాధితుల సంఖ్య మూడుకు పెరిగింది.

సామాన్యుల కోసమే సుప్రీం కోర్టు

- లీడర్‌షిప్ సమ్మిట్‌లో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ, డిసెంబరు 6: సుప్రీం కోర్టు అంటే సామాన్యుల కోసం అన్న గట్టి సందేశం పంపాలని భావిస్తున్నానని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. సుప్రీం కోర్టులో సాధారణ వ్యక్తులు వేసే కేసులకు కూడా తగిన చోటు, సమయం ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో శనివారం జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేసుల పరిష్కారం విషయంలో అంచనావేయదగ్గ టైమ్‌లైన్, ఏకీకృత జాతీయ జ్యుడీషియల్ విధానం, పెండింగ్ కేసులపై త్వరిత నిర్ణయం తన తొలి ప్రాధాన్యాలు అని తెలిపారు. పేద వర్గాల ప్రజలకు న్యాయం అందించే విషయంలో వ్యాజ్యాల ఖర్చు తగ్గించడం కూడా తన ప్రాధాన్యాల్లో ఒకటన్నారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతపై మాట్లాడుతూ, న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థల అధికారాలు రాజ్యాంగంలో స్పష్టంగా పొందుపరిచారని చెప్పారు.

కొండారెడ్డి.. చిన్న పిల్లోడా..!

- వైసీపీ విద్యార్థి నాయకుడిపై 6 కేసులు
- 18 ఏళ్లకే విశాఖలో మొదటి ఎఫ్ఐఆర్
- వైసీపీ సర్కారులోనే వరుసగా 3 కేసులు
- అయినా అమాయకుడని జగన్ కవరింగ్
- పొరుగు రాష్ట్రాల్లోనూ డ్రగ్స్ నెట్‌వర్క్
- విశాఖలో నేవీ అధికారుల పిల్లలకూ ఉచ్చు
- కీలకమైన 29 మందిని గుర్తించిన పోలీసులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బైక్ రేసుల నుంచి డ్రగ్స్ సరఫరా వరకూ.. డ్రంకెన్ డ్రైవ్ నుంచి ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వరకూ.. అర డజను కేసుల్లో ఇరుకున్న వ్యక్తి చిన్న పిల్లోడా? ఇలాంటివాడిని వెనకేసుకొస్తూ.. అమాయకుడిపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేయడం మాజీ సీఎం జగన్‌కే సాధ్యమైంది. వైసీపీ విద్యార్థి విభాగం విశాఖపట్నం అధ్యక్షుడు కొండారెడ్డిపై ఏకంగా ఆరు కేసులు నమోదయ్యాయి. అయినా పిల్లోడిపై తప్పుడు కేసులు పెట్టి, అన్యాయంగా అరెస్టు చేశారంటూ తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రెస్‌మీట్ పేరుతో చదివిన స్క్రిప్ట్‌లో జగన్ వాపోయారు. అయితే కొండారెడ్డిపై తన పాలనలోనే మూడేళ్లలో మూడు కేసులు నమోదైన విషయాన్ని మాత్రం ఆయన విస్మరించారు. గ్యాంగ్‌లతో బైకులపై హల్‌చల్ చేస్తూ రేసింగ్‌లు, ర్యాష్ డ్రైవింగ్‌లతో రెచ్చిపోయిన కొండారెడ్డిపై 2021, 2022, 2023ల్లో విశాఖ త్రీటౌన్, భీమిలి, ఆరిలోవ పోలీసుస్టేషన్లలో ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. మొదటి కేసు సమయానికి కొండారెడ్డి వయసు 18 ఏళ్లే. అప్పట్లో వైసీపీ నేతలు పోలీసులపై ఒత్తిడి తెచ్చి అతడ్ని బయటికి తీసుకెళ్లారు.



మాజీ సీఎం జగన్‌తో కొండారెడ్డి

విశాఖ కేంద్రంగా డ్రగ్స్ దందా

గత జూలై 31న విశాఖపట్నం శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలోకి దౌర్జన్యంగా ప్రవేశించిన కొండారెడ్డి, మరో పది మందితో కలసి అక్కడి సిబ్బందిని దుర్భాషలాడుతూ, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశాడు. ప్రిన్సిపల్ రత్నవల్లి ఫిర్యాదుతో ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆగస్టు 29న విజయవాడ పోలీసులు లోహిత్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, ఆర్జాల శ్రీవాత్సవ్‌తో పాటు హవీలా డిలైట్ అనే యువతిపై డ్రగ్స్ కేసు నమోదు చేశారు. విశాఖ కేంద్రంగా కొండారెడ్డి డ్రగ్స్ దందా చేస్తున్నట్లు దర్యాప్తులో బయటపడింది. బెంగళూరు నుంచి సింథటిక్ డ్రగ్స్ తెప్పించి తాను తీసుకోవడంతో పాటు విద్యార్థులకు అలవాటు చేసి భారీగా లాభపడుతున్నట్లు కొండారెడ్డి విచారణలో చెప్పడంతో పోలీసులే షాకయ్యారు. అలాగే విశాఖలో ఇంజనీరింగ్ చదువుతున్న గుడివాడ గీత్‌చరణ్ అక్టోబరులో బెంగళూరు నుంచి సింథటిక్ డ్రగ్స్ తీసుకుని రైల్లో వస్తున్నట్లు ఈగల్ పోలీసులకు సమాచారం అంది ంది. నిఘా పెట్టిన ఈగల్ బృందాలు అక్టోబరు 31న విశాఖ రైల్వే స్టేషన్ బయట గీత్ చరణ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న లైసర్జిక్ యాసిడ్ డైథాల్ అమైడ్(ఎల్ఎస్‌డీ) 48 బోల్ట్స్ ను స్వాధీనం చేసుకున్నారు. తనను కొండారెడ్డి బెంగళూరుకు విమానం టికెట్ బుక్ చేసి పం పాడని, తిరుగు ప్రయాణంలో రైల్లో డ్రగ్స్ తీసుకొస్తున్నానని చెప్పిన చరణ్.. అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాడు. దీంతో కొండారెడ్డి, మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

విద్యార్థులే లక్ష్యంగా...

ఏపీ, తెలంగాణతో పాటు బెంగళూరులోనూ నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న కొండారెడ్డి.. విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ బిజినెస్ విస్తరిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... కొండారెడ్డి నెట్‌వర్క్‌లో కీలకంగా ఉన్న 29 మంది వివరాలు ఇప్పటికే పోలీసులు సేకరించారు. ఈ నెట్‌వర్క్ విస్తరణపై ఈగల్, జిల్లాల పోలీసులు కూపీ లాగుతున్నారు. 'విశాఖపట్నం దేశానికి ప్రధానమైన నేవల్ బేస్. కొండారెడ్డి అక్కడ నేవీ అధికారుల పిల్లల్ని సైతం ఈ ఉచ్చులోకి లాగాడు. డ్రగ్స్‌కు బానిసలైన ఆ పిల్లలు రేపు దేశ భద్రతకు సంబంధించిన రహస్యాలు బయటపెట్టే అవకాశం లేకపోలేదు. ఇది చాలా ప్రమాదకరం' అని సీనియర్ ఐపీఎస్ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ఒక్కొక్కరికి ఒక్కో 'కిక్'!

- ఒక్కో విధంగా లబ్ధి పొందారన్న సిట్
- జోగి రమేశ్ కనుసన్నల్లోనే నకిలీ మద్యం తయారీ
- ఎనిమిది మందిపై చార్జిషీట్ దాఖలు

విజయవాడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాం నుంచి విజయవాడ ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన నకిలీ మద్యం తయారీ కేంద్రం ద్వారా ఒక్కొక్కరు ఒక్కో విధంగా లబ్ధి పొందారని సిట్ పేర్కొంది. ఆ కేంద్రాన్ని అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావు నిర్వహించినప్పటికీ వారి వెనుక మాజీ మంత్రి జోగి రమేశ్ సోదరులు ఉన్నారని తెలిపింది. జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు ముడుపులు భారీగా అందాయంది. నకిలీ మద్యం తయారీపై భవానీపురం(విజయవాడ) ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో సిట్ అధికారులు ఎనిమిది మంది నిందితులపై విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రధాన నిందితులు అద్దేపల్లి జనార్దనరావు(ఏ1), అద్దేపల్లి జగన్మోహనరావు(ఏ2)తో పాటు నకిరికంటి రవి(ఏ4), బాదల్‌దాస్(ఏ7), ప్రదీప్‌దాస్(ఏ8), డి.శ్రీనివాసరెడ్డి(ఏ11), అంగులూరి వెంకట కల్యాణ్(ఏ12), తిరుమలశెట్టి శ్రీనివాసరావు(13)పై మొదటి చార్జిషీటును దాఖలు చేశారు. ఒడిసాకు చెందిన బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్.. అద్దేపల్లి జనార్దనరావు నిర్వహించిన ఏఎన్ఆర్ బార్‌లో పనిచేసేవారు. బెంగళూరు నుంచి బాలాజీ, ఆయన కుమారుడు సుదర్శన్ ఇబ్రహీంపట్నం వచ్చి ఫార్ములా ప్రకారం మద్యం తయారు చేసేవారు. వాటిని 90 ఎంఎల్ ప్లాస్టిక్ సీసాల్లో నింపేవారు. ఆ సీసాలను జనార్దనరావుకు చెందిన బార్‌లో విక్రయించేవారు. అదే సరుకును కొన్ని మద్యం దుకాణాలకూ సరఫరా చేశారు. గన్నవరం మండలం కేసరపల్లిలోని పారిశ్రామికవాడలో ప్లాస్టిక్ సీసాల తయారీ యూనిట్ నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి నకిలీ మద్యాన్ని నింపడానికి అవసరమైన సీసాలు, మూతలను సరఫరా చేశాడు. జగ్గయ్యపేటకు



చెందిన అంగులూరి వెంకట కల్యాణ్, హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు నకిలీ మద్యం సీసాలపై అతికించేందుకు అవసరమైన లేబుళ్లను తయారు చేయించారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన తలారి రంగయ్యతో ఈ లేబుళ్లను డిజైన్, ముద్రణ చేయించారు. ఈ లేబుళ్లను తయారు చేయడానికి రంగయ్యతో శ్రీనివాసరావు, కల్యాణ్ డీల్ కుదిర్చారు. రంగయ్యకు ముద్రించిన లేబుళ్లకు ఈ ఇద్దరే డబ్బులు పంపేవారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

మహిళల ఫిర్యాదుల స్వీకరణకు త్వరలో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శైలజ వెల్లడి

బాపట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం నాలుగు అంకెలతో ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌తోపాటు బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు. శనివారం ఆమె బాపట్లలోని బాలికా సదన్, శిశుగృహ, సఖీ వన్ స్టాప్ సెంటర్, గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలో పనిప్రదేశంలో మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు కమిషన్‌కు వారానికి ఒకటి చొప్పున ఫిర్యాదు వస్తోందని చెప్పారు. సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో మహిళలు, బాలికలకు 24 గంటలూ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఓ మహిళ సమస్యపై అప్పటికప్పుడు ఎస్ఐని పిలిపించి చర్యలకు ఆదేశించారు. తల్లిదండ్రుల అనుమతి లేనిదే గురుకుల పాఠశాల విద్యార్థులను బయటకు పంపరాదన్నారు. విద్యార్థినులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించటం, అనుమానాస్పద వ్యక్తుల ప్రవర్తనపై అప్రమత్తం చేయడంపై కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.

ఎంబీబీఎస్‌లో అమ్మాయిల హవా

- ఈ ఏడాది అడ్మిషన్లలో 60.72 శాతం వారే
- గత రెండేళ్లతో పోల్చితే 3.66% అధికం
- అమ్మాయిలకు 3904 సీట్లు.. అబ్బాయిలకు 2526
- కన్వీనర్ కోటాలో 2617 సీట్లు అమ్మాయిలకే
- మంత్రికి నివేదించిన హెల్త్ వర్సిటీ

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్‌లో 60.72 శాతం అమ్మాయిలు ప్రవేశాలు పొందారు. గత రెండేళ్లతో పోల్చితే 2025-26లో అమ్మాయిల అడ్మిషన్లు 3.66 శాతం పెరిగాయి. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియను ముగించింది. ప్రవేశాలకు సంబంధించిన వివరాలను హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డా.రాధికారెడ్డి మంత్రికి నివేదించారు. 2023-24లో 57.06 శాతం, 2024-25లో 57.96 శాతం, 2025-26లో 60.72 శాతం మంది అమ్మాయిలు ఎంబీబీఎస్ కోర్సులో చేరినట్లు నివేదికలో పొందుపరిచారు. గత ఏడాదితో పోల్చితే అబ్బాయిల ప్రవేశాలు 3.66 శాతం తగ్గాయని మంత్రి తెలిపారు. కన్వీనర్ కోటాలోనే గాక యాజమాన్య కోటాలోనూ అమ్మాయిల ప్రవేశాలే అధికంగా ఉండటం విశేషమన్నారు. ఈ ఏడాది 6,430 ఎంబీబీఎస్ సీట్లకు గాను కన్వీనర్ కోటా కింద అమ్మాయిలు 2,617 సీట్లు, అబ్బాయిలు 1638 సీట్లు పొందారని తెలిపారు. యాజమాన్య కోటాలో అమ్మాయిలు 1287 మంది, అబ్బాయిలు 888 మంది చేరారని తెలిపారు. కన్వీనర్ కోటాలో 61.50 శాతం, యాజమాన్య కోటాలో 59.17 శాతం అమ్మాయిలే సీట్లు దక్కించుకున్నారని వివరించారు.

డల్లాస్ చేరుకున్న లోకేశ్

- ఘన స్వాగతం పలికిన ప్రవాసాంధ్రులు
- నేడు 'తెలుగు డయాస్పోరా'తో భేటీ

(డల్లాస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)


డల్లాస్‌లో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రవాసాంధ్ర మహిళలు, అభిమానులు

ఏపీ విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా చేపట్టిన తన అమెరికా పర్యటనలో భాగంగా శనివారం ఉదయం డల్లాస్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్నారై టీడీపీ శ్రేణులు, కూటమి అభిమానులు ఘన స్వాగతం పలికారు. శనివారం సాయంత్రం (భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి) లోకేశ్ డల్లాస్‌లోని గార్లాండ్‌లో ప్రవాసాంధ్రులను కలుసుకునేందుకు ఏర్పాటు చేసిన 'తెలుగు డయాస్పోరా' సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారు. గత ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేసినందుకు ప్రవాసాంధ్రులకు ఆయన ధన్యవాదాలు తెలిపేందుకు ఈ వేదికను వినియోగించుకోనున్నారు.

రేపటి నుంచి శాన్‌ఫ్రాన్సిస్కోలో..

ఏపీ ఎగుమతులు-దిగుమతుల వాణిజ్యాన్ని బలోపేతం చేసే పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో లోకేశ్ సోమ, మంగళవారాల్లో శాన్‌ఫ్రాన్సిస్కోలో పర్యటిస్తారు. ఆయన పర్యటన ఏర్పాట్లను ఏపీ ఎన్ఆర్‌టీ చైర్మన్ డాక్టర్ వేమూరు రవికుమార్, ఎన్నారై టీడీపీ సమన్వయకర్త కోమటి జయరాం, లోకేశ్ నాయుడు కొణిదెల, రాజా పిల్లి, సతీశ్ మండువ తదితరులు సమన్వయం చేస్తున్నారు.

దృఢ సంకల్పంతో విద్యావ్యవస్థలో మార్పులు

- మంత్రి లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పవన్ అభినందనలు



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని శారదా జెడ్పీ పాఠశాలలో పీటీఎం 3.0కి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మంత్రి లోకేశ్ 'ఎక్స్' వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. దీనిపై పవన్ స్పందించారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో, అధునాతన సదుపాయాలు కల్పించి, పోషకాహారం, నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నేతృత్వంలో, మీరు చేస్తున్న కృషి అభినందనీయమని లోకేశ్‌ను అభినందించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసేలా నిర్వహిస్తున్న మెగా పీటీఎంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు.

అంబేడ్కర్‌కు పవన్ నివాళులు

ప్రపంచంలో అతిపెద్ద రాజ్యాంగం రూపకల్పనలో మూలస్తంభంగా నిలిచిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా హృదయపూర్వకంగా అంజలి ఘటిస్తున్నట్లు పవన్ ప్రకటించారు. అణగారిన వర్గాలకు, మహిళలు, కార్మిక వర్గాలకు చట్టబద్ధమైన హక్కులు లభించడానికి రాజ్యాంగంలో ఆయన పొందుపరిచిన అంశాలే కారణమని గుర్తుచేశారు. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్, ఆయన బృందం పాటించిన విలువల గురించి నేటి తరం తెలుసుకోవాలని, ఆ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని పవన్ ఆకాంక్షించారు.

టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోమియో మందుల్లో 2.21 కోట్లు ఆదా

- సింగిల్ టెండర్‌కు మంత్రి సత్యకుమార్ ఆమోదం



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హోమియో ఆస్పత్రులు, మూడు బోధనాసుపత్రులకు అవసరమైన హోమియో మందుల కొనుగోళ్లలో ఆయుష్ విభాగం రూ. 2.21 కోట్లు మేర ఆదా చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 14 కోట్లు విలువైన హోమియో మందులు కొనడానికి ఆయుష్ విభాగం రెండుసార్లు టెండర్లు పిలిచినా కేరళ ప్రభుత్వానికి చెందిన 'కేరళ హోమియోపతిక్ కోపరేటివ్ ఆర్గనైజేషన్' ఒక్కటే స్పందించింది. మందుల అత్యవసరం దృష్ట్యా కొనుగోలుకు అనుమతించాలని ఆరోగ్య శాఖ, ఆయుష్ విభాగం అధికారులు కోరిన మీదట వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అనుమతి ఇచ్చారు. మంత్రి ఆదేశాల మేరకు టెండర్ వేసిన సంస్థతో చర్చించిన అధికారులు కోట్ చేసిన ధర కంటే 16.88 శాతం తక్కువకు సరఫరా చేసేందుకు ఒప్పించారు. దీని వల్ల మొత్తం కొనుగోళ్లలో రూ. 2.21 కోట్లు ఆదా అవుతుందని, మొత్తంగా 162 రకాల హోమియో మందులు 207 హోమియో ఆస్పత్రులు, మూడు బోధనాసుపత్రులకు సరఫరా అవుతాయని మంత్రి కార్యాలయం వెల్లడించింది. ధరలు తగ్గించేలా చర్చలు జరిపిన ఆయుష్ డైరెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులను మంత్రి అభినందించారు. గత ప్రభుత్వం హయాంలో ఇదే కంపెనీ కర్ణాటకకు సరఫరా చేసిన ధర కంటే 13 శాతం అధిక ధరకు మనకు సరఫరా చేసిందని అధికారులు చెప్పారు.

మన ఎంపీలు మహాబుద్ధిమంతులు: షర్మిల

- పార్లమెంటులో రాష్ట్ర ప్రయోజనాల కోసం అల్లరి చేయరని ఎద్దేవా


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్ షర్మిల

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'మన రాష్ట్రం నుంచి ఎన్నికైన 25 మంది లోక్‌సభతో సహా రాజ్యసభ సభ్యులు మహా బుద్ధిమంతులు, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో అల్లరి చేయరు. ప్రధాని మోదీని ప్రసన్నం చేసుకోవడానికి ప్రశంసలు కురిపించడంలో మాత్రం గట్టిగా పోటీ పడతారు' అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆక్షేపించారు. శనివారం ఆమె ఏపీసీసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లోనూ రాష్ట్ర ప్రయోజనాలకోసం ఎలాంటి డిమాండ్లు చేయకుండా రాష్ట్ర ఎంపీలందరూ బుద్ధిగా కూర్చుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ మాట్లాడితే పోటీ పడుతూ రాష్ట్ర ఎంపీలందరూ చప్పట్లు కొడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన హామీల్లో అత్యంత ముఖ్యమైన ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఖనిజ గనుల కేటాయింపు వంటి వాటిపై కేంద్రంపై రాష్ట్ర ఎంపీలు ఒత్తిడి చేయడం అటుంచి, ప్రస్తావనే తేవడం లేదని ఆక్షేపించారు. పేరుకు మాత్రమే వైసీపీ, కూటమి వేర్వేరు పార్టీలైనా.. పార్లమెంటులో ఈ రెండు రాజకీయపక్షాలూ ఏక విధానాన్నే అవలంబిస్తున్నాయని షర్మిల విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే ఎంపీలకు సొంత ప్రయోజనాలే ముఖ్యంగా కనిపిస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్రాన్ని నిధులు కోరుదాం!

- 9న పోలవరం-నల్లమలసాగర్‌పై చంద్రబాబు సమీక్ష
- ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడంపై దిశానిర్దేశం
- 11వ తేదీన రబీ వాటర్ పాలసీపై చర్చ
- ఉద్యాన పంటలకు సాగునీరు అందించడంపై దృష్టి

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలవరం-నల్లమలసాగర్ అనుసంధాన పథకం కోసం కేంద్రాన్ని నిధులు కోరేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సిద్ధమయ్యారు. ఈ ప్రాజెక్టుకు రూ.58,700 కోట్ల వ్యయంతో జలవనరుల శాఖ అంచనా వేసింది. డీపీఆర్ కోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లు కోరుతూ టెండర్లు పిలిచింది. ఈ నెల 11వ తేదీలోగా బిడ్లు దాఖలు చేసేందుకు గడువు ఇచ్చింది. ఇప్పటికే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం కోసం ప్రీ ఫీజుబిలిటీ నివేదికను రూ.81,900 కోట్లతో జలవనరుల శాఖ కేంద్ర జల సంఘానికి పంపింది. ఈ నివేదికపై ఎగువ రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీంతో పోలవరం-బనకచర్ల పథకానికి బదులుగా పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టును రూ.58,700 కోట్లకు కుదించారు. ఈ పథకానికి సహకరించాలంటూ ఇటీవల అమరావతి పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా అభ్యర్థించారు. ఇక పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తి చేశాక గోదావరి జలాలను ఉత్తరాంధ్ర చివరి గ్రామాల దాకా తీసుకువెళ్తామని పేర్కొన్నారు. గోదావరి-నల్లమల సాగర్ పథకానికి కేంద్ర ప్రభుత్వం సహకరించి నిధులు ఇవ్వాలని లిఖితపూర్వకంగా అభ్యర్థించారు. 9వ తేదీన ఈ అంశంపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి, కృష్ణా డెల్టా విభాగం ఇంజనీరింగ్ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షిస్తారు. ఈ సమీక్షలో పోలవరం-నల్లమలసాగర్‌ను ముందుకు తీసుకువెళ్లడంపై సీఎం స్పష్టత ఇస్తారు. ఇదే సమయంలో ఇప్పటికే తయారు చేసిన పోలవరం-బనకచర్ల ప్రీ ఫీజుబిలిటీ నివేదికలో పేర్కొన్న విధంగా హైడ్రాలజీ నివేదికకు ముందస్తుగా సీడబ్ల్యూసీ నుంచి అనుమతి పొందేలా కృషి చేయాలని జలవనరుల శాఖను ఆదేశించనున్నారు. ఈ నివేదిక వచ్చాక పోలవరం-నల్లమలసాగర్ హైడ్రాలజీ నివేదికకు సీడబ్ల్యూసీ సమ్మతి తెలిపేలా ప్రయత్నాలు చేయనున్నట్టు జలవనరుల శాఖ వర్గాలు చెప్పాయి. పోలవరం-నల్లమలసాగర్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా పట్టుదలతో ఉన్నారని చెబుతున్నాయి. కాగా ఈ నెల 11వ తేదీన రబీ వాటర్ పాలసీపై జల వనరులు, వ్యవసాయ, ప్రణాళికా శాఖ అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించనున్నారు. శనివారం ఈ శాఖల ఉన్నతాధికారులకు ఈ మేరకు సమాచారం పంపారు. రబీలో సాగు జలాలపై సమీక్షిస్తారు. అదేవిధంగా ఈ సమావేశంలో రబీ వాటర్ పాలసీని ఖరారు చేయనున్నారు. ఉద్యాన పంటలకు సాగు నీరు అందించేందుకు వీలుగా రిజర్వాయర్లు, చెరువులను నింపడం, భూగర్భ జలాల మట్టాలను పెంచడం వంటి చర్యలు చేపట్టడంపై సీఎం సూచనలు చేయనున్నట్టు అధికారులు వివరించారు.

గవర్నర్‌తో సీఎం మర్యాదపూర్వక భేటీ


లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయిన సీఎం చంద్రబాబు

2 గంటలపాటు సాగిన సమావేశం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం 6.30 గంటలకు లోక్‌భవన్‌కు చేరుకున్న సీఎం సుమారు 2 గంటలకుపైగా గవర్నర్‌తో సమావేశమయ్యారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌తోపాటు పలు అంశాలను సీఎం ఆయనకు వివరించారు. రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్పు చేసిన తర్వాత తొలిసారిగా వచ్చిన సీఎం.. అమరావతిలో నిర్మాణం చేయనున్న లోక్‌భవన్‌కు సంబంధించిన టెండర్లకు ఇటీవల జరిగిన సీఆర్డీయే అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు.

సెంటిమెంట్‌పై సెటిల్‌మెంట్లా?

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. "దొంగతనం చేసిన వ్యక్తి డబ్బులు వెనక్కి కట్టాడు కదా.. తప్పేముందని జగన్ అత్యంత అనైతికంగా వాదిస్తున్నారు. దేవుడి సొమ్మును చోరీ చేస్తే అది కూడా తప్పుకాదన్నట్లు సమర్థించేవారిని ఏమనాలి?. తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రతి అంశం భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉంది. అలాంటి సున్నితమైన అంశాలను కూడా సెటిల్ చేశామన్నట్లు తేలిగ్గా మాట్లాడుతుండటం దారుణం." అని చంద్రబాబు అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు..

"రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. నెల్లూరు, విజయనగరం వంటి జిల్లాలు ప్రశాంతతకు మారుపేరుగా ఉండేవి. అక్కడ ఎలాంటి అధికారిని ఎస్పీగా నియమించినా సరిపోయేది. కానీ గత పాలకుల వల్ల ఈ జిల్లాల్లో కూడా నేరస్థులు తయారయ్యారు. నెల్లూరు లాంటి చోట లేడీ డాన్లను తయారుచేశారంటే .. ఐదేళ్లలో ఎలాంటి పాలన సాగిందో అర్థం చేసుకోవచ్చు. అన్నింటినీ ప్రక్షాళన చేసుకుంటూ వస్తున్నాం. నేరస్థులను ఏరివేస్తాం. రౌడీలను అణచివేస్తాం. కూటమి అధికారంలోకి వచ్చేనాటికి, ఇప్పటికీ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది."

కొందరికి కడుపు మండుతోంది

"రాజధాని రైతులు, రాజధాని నిర్మాణ అంశాలపై సమస్యలన్నీ పరిష్కరిస్తున్నాం. రాజధాని రైతులతో నేను సమావేశమయ్యాక మంచి ఫలితాలు వస్తున్నాయి. రెండో దశ భూసమీకరణకు కూడా రైతులు సంతోషంగా ముందుకొస్తున్నారు. ఇది మంచి పరిణామం. కానీ, రాజధాని రైతులు, ప్రభుత్వం సంతోషంగానే ఉండటం కొందరికి కడుపు మంట గా ఉంది. తెలంగాణలోని హైటెక్ సిటీ, కోకాపేట వంటి ప్రాంతాలు ఒకప్పుడు కొండలు. ఆ కొండల్లో ఇప్పుడు రూ.కోట్ల వాన కురుస్తోంది. భవిష్యత్తులో అమరావతి అంతకుమించి అభివృద్ధి చెందుతుంది."

విద్యార్థులకూ పార్టనర్‌షిప్ సమ్మిట్

"మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) అనేది ఒక బ్రాండ్‌గా మారింది. విద్యాశాఖలో తీసుకొస్తున్న మార్పులు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఈ కార్యక్రమాల్లో మండల స్థాయి పార్టీ నాయకులు భాగస్వాములు కావాలి. పిల్లలను కూడా ప్రోత్సహించాలి. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలను ప్రోత్సహించేందుకు 'స్కూల్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్' పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీన్ని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ భాగస్వామ్యంతో నిర్వహించనున్నాం. విదేశాల్లో చదవాలని ఆశపడే విద్యార్థులకు 4 శాతం వడ్డీతో రుణాలు ఇస్తాం."

తప్పుడు కేసులు కోర్టుల్లో నిలబడవు

- సీఎంగా ఉన్నంత మాత్రానే కొట్టేయరు
- జిల్లా కమిటీల జాప్యంపై చంద్రబాబు సీరియస్
- 13 లోగా పూర్తిచేయాలని నేతలకు ఆదేశం


దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

"కక్ష పూరితంగా, ఆధారాలు లేకుండా, చట్ట నిబంధనలను పాటించకుండా పెట్టిన తప్పుడు కేసులు న్యాయస్థానాల్లో నిలబడవు. సీఎం హోదాలో ఉన్నంత మాత్రాన కేసులు కొట్టివేయడం సాధ్యం కాదు." అని పార్టీ నేతలతో సీఎం చంద్రబాబు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు అందుబాటులో ఉన్న నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తనపై వైసీపీ హయాంలో పెట్టిన కేసులను న్యాయస్థానాలు కొట్టివేయడంపై వైసీపీ నేతలు విమర్శలు చేస్తుండటంపై చంద్రబాబు స్పందించారు. "వైసీపీ హయాంలో నాపై ఆధారాలు లేకుండా.. చట్టనిబంధనలను పాటించకుండా తప్పుడు కేసులు పెట్టారు. సీఎం హోదా వల్లే కేసులు కొట్టి వేస్తే జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఆయనపై ఉన్న కేసులనూ కొట్టి వేయించుకోవచ్చు కదా! జగన్ నెలకోసారి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లిపోతారు. విజ్ఞత కోల్పోయి జగన్ చేస్తున్న విమర్శలపై స్పందించాల్సిన అవసరం లేదు. అయితే జగన్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మాత్రం ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది." అని చంద్రబాబు అన్నారు. కాగా, జిల్లా కమిటీల ఏర్పాటులో జాప్యంపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. త్రీమెన్ కమిటీలను రాష్ట్ర పార్టీ కార్యాలయానికి పిలిపించి, ఇక్కడి నుంచే ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ జిల్లా కమిటీ సభ్యుల ఎంపికను ఈ నెల 13వ తేదీలోపు పూర్తయ్యేలా చూడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలను స్ఫూర్తిగా తీసుకుని టీడీపీ క్యాడర్‌ను సిద్ధాంతపరంగా బలంగా తయారుచేసుకోవాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా క్యాడర్ శిక్షణ తరగతులను నిర్వహించాలన్నారు. ఏ గ్రామంలో ఏ కులం వారు ఎంత మంది ఉన్నారనే వివరాలు సేకరించి, వాటి ఆధారంగా పార్టీ, నామినేటెడ్ పదవుల భర్తీ జరపాలన్నారు. బోయ, వడ్డెర వంటి కులాలకు పదవుల్లో తగిన ప్రాధాన్యత లేదని, అలాంటి కులాల నుంచి నాయకత్వాన్ని తయారు చేయాలన్నారు. ఎమ్మెల్యేల పనితీరు చాలా వరకు మెరుగుపడిందని, ఇంకా 37 మంది ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాల్సి ఉందన్నారు.

పరకామణిలో తప్పు చేశా

ప్రాయశ్చిత్తంగానే స్వామికి 90శాతం ఆస్తి రాసిచ్చా

- కొందరి ఒత్తిళ్లతోనే డబ్బులు, ఆస్తి ఇచ్చానంటున్నారు
- నన్ను బ్లాక్‌మెయిల్ చేసిన కొంతమందిపై కేసులు పెట్టా
- తొలిసారిగా స్పందించిన నిందితుడు రవికుమార్
- ఎలాంటి వైద్య పరీక్షలకైనా సిద్ధమేనని వెల్లడి



తిరుమల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి దొంగతనం కేసులో నిందితుడు రవికుమార్ తొలిసారిగా స్పందించారు. పరకామణిలో తాను తప్పు చేశానని, దానికి ప్రాయశ్చిత్తంగానే స్వామికి తన ఆస్తిని రాసిచ్చానంటూ శనివారం ఓ వీడియో విడుదల చేశారు. 'నేను పెద్దజీయర్ స్వామి మఠంలో కొంతకాలంగా గుమస్తాగా పనిచేస్తున్నా. కేబుల్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు కూడా ఉన్నాయి. 2023 ఏప్రిల్ 29న పరకామణిలో ఒక తప్పు చేశాను. దాన్ని నేను, నా కుటుంబం మహాపాపంగా భావించాం. దానికి ప్రాయశ్చిత్తంగా నా ఆస్తిలో 90శాతం స్వామి వారికి ఇవ్వాలని నిర్ణయించి రాసిచ్చాం. కానీ కొందరి ఒత్తిళ్లతోనే నేను డబ్బులు, ఆస్తి ఇచ్చానంటూ ఏవేవో మాట్లాడుతున్నారు. నా ఆస్తిని నేను స్వామికి ఇవ్వడానికి ఎవరికో ఎందుకు ఇస్తాను చెప్పండి. ఈ విషయంలో నన్ను కొంతమంది బ్లాక్‌మెయిల్ చేశారు. వారిలో కొంతమందిపై కేసులు కూడా పెట్టాను. నా శరీరంలోని ప్రైవేట్ భాగాల్లో శస్త్రచికిత్సలు చేసుకున్నానంటూ అసభ్యకరంగా మాట్లాడుతున్నారు. రెండు, మూడేళ్లుగా నేను, నా భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు మనోవేదన చెందుతూనే ఉన్నాం. ఈ రోజుకీ ఆ బాధ నుంచి కోలుకోలేకపోతున్నాం. ఈ విషయంపై డిబేట్లు పెట్టి మా గురించి అసభ్యంగా మాట్లాడుకోవడాన్ని తీసుకోలేకపోతున్నాం. న్యాయస్థానం నాకు ఎలాంటి వైద్య పరీక్షలు నిర్వహించినా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నా. నాపై వస్తున్నవన్నీ వాస్తవాలు కావు. దయచేసి అర్థం చేసుకోండి. తలుచుకుంటే ఎంత మహాపాపం చేశానో అనిపిస్తోంది' అంటూ కంటతడి పెట్టుకుంటూ వీడియో విడుదల చేశారు. కేసు విచారణ పూర్తయిన క్రమంలో రవికుమార్ స్పందించడం చర్చనీయాశంగా మారింది.

దేవుడి సొమ్ము చోరీ చిన్న విషయమా?

- కేవలం 9 నోట్లు చోరీ చేస్తేనే రూ.14 కోట్లకు రాజీ చేశారా?
- జగన్‌రెడ్డి ఎప్పటికీ మాఫియా నాయకుడిగానే ఉంటారు
- జీవితంలో రాజకీయ నాయకుడిగా ఎదగలేరు: మంత్రి ఆనం



అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కోట్లాది మంది కొలిచే తిరుమల వెంకన్న పరకామణి చోరీ విషయాన్ని చిన్న దొంగతనంగా.. చిన్న విషయంగా మాజీ సీఎం జగన్ పేర్కొనడంపై దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం 9 నోట్లు దొంగతనం చేస్తేనే రూ.14 కోట్లకు రాజీ చేశారా? అని ప్రశ్నించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని, మాఫియాలను పెంచి పోషించి, దొంగల ముఠాలతో రాష్ట్రాన్ని పాలించిన వ్యక్తి.. కూటమి ప్రభుత్వంపై మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. దొంగ చేతికి అధికారం ఇస్తే ఏమవుతుందో చెప్పేందుకు జగన్ పాలనే ఉదాహరణ అని అన్నారు. వెంకటేశ్వర స్వామి అంటే నమ్మకం లేని వారిని తీసుకొచ్చి తిరుమలలో అందలం ఎక్కించి, తిరుమల పవిత్రతను దిగజార్చారని, భక్తులు నమ్మకంతో ముడిపడిన పరకామణి హుండీల్లో దొంగతనాలు చేయించారని విమర్శించారు. రవికుమార్ కేవలం 72 వేల రూపాయలు దొంగతనం చేస్తే రూ.14 కోట్లు ఎలా రాసిచ్చాడని, వందల కోట్ల ఆస్తులను వైసీపీ నేతలు తమ పేరిట ఎలా రాయించుకున్నారని ప్రశ్నించారు. దేవుడి సొమ్మును దొంగలు దొంగలు పంచుకున్నారని అన్నారు. జగన్ రెడ్డి ఎప్పటికీ మాఫియా నాయకుడిగానే ఉంటారని, జీవితంలో రాజకీయ నాయకుడిగా ఎదగలేడని ఆనం వ్యాఖ్యానించారు. 'కల్తీ మద్యంతో ప్రజలను దోచుకున్నారు. ఇసుక, ఇతర ఖనిజాల పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్నారు. చివరికి దేవుడినీ వదలకుండా దోచేశారు' అని అన్నారు.

'పరకామణి' లెక్క తేలాల్సిందే!

- చోరీ ఎంతన్నది కాదు.. దేవుడి సొమ్ము ఎంతైనా తప్పే
- కేసు రాజీ వెనుక వందల కోట్ల లావాదేవీలు: మాధవ్

అమరావతి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'తిరుమల పరకామణిలో ఎంత చోరీ జరిగిందన్నది కాదు.. అది దేవుడి సొమ్ము.. అలాంటి దొంగతనం కేసు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడాన్ని మా పార్టీ వ్యతిరేకిస్తోంది' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. డాలర్ల చోరీ కేసు రాజీ వెనుక వందల కోట్ల వ్యవహారం ఉందని, దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరగాలని, బాధ్యులకు కఠిన శిక్ష పడాల్సిందేనన్నారు. విజయవాడలో శనివారం ఆయన్ను కలిసిన విలేకర్లు పరకామణి కేసు, కల్తీ లడ్డూ వ్యవహారాలపై మాజీ సీఎం జగన్ వ్యాఖ్యల్ని ప్రస్తావించారు. దీనిపై మాధవ్ స్పందిస్తూ.. ఈ వ్యవహారాల్లో వాస్తవాలు వెలికి తీసి చట్టపరంగా బాధ్యులను జైలుకు పంపడంలో ఎన్డీయే ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. అంతకుముందు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, బీజేపీ రాష్ట్ర నేతలు నాగోతు రమేశ్ నాయుడు, వల్లూరు జయప్రకాశ్ నారాయణ, పాతూరి నాగభూషణం, అడ్డూరి శ్రీరామ్ తదితరులతో కలిసి 'అటల్ సందేశ్ యాత్ర' పోస్టర్, లోగోను మాధవ్ ఆవిష్కరించారు. ఈనెల 11న సత్యసాయి జిల్లా ధర్మవరంలో వాజపేయీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, అన్ని జిల్లాల్లోనూ బస్సు యాత్ర చేపట్టనున్నట్లు చెప్పారు. 'అటల్ ఆశయం.. మోదీతో సుసాధ్యం' అంటూ 26 జిల్లాల్లో వాజపేయీ విగ్రహాలను ఆవిష్కరించి, దేశం కోసం ఆయన చేసిన సేవల్ని ప్రజలకు వివరిస్తామన్నారు. 25న వాజపేయీ శతజయంతి సందర్భంగా అమరావతిలో సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్‌తో పాటు కూటమి పార్టీల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని మాధవ్ అన్నారు. 'విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నిలబెట్టింది కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వాలే. స్టీల్ ప్లాంట్‌ను తమ హయాంలోనే నిలబెట్టామన్న జగన్ చెప్పేది నిజమైతే.. కడప స్టీల్ ప్లాంట్‌ను ఎందుకు నిలబెట్టలేకపోయారు' అని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రశ్నించారు.

నెలాఖరులోగా 'నీరు-చెట్టు' చెల్లింపులు

- ఇప్పటికే జాప్యంపై చంద్రబాబు సీరియస్

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకం కింద 2014-19లో చేసిన పనులకు సంబంధించిన బకాయిల విడుదలలో జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నీరు-చెట్టు, ఉపాధి హామీ సెల్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెల్ సభ్యులు బకాయిల తాజా పరిస్థితిని సీఎంకు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది సెప్టెంబరు వరకు సుమారు రూ.800 కోట్ల నీరు-చెట్టు బకాయిలను చెల్లించిందని, ఇంకా రూ. 201.71 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని సీఎంకి తెలిపారు. ఉమ్మడి చిత్తూరులోనే అత్యధికంగా రూ.70 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా, అనంతపురంలో రూ.27 కోట్లు, నెల్లూరులో రూ.20 కోట్లు, కడపలో రూ.17 కోట్లు, కర్నూలులో రూ.17 కోట్లు, విశాఖపట్నంలో రూ.18 కోట్లు ఉన్నాయని తెలిపారు. మరో రూ.76కోట్లు జీఎస్టీ సమస్యల కారణంగా ఆగాయని సెల్ సభ్యులు సీఎంకి తెలిపారు. బకాయిల చెల్లింపునకు రూ.245 కోట్లు సిద్ధంగా ఉన్నా, అధికారుల అలసత్వం కారణంగా చెల్లింపులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని సీఎంకు వివరించారు. దీనిపై సీరియస్ అయిన చంద్రబాబు... ఈ నెలలో జరగాల్సిన క్యాబినెట్ సమావేశానికి ముందే సంబంధిత అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సెల్ సభ్యులను ఆదేశించారు. ఉపాధి హామీ నిధుల బకాయిలకు సంబంధించి రూ.211 కోట్లను ఈ నెలాఖరులోగా చెల్లించేలా తగిన చర్యలు తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. మరో రూ.67 కోట్లకు సంబంధించి కేంద్రంతో మాట్లాడుతున్నామని, వాటినీ వీలైనంత త్వరగా విడుదల చేయించేలా చూస్తామని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త సత్యారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.

భారత్ జట్టు విజయంపై సీఎం హర్షం

విశాఖపట్నంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు విజయం సాధించడంపై సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ అద్భుతమైన ప్రదర్శన చేశారని, ఈ సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

టీడీపీ కార్యాలయానికి బీజేపీ చీఫ్ మాధవ్

- వాజపేయి శతజయంతి ఉత్సవాలకు రావాలని సీఎంకు ఆహ్వానం

అమరావతి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శతజయంతిని పురస్కరించుకుని ఈ నెలలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించేందుకు పార్టీ సీనియర్ నాయకుడు పాతూరి నాగభూషణంతో కలిసి మాధవ్ వచ్చారు. విజయవాడలో వాజపేయి శతజయంతిని భారీ ఎత్తున నిర్వహించడానికి నిర్ణయించామని, ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కూడా ఆహ్వానించనున్నామని మాధవ్ సీఎంకు తెలిపారు. విజయవాడలో వాజపేయి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా మాధవ్ సీఎంను కోరారు. సీఎం స్పందిస్తూ.. ఏదైనా పార్కులో విగ్రహం ఏర్పాటు చేసి, వాజపేయి పేరు పెడితే బాగుంటుందని, విజయవాడలో ఏ పార్కు బాగుంటుందో ఎంపిక చేసి తనకు తెలియజేయాలని మాధవ్‌కు సూచించారు.


టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న బీజేపీ చీఫ్ మాధవ్, ఆ పార్టీ సీనియర్ నేత పాతూరి నాగభూషణం, నాయకులు

ఆగని ఇండిగోల

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ శనివారం ఆదేశాలు జారీ చేసింది. విమానయాన సంస్థలు అంతరాయాల సమయంలో అసాధారణంగా చార్జీలు పెంచేయడం అవకాశవాదమని, దీనిని సీరియస్‌గా తీసుకుంటున్నామని పేర్కొంది. చార్జీలు సాధారణ స్థితికి వచ్చే వరకు లేదా తిరిగి సమీక్షించి నిర్ణయించే వరకు ఈ నియంత్రణలు అమల్లో ఉంటాయని.. అన్ని విమానయాన సంస్థలు తప్పనిసరిగా ఈ పరిమితులను పాటించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను ఉల్లంఘించే సంస్థలపై వెంటనే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించింది. అయితే ఈ ధరలు బిజినెస్ క్లాస్, ఉడాన్ సీట్లకు వర్తించవు. ఇండిగో విమానాల రద్దుతో ఎయిరిండియా, స్పైస్‌జెట్ సంస్థల చార్జీలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అప్పటికప్పుడు కొనుగోలు చేసే టికెట్ల ధరలను చూస్తే.. సాధారణ సమయంలో హైదరాబాద్-ముంబై (630 కి.మీ) విమాన చార్జీ రూ.20వేల వరకు ఉంటే.. ఇప్పుడు రూ.70వేలకుపైగా వసూలు చేస్తున్నారు. హైదరాబాద్-ఢిల్లీ (1,300 కి.మీ) ప్రయాణానికి రూ.90 వేలకుపైన తీసుకుంటున్నారు.

మరో 800కుపైగా విమాన సర్వీసులు రద్దు

ఇండిగో శనివారం దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల నుంచి నడిచే 800కుపైగా సర్వీసులను రద్దు చేసింది. అందులో బెంగళూరు నుంచి 124 సర్వీసులు, ముంబై నుంచి 109, ఢిల్లీ నుంచి 106, హైదరాబాద్ నుంచి 144 సర్వీసులు ఉన్నట్టు విమానయాన వర్గాలు తెలిపాయి. ఇండిగో రోజూ సుమారు 2,300 సర్వీసులు నిర్వహిస్తుంది. శుక్రవారం కేవలం 700 సర్వీసులు మాత్రమే నిర్వహించి, 1,600కిపైగా సర్వీసులను రద్దు చేసింది. పైలట్లకు ఫ్లైట్‌డ్యూటీ, విశ్రాంతికి సంబంధించిన రెండో దశ నిబంధనల (ఎఫ్‌డీటీఎల్) అమలు నుంచి ప్రభుత్వం ఇండిగోకు తాత్కాలికంగా వెసులుబాటు ఇవ్వడంతో.. శనివారం విమానాల రద్దు సంఖ్య తగ్గింది. అయితే, ఈ వెసులుబాటుపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్(ఆల్పా) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది లక్షలాది మంది ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొంది. ఈ క్రమంలో 'ఎఫ్‌డీటీఎల్' నిబంధనల నుంచి ఇచ్చిన ఉపశమనం పరిమితం, తాత్కాలికమేనని.. ఇది ఇండిగో ఏ320 విమానాలకు మాత్రమే వర్తిస్తుందని పౌర విమానయాన శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు, ఇండిగో విమానాల రద్దుతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో అలజడి నెలకొంది. వేలాది మంది ప్రయాణికులతోపాటు ఎక్కడ చూసినా లగేజీ బ్యాగులే కనిపిస్తున్నాయి. పలుచోట్ల ప్రయాణికులు ఇండిగో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. ఇక, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు కూడా అడ్డగోలుగా చార్జీలు పెంచాయి. రూ.1,500 లోపు ఉండే చార్జీని.. రూ.5వేల దాక వసూలు చేస్తున్నారు.



ముంబై ఎయిర్‌పోర్టులో సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం



వారాణసీ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయిన ప్రయాణికులు

ఎకానమీ క్లాస్‌లో దేశీయ ప్రయాణాలకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ విమాన చార్జీలు

- 500 కి.మీ. దూరం వరకు రూ.7,500
- 500-1000 కి.మీ. మధ్య రూ.12 వేలు
- 1000-1,500 కి.మీ. మధ్య రూ.15 వేలు
- 1,500 కి.మీ. దూరం దాటితే రూ.18 వేలు

ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు

విమానాలు రద్దయిన ప్రయాణికులకు టికెట్ చార్జీల రీఫండ్‌ను ఆదివారం రాత్రి 8 గంటలకల్లా పూర్తి చేయాలని ఇండిగోను పౌర విమానయాన శాఖ ఆదేశించింది. ఒకవేళ సదరు ప్రయాణికులు రీషెడ్యూల్ చేసుకుంటే ఎలాంటి చార్జీలు విధించవద్దని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ప్రత్యేకంగా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రయాణికుల లగేజీని 48గంటల్లో వారికి అప్పగించాలని ఆదేశించింది. కాగా, ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్‌కు డీజీసీఏ నోటీసులు జారీ చేసింది.

శంషాబాద్ నుంచి ఏపీ, బెంగళూరుకు బస్సులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభంతో చిక్కుకుపోయిన వారిని స్వస్థలాలకు తరలించేందుకు శంషాబాద్ విమానాశ్రయం నిర్వహణ సంస్థ జీఎంఆర్ చర్యలు చేపట్టింది. తెలంగాణ ఆర్టీసీ సహకారంతో విమానాశ్రయంలోని పిల్లర్ నంబర్ 8 వద్ద నుంచి ప్రత్యేక స్లీపర్ బస్సులను నడుపుతున్నట్టు తెలిపింది. ఒక్కొక్కరికి చెన్నైకు రూ.2,110, బెంగళూరుకు రూ.1,670, రాజమండ్రి, వైజాగ్, కాకినాడ వంటి ప్రాంతాలకు రూ.1,800 చార్జీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైళ్లకు రద్దీ పెరిగింది. ఈ క్రమంలో ప్రధాన ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనపు బోగీలను జత చేస్తున్నారు. మొత్తంగా 84 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని, 37 రైళ్లకు 116 అదనపు కోచ్‌లను జత చేశామని రైల్వేశాఖ శనివారం ప్రకటించింది.

గుత్తాధిపత్యమే దెబ్బతీసిందా?

2014లో, ప్రస్తుతం విమానయాన వాటాలను పోలుస్తూ విమర్శలు

న్యూఢిల్లీ, డిసెంబరు 6: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విమాన ప్రయాణికులు అల్లాడుతుండటానికి గుత్తాధిపత్యమే కారణమైందా? మూడింట రెండొంతుల వాటా కేవలం ఒక్క సంస్థ చేతిలోనే ఉండటం ఇబ్బందికరంగా మారిందా? ప్రైవేటు విమానయానంలో పోటీ తగ్గి సమస్యకు దారితీసిందా.. దేశంలో పౌర విమానయానం అతలాకుతలం కావడానికి ఇవే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2014లో దేశ పౌర విమానయాన రంగంలో నాలుగు సంస్థలు ప్రధాన వాటాను పంచుకోగా, మరో మూడు సంస్థలూ భాగస్వామ్యం అయ్యాయి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కొన్నేళ్ల క్రితం జెట్ ఎయిర్‌వేస్ సంస్థ తీవ్ర ఇబ్బందుల్లో పడి విమాన సర్వీసులను నిలిపివేసింది. విమానయానంలో దాని వాటా 21.7 శాతమే కావడంతో తీవ్ర ఇబ్బందులేమీ ఎదురుకాలేదు. ఇతర సంస్థల విమానాలతో సర్దుబాటు అయింది. ప్రయాణికులు అవస్థలు పడటం, విమాన చార్జీలు చుక్కలను తాకడం వంటివేమీ పెద్దగా జరగలేదు. ఇప్పుడు ఒక్క ఇండిగో చేతిలోనే 63% వాటా ఉండటంతో.. ఆ సంస్థ విమానాలు రద్దవడంతో విమానయానం గందరగోళంలో పడింది. తక్కువగా విమానాలున్న ఇతర సంస్థలు ఒక్కసారిగా చార్జీలను పదింతలు పెంచాయి. మరిన్ని సంస్థలు రంగంలో ఉంటే ఇలాంటి పరిస్థితి తలెత్తేది కాదని ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

2014 డిసెంబరులో..

సంస్థ	వాటా(%)
ఇండిగో	31.8
జెట్ ఎయిర్‌వేస్	21.7
ఎయిరిండియా	18.4
స్పైస్‌జెట్	17.4
గో ఎయిర్	9.2
ఎయిర్‌కోస్టా	0.9
ఎయిర్‌ఆసియా	0.5

2025 నవంబరులో..

సంస్థ	వాటా(%)
ఇండిగో	63.0
ఎయిరిండియా	19.9
విస్తారా	5.7
ఆకాశ ఎయిర్	4.6
స్పైస్‌జెట్	3.2
ఇతరులు	3.6

లండన్, కువైత్‌ల నుంచి శంషాబాద్‌కు వచ్చే విమానాలకు బాంబు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజులుగా వరుసగా ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయి. శనివారం రెండు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. లండన్‌లోని హీత్రూ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న బీఏ 277 విమానాన్ని పేల్చేస్తామంటూ ఉదయం జీఎంఆర్ కస్టమర్ ఐడీకి మెయిల్ రాగా సిబ్బంది భద్రతాధికారులకు సమాచారమిచ్చారు. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉదయం 5.30గంటలకు ల్యాండైన తర్వాత తనిఖీలు నిర్వహించారు. విమానంలో ఎలాంటి బాంబులేదని తేల్చారు. విమానం తిరిగి లండన్‌కు వెళ్లింది. అలాగే కువైత్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్న కేయూ 373 విమానాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి శనివారం తెల్లవారుజామున జీఎంఆర్ కస్టమర్ ఐడీకి మెయిల్ వచ్చింది.

ఇండిగో సంక్షోభం.. బాధ్యులెవరో తేలుస్తాం

» 'ఆంధ్రజ్యోతి'తో పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఇండిగో విమానాల రద్దుకు బాధ్యులెవరో తేలుస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. డీజీసీఏ కొత్త నిబంధనలు వచ్చి నెల రోజులు దాటిపోయింది. మరి ఇన్ని రోజులు లేని సమస్య ఇప్పుడు ఒక్కసారిగా ఎందుకు వచ్చింది? అంత భారీ స్థాయిలో విమానాలు ఎందుకు రద్దయ్యాయి? దీనికి కారణమేంటి? ఎవరు బాధ్యులు?' అనేది తేల్చేందుకు పకడ్బందీగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దీనిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీసీఏను ఆదేశించామని, ఆ నివేదిక అందాక బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో రామ్మోహన్‌నాయుడు శనివారం ఢిల్లీలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సోమవారానికల్లా ఇండిగో విమాన సర్వీసులు యథాతథంగా నడిచేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. విమానాశ్రయాల్లో చిక్కుకున్న ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఇండిగో సంక్షోభాన్ని సొమ్ము చేసుకునేందుకు ఇతర విమానయాన సంస్థలు చార్జీలు పెంచకుండా నియంత్రణలు విధించామని చెప్పారు. మన దేశంలో కేవలం రెండు విమానయాన సంస్థల ఆధిపత్యమే ఉందని, టికెట్ల ధరల తగ్గింపులో పోటీతత్వం లేదని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈ ఆధిపత్యాన్ని సరిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని.. మరిన్ని ప్రైవేటు సంస్థలు ఈ రంగంలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని వివరించారు. అంతిమంగా ప్రయాణికులకు లబ్ధి దక్కేలా చూడటమే తమ కర్తవ్యమని చెప్పారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక కొత్తగా మూడు ఎయిర్‌లైన్స్ సంస్థలకు అనుమతి ఇచ్చామన్నారు.

ఢిల్లీ పోలీసుల నోటీసుపై న్యాయపోరాటం: డీకే

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ వివాదానికి సంబంధించి ఢిల్లీ పోలీసుల నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందానని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తానన్నారు. నోటీసులతో షాక్ అయ్యానని.. తనతోపాటు తన తమ్ముడు మాజీ ఎంపీ డీకే సురేశ్‌కు గతంలోనే ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. పార్టీ క్లిష్ట సమయంలో ఉన్నపుడు తమ లాంటి కాంగ్రెస్ నేతలు ట్రస్టుల ద్వారా సాయం చేశామన్నారు. తమ పార్టీకే కాకుండా ఇతరులకూ నిధులు ఇస్తామని.. ఈ వివాదంలో పోలీసు కేసులు, నోటీసులు అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పోలీసుల నోటీసును వేధింపులుగా భావిస్తున్నానన్నారు.

నెహ్రూపై పథకం ప్రకారమే దుష్ప్రచారం: సోనియా

న్యూఢిల్లీ, డిసెంబరు 6 : భారత తొలి ప్రధాని నెహ్రూ అందించిన సేవలను విశ్లేషించడం, విమర్శించడంలో తప్పులేదుగానీ, ఆయన చెప్పినవాటిని, రాసినవాటిని కావాలని వక్రీకరించడం బీజేపీకి తగదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ విమర్శించారు. నెహ్రూను దూషించడాన్నే కేంద్రంలోని అధికార పార్టీ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపించారు. నెహ్రూ ఘనతలను తుడిచిపెట్టడమే కాకుండా, ఈ దేశ నిర్మాణం కోసం ఆయన వేసిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పునాదులను ధ్వంసం చేయడమే బీజేపీ లక్ష్యమని సోనియా మండిపడ్డారు. ఢిల్లీలోని జవహర్ భవన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన నెహ్రూ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు.

బెంగాల్‌లో 'బాబ్రీ మసీదు' నిర్మాణం ప్రారంభం

కోల్‌కతా, డిసెంబరు 6: పశ్చిమబెంగాల్‌లో బాబ్రీ మసీదును పోలి ఉన్న మసీదు నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఉద్రిక్తతకు దారితీసింది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ఆధ్వర్యంలో ముర్షిదాబాద్ జిల్లా రేజినగర్‌లో ముస్లిం మతపెద్దలు రిబ్బన్ కత్తిరించి ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులను, కేంద్ర బలగాలను మోహరించారు. రూ.300 కోట్లతో ఈ మసీదు నిర్మాణం కానుందని, ఇదే ప్రాంగణంలో మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, యూనివర్సిటీ, హెలిప్యాడ్ నిర్మిస్తామని కబీర్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో తాజా పరిణామాలతో రాజకీయాలు వేడెక్కాయి. 1992లో అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసమైన డిసెంబరు ఆరును దృష్టిలో పెట్టుకుని బెంగాల్ రేజినగర్‌లో ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం ప్రకంపనలు సృష్టించింది.

'పరీక్షా పే చర్చ' కోసం రిజిస్ట్రేషన్ల ఆహ్వానం

న్యూఢిల్లీ, డిసెంబరు 6: విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతి ఏటా నిర్వహిస్తున్న 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం 9వ ఎడిషన్‌ను 2026 జనవరిలో నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యాశాఖ అధికారులు తెలిపారు. అందుకోసం జనవరి 11 వరకు రిజిస్ట్రేషన్లను ఆహ్వానిస్తున్నామన్నారు. ఆరు నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రధానితో నేరుగా మాట్లాడి ప్రశ్నలు అడిగే అవకాశం దక్కించుకునేందుకు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారిని ఎంపిక చేయడం కోసం డిసెంబరు 1 నుంచి జనవరి 11 వరకు మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలతో కూడిన ఆన్‌లైన్ పోటీ పరీక్షను నిర్వహిస్తున్నారు.

'పినాకా' రాకెట్ వ్యవస్థ బలోపేతం

» ఎంకే-4 వేరియంట్ అభివృద్ధిని ప్రారంభించిన డీఆర్‌డీవో

» 300 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం




న్యూఢిల్లీ, డిసెంబరు 6: అత్యాధునిక రాకెట్ లాంచర్ వ్యవస్థ 'పినాకా'ను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డీఆర్‌డీవో పినాకా ఎంకే-4 గైడెడ్ రాకెట్ వేరియంట్ అభివృద్ధిని ప్రారంభించింది. 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యంతో దీన్ని రూపొందిస్తున్నారు. ఇది 250 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఈ వ్యవస్థలో డీఆర్‌డీవోకు చెందిన రిసెర్చ్ సెంటర్ ఇమ్రాత్ (ఆర్‌సీఐ) అభివృద్ధి చేసిన అత్యాధునిక గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ సిస్టమ్‌ను ఉపయోగించారు. పినాకా ఎంకే-4ను గైడెడ్ రాకెట్‌గా వర్గీకరించినప్పటికీ.. అత్యాధునిక క్రూయిజ్ క్షిపణులతో పోల్చదగిన కచ్చితత్వంతో టార్గెట్‌పై విరుచుకుపడుతుందని, వాటి ఉత్పత్తి వ్యయంలో 25% మాత్రమే ఉంటుందని డీఆర్‌డీవో అధికారి ఒకరు వెల్లడించారు. సాధారణంగా సాంప్రదాయ గైడెడ్ రాకెట్లు లక్ష్య ఛేదనలో ప్రోగ్రామ్డ్ గైడెన్స్ వ్యవస్థపై ఆధారపడి పనిచేస్తాయి. పినాకా ఎంకే-4ను అత్యాధునిక ఫీచర్లతో తయారు చేస్తున్నారని, అనూహ్యమైన విన్యాసాలు చేసేలా ఈ రాకెట్‌ను రూపొందిస్తున్నామని డీఆర్‌డీవో వర్గాలు పేర్కొన్నాయి.

భారత్‌కు ఇజ్రాయెల్ లైట్ మెషిన్ గన్స్!

వచ్చే ఏడాది ప్రారంభంలో లైట్ మెషిన్ గన్స్ (ఎల్‌ఎంజీ) మొదటి బ్యాచ్‌ను భారత్‌కు సరఫరా చేయనున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ పరికరాల సంస్థ ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ) వెల్లడించింది. దీంతో పాటుగా దాదాపు 1.70 లక్షల కొత్త తరం కార్బైన్ల సరఫరాకు సంబంధించిన ఒప్పందం తుది దశలో ఉందని సీఈవో షుకి స్క్వార్ట్జ్ తెలిపారు.

కొన ఊపిరితో ఇండి కూటమి!

» అంతర్గత కుమ్ములాటలతో బీజేపీని ఎదుర్కోవడంలో విఫలం: ఒమర్ అబ్దుల్లా



న్యూఢిల్లీ, డిసెంబరు 6: ప్రతిపక్ష ఇండి కూటమి ప్రస్తుతం కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోందని జమ్మూకశ్మీర్ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) పార్టీ నాయకుడు ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. అంతర్గత కుమ్ములాటలు, బీజేపీకి చెందిన 24 గంటల ఎన్నికల యంత్రాంగాన్ని ఎదుర్కోవడంలో వైఫల్యం వల్ల ఇండి కూటమిని ఐసీయూలోకి తీసుకెళ్లాల్సిన ముప్పు ఏర్పడిందన్నారు. ఇండి కూటమిలో ఎన్‌సీ కూడా భాగస్వామిగా ఉంది. తమ కూటమి సంస్థాగత, వ్యూహాత్మక వైఫల్యాలను శనివారం ఢిల్లీలో ఒక ఆంగ్ల పత్రిక నిర్వహించిన నాయకత్వ సదస్సులో ఆయన వివరించారు. ప్రత్యేకించి బిహార్ ఎన్నికల తర్వాత పరిస్థితి గురించి ఆయన మాట్లాడుతూ 'మేం లైఫ్ సపోర్టు మీద ఉన్నాం. ప్రతిసారీ ఎవరో ఒకరు మాకు షాక్ ఇస్తూనే ఉన్నారు. మేం మళ్లీ లేస్తున్నాం. దురదృష్టవశాత్తూ బిహార్‌లాంటి ఫలితాలు వస్తుండటంతో మేం మళ్లీ పడిపోతున్నాం. అప్పుడు ఎవరైనా మమ్మల్ని ఐసీయూలోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది' అన్నారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ తిరిగి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోకి వెళ్లడానికి ఇండి కూటమే కారణమని ఆయన నిందించారు. అధికార పార్టీలో ఉన్నంత క్రమశిక్షణ వైఖరి నిర్మాణాత్మకంగా ప్రతిపక్ష కూటమిలో లేదని చెప్పారు. అయితే, బీజేపీని బలంగా ఎదుర్కోడానికి తమ ముందున్న ఏకైక మార్గం కూటమిలోని అతిపెద్ద భాగస్వామి అయిన కాంగ్రెస్ చుట్టూ చేరడమేనని చెప్పారు. కూటమిలో దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక పార్టీ అదేనన్నారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో గెలుస్తున్నారనే వాదనను తానెప్పుడూ సమర్థించలేదని, అయితే.. ఓటర్ల జాబితా, నియోజకవర్గాల పునర్విభజనతో ఎన్నికలను తారుమారు చేయొచ్చన్నారు.

సైన్యానికి త్రీడీ బంకర్లు!

» హైదరాబాద్ ఐఐటీ స్టార్టప్ ఆవిష్కరణ



న్యూఢిల్లీ, డిసెంబరు 6: భారత సైన్యం, హైదరాబాద్ ఐఐటీ కలిసి సరిహద్దుల్లో త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో మిలిటరీ బంకర్లను నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. బంకర్ నిర్మించదలచుకున్న సైట్ వద్దకే నేరుగా రోబోటిక్ ప్రింటర్‌ను తీసుకెళ్లారు. అక్కడి భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అప్పటికప్పుడు అక్కడ నిర్మించాల్సిన బంకర్లను డిజైన్ చేస్తారు. వెంటనే త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో బంకర్‌ను సైట్‌లోనే బ్లాక్‌లుగా ప్రింట్ చేస్తారు. అక్కడే క్యూరింగ్ చేసి, బ్లాక్‌లను జతచేసి బంకర్‌ను నిర్మిస్తారు. 14 గంటల్లో బ్లాక్‌ల ప్రింటింగ్ పూర్తవుతుంది. 5 రోజుల్లో వాటిని క్యూరింగ్ చేసి, బంకర్ నిర్మాణం కూడా పూర్తి చేస్తారు. లద్దాఖ్‌లోని లేహ్ ప్రాంతంలో సముద్రమట్టానికి 11 వేల అడుగుల ఎత్తున త్రీడీ బంకర్‌ను కాంక్రీట్ ప్రింటింగ్ చేసి, బ్లాక్‌లను అసెంబుల్ చేశారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో జరిగిన త్రీడీ ప్రింటింగ్ బంకర్ నిర్మాణం. ఐఐటీలో భాగంగా ఉన్న స్టార్టప్ సింప్లిఫోర్జ్ క్రియేషన్స్, మిలిటరీలో భాగంగా ఉన్న త్రిశక్తి కోర్ కలిసి తొలి త్రీడీ ప్రింటింగ్ బంకర్‌ను నిర్మించాయి.

స్థానిక మెటీరియల్‌తోనే

త్రీడీ ప్రింటింగ్‌కు ఉద్దేశించిన యంత్రాన్ని వాహనం మీద అమర్చారు. దాంతో దాన్ని నేరుగా నిర్మాణ స్థలానికే తీసుకెళ్లి అక్కడే బ్లాక్‌లుగా త్రీడీ ప్రింటింగ్ చేయవచ్చు. ప్రతీ బ్లాక్‌ను కంప్యూటర్‌లో నిర్దేశించిన డిజైన్ ప్రకారం యంత్రంలోని రోబోటిక్ హస్తం పొరలు పొరలుగా కాంక్రీట్ మెటీరియల్‌తో పోస్తుంది. బ్లాక్‌లు జత చేస్తే గోడలు, పైకప్పు పూర్తవుతుంది. కొండల్లో కూడా నిర్విఘ్నంగా చేయగలగడం ఈ పోర్టబుల్ యంత్రం గొప్పదనం. అత్యంత ఎత్తులో, ఆక్సిజన్ తక్కువగా, జీరో కన్నా తక్కువ డిగ్రీల వాతావరణంలోనూ నిర్విఘ్నంగా ఈ యంత్రంతో పని చేయించవచ్చు. గతంలో బంకర్ల నిర్మాణానికి వారాలు పట్టేది. అవి, అంత సౌకర్యంగా కూడా ఉండేవి కాదు. ప్రీకాస్ట్ బ్లాక్‌లను కిందనుంచి కొండ మీదకు తీసుకెళ్లడం సవాలుతో కూడుకున్న వ్యవహారం. త్రీడీ ప్రింటింగ్ అవడం వల్ల బంకర్ మొత్తం ఒకే మందంతో ధృడంగా ఉంటోంది. స్థానికంగా దొరికే సిమెంట్ కంకరనే వాడతారు. దాంతో ఖర్చు బాగా తగ్గిపోతోంది. త్రీడీ బంకర్ల ధృఢత్వాన్ని ఇప్పటికే పేలుడు పదార్థాల ద్వారా పరీక్షించారు. తక్కువ కాలంలో ఎక్కువ బంకర్లను నిర్మించే అవకాశం ఉండటం వల్ల భారత సైనికులకు మునపటి కన్నా మెరుగైన రక్షణ లభిస్తుంది. ఈ టెక్నాలజీతో విపత్తుల సమయంలో బాధితులకు వేగంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడం వీలు కుదురుతుంది.

నన్ను చంపండి!

» మరణావస్థలో శిశు చీమల సంకేతం

» గమనించి వాటికి విషమిచ్చే పెద్ద చీమలు

» పుట్ట మొత్తం ఇన్ఫెక్షన్ల బారిన పడొద్దనే



న్యూయార్క్, డిసెంబరు 6: శిశు దశలో ఉన్న చీమలు (వీటిని ప్యూపా అంటారు) ఏదైనా ఆరోగ్య సమస్యతో మరణావస్థలో ఉన్నప్పుడు తమను చంపమని (కిల్ మీ) పెద్ద చీమలకు ఒక సంకేతం పంపుతాయని, తద్వారా చీమల పుట్ట ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. చీమలు ఆహారం కోసం పుట్ట బయటకు వచ్చి మళ్లీ లోనకు వెళ్లే క్రమంలో వాటితోపాటు అనేకమైన సూక్ష్మక్రిములు పుట్టలోకి ప్రవేశిస్తుంటాయి. వీటి బారిన పడి ఏదైనా పెద్ద చీమ తీవ్ర అనారోగ్యం పాలై.. ఇక జీవించే అవకాశం లేదనకున్నప్పుడు.. పుట్ట బయటకు వచ్చి ప్రాణాలు వదులుతుంది. తద్వారా ఇతర చీమలకు ఇన్ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్త తీసుకుంటుంది. కానీ, పెరిగే దశలోనే ఉన్న శిశు చీమలు.. ఆహారం సేకరించే సామర్థ్యం వచ్చే వరకూ పుట్టలోనే ఉంటాయి. అవి ఎన్నడైనా ఇన్ఫెక్షన్లకు గురై చనిపోయే స్థితిలో ఉన్నప్పుడు.. తమ శరీరం నుంచి ఒక ఘాటైన వాసన వెదజల్లుతున్నాయని ఆస్ట్రియా శాస్త్రవేత్తలు పరిశోధనల్లో గుర్తించారు. ఈ ఘాటైన వాసన ఒక సంకేతమని, అది రాగానే.. పుట్టలోని పెద్ద చీమలు అనారోగ్యంపాలైన శిశు చీమ ఉన్న గూడును తెంపివేసి, దాని శరీరంలోకి విషాన్ని పంపుతాయని వెల్లడైంది. ఈ విషంతో శిశు చీమ మరణించటమేగాక, దానికి సోకిన సూక్ష్మక్రిములు కూడా నాశనమై పుట్ట మొత్తం ఇన్ఫెక్షన్ బారిన పడకుండా రక్షణ లభిస్తుందని పరిశోధకులు వెల్లడించారు. చీమల్లో కనిపిస్తున్న ఈ ప్రక్రియ.. వాటిలోని సమష్టితత్వాన్ని వెల్లడిస్తుందని, తమ కాలనీని, ఉమ్మడి జన్యువులను కాపాడుకోవటం కోసం అవి వ్యక్తికన్నా సమష్టికి ప్రాధాన్యతనిస్తాయని మరోసారి రుజువైందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.